4-11Pg1exHMNWJQE 1 GNT_4-11Pg1exHMNWJQE.qxd 03/Nov/25 11:48 PM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
4-11-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 273 పేజీలు: 12 వెల: 6.50

పరిశోధనలే దేశ భవిష్యత్తు: ప్రధాని మోడీ

పాకిస్థాన్ అణ్వాయుధాలను పరీక్షిస్తోంది!: ట్రంప్ 9లో

# 20 వేల కోట్ల పెట్టుబడులు


సోమవారం లండన్‌లో హిందుజా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంటున్న దృశ్యం

## ముందుకొచ్చిన హిందుజా గ్రూప్

సిఎం చంద్రబాబు సమక్షంలో ఎపి ప్రభుత్వంతో ఎంఓయు

విశాఖలో పవర్ ప్లాంట్ సామర్థ్యం మరో 1600 మెగావాట్ల ఉత్పత్తికి పెంపు

రాయలసీమలో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల ఏర్పాట్లు

కృష్ణాజిల్లా మల్లవల్లిలో ఎలక్ట్రిక్ బస్సులు, తేలికపాటి వాహనాల తయారీ ప్లాంట్ ఏర్పాటు

**విజయవాడ, నవంబరు 3, ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో వివిధ రంగాల్లో పెట్టుబడులకు హిందుజా గ్రూప్ పెట్టుబడులకు ముందుకు వచ్చింది. లండన్‌లో వ్యక్తిగత పర్యటన నిమిత్తం వెళ్లిన సిఎం చంద్రబాబు మరో వైపు ఎపికి పెట్టుబడులను ఆకర్షించే దిశలో అక్కడి పారిశ్రామిక వేత్తలతో విస్తృతంగా భేటీ అవుతున్నారు. ఈ క్రమంలో ఆయన హిందుజా గ్రూప్ భారత చైర్మన్ అశోక్ హిందుజా, యూరప్‌లోని హిందుజా గ్రూప్ చైర్మన్ ప్రకాశ్ హిందుజా, హిందుజా రెన్యువబుల్స్ ఫౌండర్ శోమ్ హిందుజాలతో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. రాష్ట్రంలో బలీయంగా ఉన్న ఉపరితల, రోడ్డు రవాణా, సముద్రయాన వ్యవస్థలను గురించి వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో ఎపిలో అందు బాటులోకి వస్తున్న విమానాశ్రయాలు, ప్రస్తుతం ఉన్న ఎయిర్‌పోర్టులు గురించి తెలిపారు. రహదారి రవాణా వ్యవస్థల గురించి వివరించారు. పోర్టుల అభివృద్ధిని గురించి వివరించారు. రాజధాని అమరావతి నగర నిర్మాణం ఇతరంశాలపై వారికి వివరించారు. ఈ నేపథ్యంలో ఎపిలో >>2

## లండన్ ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ ప్రతినిధులతో సిఎం భేటీ

రాష్ట్రంలో రెండు భారీ పరిశ్రమలకు ఈ నెలలో శంకుస్థాపన 2లో



# నెత్తురోడిన రోడ్లు

బాపట్ల జిల్లా కర్లపాలెం వద్ద కారు, లారీ ఢీ

నలుగురు దుర్మరణం, ఇద్దరికి గాయాలు

మృతులంతా ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు బంధువులే

**కర్లపాలెం,నవంబరు 3,ప్రభాతవార్త:** బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం సత్యవతి పేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు ఇరువురి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. నరసాపూర్ నుంచి బాపట్ల వైపు వస్తున్న లారీని బాపట్ల నుంచి కర్లపాలెం వస్తున్న కార్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం నలుగురు వ్యక్తులు చనిపోగా ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. కర్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శాసన సభ్యుని కుమార్తె పెళ్ళి సందర్భంగా నిర్వహించిన వేడుకల కార్యక్రమానికి హాజరై తిరిగి వెళుతూ ఉండగా సత్యవతి పేట వద్ద కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కర్లపాలెంకు చెందిన బేతాళం బలరామరాజు(65), ఆయన భార్య బేతాళం లక్ష్మి(60), బలరామరాజు వీపరాలు గాదిరాజు పుష్పవతి (60). ముదుచారి శ్రీనివాసరాజు (54) అక్కడికక్కడే మృతి చెందారు వీరితో పాటు >>2

## చేవెళ్లవద్ద బస్సును ఢీకొన్న టిప్పర్





19 మంది మృతి, 20 మందికి పైగా గాయాలు

మృతుల్లో శిశువుతో సహా 10 మంది మహిళలు

రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం

ఎక్స్‌గ్రేషియా ప్రకటన

*అమ్మా వెళ్లొస్తా... నాన్న వెళ్తున్నా... ఇవే ఆ చిన్నారుల చివరి మాటలు... భేటీ... పాప జాగ్రత్త... ఇవే వాళ్ల ఆఖరి పలుకులు... చివరి చూపులు... అమ్మా చదువుకోవాలి... ఎగ్జామ్స్ దగ్గర పడుతున్నాయి... వెళ్లొస్తానంటూ చెప్పిన ఆ కూతుళ్ల మాటలు ఆగిపోయాయి. ప్రేమానురాగాలతో భర్తను చూస్తాననే ఆశతో బయలుదేరిన మహిళ... మెట్టినింటికి చేరకుండానే ప్రాణాలు కోల్పోయింది. భార్యను ఆస్పత్రికి తీసుకెళ్తూ దంపతులు కన్నుమూశారు. ఇలా ఎన్నో ఆశలతో బయలుదేరి ప్రయాణికులు గమ్యం చేరకుండానే అనంత లోకాలకు వెళ్లిపోయారు. సోమవారం ఉదయం చేవెళ్ల రహదారిపై ఆర్‌టిసిబస్సు, టిప్పర్ ఢీకొన్న ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతులది ఒక్కొక్కరిది ఒక్కో గాథ. అంతా క్షేమం అనుకున్న సమయంలో బస్సు ప్రమాద సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు.*

వివరాలు '8'లో



## జైపూర్‌లో టిప్పర్ బీభత్సం 2లో

పార్క్ చేసిన వాహనాలపై దూసుకెళ్లిన వైనం

14 మంది దుర్మరణం

50 మందికి పైగా గాయాలు



## ఎస్టీ కమీషన్ చైర్మన్‌గా బొజ్జిరెడ్డి

**విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ (ఎస్‌టి)చైర్మన్, మెంబర్లను నియమించింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం జిఒఆర్‌టి నెంబరు 155ను విడుదల చేసింది. కమిషన్ చైర్మన్‌గా రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన సొల్ల బొజ్జిరెడ్డిని నియమించారు. మెంబర్లుగా గొర్లె సునీత(రంపచోడవరం ఎస్‌టి), కద్రకమల్లేశ్వరరావు (కురుపాం), కాకిలక్ష్మి (రంపచోడవరం), సాయిరాంకిల్లో (అరకువ్యాలీ) పి.వెంకటప్ప (గుంతకల్లు) నియమించారు. వీరందరూ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు.

## జోగి బ్రదర్స్‌కు 13 వరకు రిమాండ్

నెల్లూరు జైలుకు తరలింపు

**విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** నకిలీ మద్యం కేసులో అరెస్ట్ అయిన మాజీ మంత్రి జోగి రమేష్‌కు న్యాయస్థానం ఈ నెల 13 వరకు రిమాండును విధించింది. రమేష్‌తో పాటు ఆయన సోదరుడు జోగి రాముకు కూడా న్యాయమూర్తి రిమాండు విధించారు. జోగి రమేష్, రామును పోలీసులు విజయవాడ జైలుకు తరలించారు. ఆదివారం ఉదయం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో జోగి రమేష్‌ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. తూర్పు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో జోగి రమేష్‌ను సుమారు 12 గంటల పాటు సిట్ అధికారులు విచారిం >>2



## అనిల్ అంబానీకి ఇడి షాక్

ఇల్లుతోపాటు రూ. 3,084 కోట్ల ఆస్తులు జప్తు

మనీ లాండరింగ్ కేసులో చర్య

**న్యూఢిల్లీ, నవంబరు 3:** ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) గట్టిషాక్ ఇచ్చింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్), రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌సిఎఫ్‌ఎల్) సంస్థల్లో ప్రజాధనాన్ని పక్కదారి పట్టించారన్న ఆరోపణలతో ముడి >>2

# విశాఖ సమ్మిట్‌పై గంపెడాశలు

- రూ.9.8 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలకు అవకాశాలు
- 45 దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు వస్తున్నారు
- డబుల్ ఇంజన్ బుల్లెట్ సర్కార్ వల్లే భారీ పరిశ్రమల రాక
- విద్వేషాలు రెచ్చగొడుతున్న వైసిపి... అన్నీ ప్రజల ముందు ఉంచుతున్నాం
- సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ సన్నాహక చర్యలపై మంత్రి లోకేష్


సోమవారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

**అమరావతి, నవంబరు 3 ప్రభాతవార్త:** విశాఖపట్నంలో ఈ నెల 14, 15 తేదీల్లో పార్టనర్ షిప్ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతోన్నాం. ఈ సదస్సులో పెద్దఎత్తున పెట్టుబడి చర్చలు జరుగుతాయి. పారిశ్రామికవేత్తలతో పాటు పాలసీ మేకర్లు హాజరై రాబోయే పదేళ్లలో పారిశ్రామిక రంగంలో ఎలాంటి మార్పులు రాబోతున్నాయి, అందులో భారత్, ఆంధ్రప్రదేశ్ పాత్ర ఏమిటి అనే అంశాలపై విస్తృతమైన చర్చలు జరుగుతాయని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పార్టనర్ షిప్ సమ్మిట్ -2025 సన్నాహక ఏర్పాట్లపై మంత్రి లోకేష్ ఉన్నతస్థాయి సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎక్సైజ్, గనుల శాఖల మంత్రి కొల్లు రవీంద్ర, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి లోకేష్ విలేకరులతో మాట్లాడుతూ... పార్టనర్ షిప్ సమ్మిట్‌కు నిర్మలా సీతారామన్, పీయుష్ గోయల్, అశ్వనీ వైష్ణవ్ లాంటి కేంద్ర మంత్రులు హాజరు కానున్నారు. ఇప్పటివరకు 45దేశాల నుంచి 300 మంది వివిధ రంగాల ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు వస్తున్నట్లు మాకు సమాచారంఉంది. సమ్మిట్‌లో 12 మల్టీ లాటరల్ ఆర్గనైజేషన్స్, 72 మంది ఇంటర్నేషనల్ స్పీకర్స్ పాల్గొంటారు. 48 స్పీకింగ్ సెషన్స్‌లో సెక్టార్లవారీగా వివిధ అంశాలపై విస్తృతంగా చర్చలు జరుపుతాం. ఈసారి పార్టనర్ షిప్ సమ్మిట్‌లో 410 ఎంఓయూలపై సంతకం చేయబోతున్నాం. వీటిద్వారా రూ.9.8లక్షల కోట్ల పెట్టుబడులు, 7.5లక్షల ఉద్యోగావకాశాలు రాబోతున్నాయి.

**స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాల వల్లే పరిశ్రమల రాక**

ఆంధ్రప్రదేశ్‌లో అవలంభిస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాల వల్లే కంపెనీలు తమ పెట్టుబడులకు ఏపీని ఎంచుకుంటున్నాయి. పక్క రాష్ట్రాలు కూడా పోటీపడి ఇన్సెంటివ్స్ ఇస్తున్నా ఏపీ వైపు మొగ్గుచూపడానికి స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాలే కారణం. టిసిఎస్, ప్రీమియర్ ఎనర్జీ, రెన్యూపవర్ వంటి భారీ కంపెనీలు అందువల్లే క్యూ కట్టాయి. ఏపీలో అద్భుతమైన సీ కోస్ట్ లైన్ ఉంది. గ్రాండ్ కానియన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన గండికోట ఉంది. సమర్థవంతమైన టాలెంట్ పూల్, పోర్టు లాజిస్టిక్ లింకేజి ఉంది. ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహిస్తున్నాం. పర్యాటక రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి.

**అభివృద్ధి వికేంద్రీకరణే మా లక్ష్యం**

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వ లక్ష్యం అభివృద్ధి వికేంద్రీకరణ. క్లస్టర్ బేస్డ్ అభివృద్ధిపై దృష్టిసారించాం. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధే మా ధ్యేయం. అందుకు అనుగుణంగానే >>2


సోమవారం తాడేపల్లిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

# ధాన్యం కొనుగోలు షురూ!

తాడేపల్లిగూడెంలో ప్రారంభం

51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

కౌలు రైతులకు నూరు శాతం సబ్సిడీపై 50వేల తార్పాలిన్లు ఉచితంగా అందజేస్తాం

అభివృద్ధి, సంక్షేమం రెండు జరగాల్సిందే: మంత్రి నాదెండ్ల

**తాడేపల్లిగూడెం, నవంబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 51లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాందేడ్ల మనోహర్ వెల్లడించారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో రాష్ట్రంలోనే మొట్ట మొదటి ఖరీఫ్‌ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రైతులను నూటికి నూరు శాతం ఆదుకుంటామని ఎవరు అధైర్య పడవద్దు అన్నారు. కౌలు రైతులకు నూరు శాతం సబ్సిడీపై 50 వేల తార్పాలిన్లను ఉచితంగా అందచేయనున్నట్లు తెలిపారు.
ఇప్పటికే అవసరమైన గన్ని బ్యాగులను సిద్ధం చేయడం జరిగిందని, ఎక్కడ గన్ని బ్యాగులు కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యాన్ని వేగవంతంగా మిల్లులకు తరలించేందుకు 34 వేల వాహనాలను ఏర్పాటు >>2

## ఏనుగుల బెడద నివారణకు

# ఎఐ ఆధారిత వ్యవస్థ


చిత్తూరు జిల్లాలో సౌర శక్తి సాయంతోఏర్పాటుచేసిన ఎఐ ఆధారిత వ్యవస్థ

చిత్తూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఏర్పాటు

పంటల నష్టం నివారించడం లో కీలక పాత్ర

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వెల్లడి

**విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** సౌరశక్తి సాయంతో పనిచేస్తూ ఏనుగుల సంచారాన్ని గుర్తించడంతోపాటు ఏనుగులని స్వల్పంగా భయపెట్టి సహజ సిద్ధమైన నిరోధక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. పంటలను ధ్వంసచేస్తున్న ఏనుగుల తాకిడిని తట్టుకునేందుకు చిత్తూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థ ఎఐ ఆధారితమై ఉంటుందని వివరించారు. ఇప్పటికే అడవి ఏనుగుల సమస్య పరిష్కారానికి కర్ణాటక ప్రభుత్వ సహకారంతో నాలుగు కుంకీ ఏనుగులను ఎపికి తీసుకువచ్చామని గుర్తుచేశారు. ఇప్పటికే పలు సందర్భాల్లో గ్రామాల్లోకి చొరబడిన అడవి ఏనుగులను కుంకీలు విజయవంతంగా, సురక్షితంగా అడవిలోకి మళ్లించాయని చెప్పుకొచ్చారు పవన్ కల్యాణ్.
ఏనుగుల బెడద నుంచి సరిహద్దు గ్రామాల ప్రజలకు రక్షణ కల్పించే చర్యలను మరింత ముందుకు తీసుకువెళ్లే కార్యక్రమంలో భాగంగా అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), మిషన్ లెర్నింగ్ విధానంతో పని చేసే సరికొత్త వ్యవస్థను ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈవ్యవస్థ ఏనుగుల సంచా >>2



## 20న తిరుమలకు రాష్ట్రపతి ముర్ము

**తిరుమల, నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి:** భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి దర్శనార్థం ఈనెల 20న విచ్చేస్తున్నారు. రెండురోజుల పర్యటనలో భాగంగా ఆమె తొలుత 20వతేదీ సాయంత్రం తిరుచానూరు పద్మావతిఅమ్మవారిని దర్శించుకుంటారు. 21న ఉదయం తిరుమలేశుని సేవలో పాల్గొంటారు. రాష్ట్రపతి పర్యటనతో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపడుతోంది.

4-11pg2exHMNWJQE 2_4-11pg2exHMNWJQE.qxd 03/Nov/25 11:44 PM Page 1





సోమవారం లండన్ ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు భేటీ దృశ్యం

# లండన్ ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ ప్రతినిధులతో సీఎం భేటీ

**విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** పెట్టుబడులకు ఏపీ అత్యంత అనుకూల ప్రాంతమని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విస్తారమైన కోస్తా తీరం, వివిధ వాణిజ్య అంశాల్లో ప్రభుత్వ పరమైన సహకారం అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఏఐ, క్వాంటం కంప్యూటర్ రంగంతో పాటు, పర్యాటక రంగంలోను, విద్యుత్తు రంగంలోను అభివృద్ధికి ప్రణాళికాయుతంగా ముందుకు వెళ్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు లండన్ పర్యటనలో పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతున్నారు.

ఈ పర్యటనలో భాగంగా, ఆయన లండన్‌లోని అతిపెద్ద విద్యుత్ సరఫరా సంస్థ అయిన ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ ప్రతినిధులతో భేటీఅయ్యారు. రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధనరంగంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ క్రిస్ ఫిట్జ్ తో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పునరుత్పాదక విద్యుత్ రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆ సంస్థను సీఎం ఆహ్వానించారు. ముఖ్యంగా అమరావతి, విశాఖపట్నం వంటి నగరాల్లో నూతన టెక్నాలజీ ద్వారా విద్యుత్ సరఫరా, నియంత్రణ రంగంలో కలిసి పనిచేసేందుకు అపార అవకాశాలు ఉన్నాయని చంద్రబాబు వివరించారు.

క్లీన్ ఎనర్జీ, స్మార్ట్ గ్రిడ్, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక రంగాల్లో ఏపీలో పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పునరుత్పాదక ఇంధనానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి వారికి తెలిపారు. విద్యుత్ రంగంలో ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు, లక్ష్యాలను ఆయన వారికి వివరించారు. రాష్ట్రానికి వచ్చి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, పెట్టుబడులు పెట్టాలని చంద్రబాబు ఆక్టోపస్ ఎనర్జీ ప్రతినిధులను కోరారు.

లండన్ లోని వివిధ పారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరుస సమావేశాలు.. లండన్ లోని వివిధ పారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ రోల్స్ రాయిస్ గ్రూప్ ప్రతినిధులతో సమావేశమయ్యారు.

రోల్స్ రాయిస్ సంస్థ సీటీఓ నిక్కి గ్రేడీ స్మిత్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఏరో ఇంజిన్స్, డిజిల్ ప్రొపెల్లెన్ సిస్టమ్స్ తయారీలో అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ బ్రాండ్ గా రోల్స్ రాయిస్‌కు ఏపీలో ఉన్న అవకాశాలను, వనరుల గురించి రోల్స్ రాయిస్ ప్రతినిధులకు సీఎం వివరించారు. ఒర్వకల్లులో మిలటరీ ఎయిర్ స్ట్రిప్, విమానాల మెయింటెనెన్స్ రిపెయిర్స్ ఓవర్ హాలింగ్ (ఎంఆర్ఓ) యూనిట్ ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. ఏపిలో ఏరోస్పేస్ కాంపోనెంట్స్ ఉత్పత్తికి మెరుగైన అవకాశాలు ఉన్నాయని రోల్స్ రాయిస్ సీటీఓ గ్రేడీ స్మిత్ కు సీఎం చంద్రబాబు తెలిపారు. విశాఖ, తిరుపతిలలో జిసిసి ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు భోగాపురం విమానాశ్రయం సమీపంలోనూ ఏవియేషన్ ఎకోసిస్టం, ఎమ్మార్వో ఫెసిలిటీ ఏర్పాటుకు అవకాశముందని సిఎం చంద్రబాబు వెల్లడించారు.. ఎస్ఆర్ఎం ,ఎంఆర్ఎం, గ్రూప్ ఛైర్మన్ శైలేష్ హిరనందానీతోను ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు.

# 20 వేల కోట్ల పెట్టుబడులు

>> ఉన్న పెట్టుబడుల అవకాశాలను వారికి ముఖ్యమంత్రి వివరించారు. అనంతరం హిందూజా గ్రూప్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. హిందూజా గ్రూప్ పెట్టుబడులు కీలకం అవుతాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపిలో పారిశ్రామిక ప్రగతి కోసం అత్యుత్తమ వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ ఒప్పందంతో రాష్ట్రంలో యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. హిందూజా గ్రూప్ ప్రతిపాదనలు త్వరితగతిన కార్యరూపం దాల్చేలా ప్రత్యేకంగా ఫాస్ట్‌ట్రాక్ విండో ఏర్పాటు ద్వారా ట్రాక్ చేస్తామని హిందూజా ప్రతినిధులకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. దశలవారీగా ఏపీలో రూ.20 వేల కోట్ల పెట్టుబడి పెట్టేలని హిందూజా గ్రూప్ నిర్ణయం తీసుకుంది. విశాఖలో ఉన్న హిందూజా పవర్ ప్లాంట్ సామర్థ్యాన్ని మరో 1,600 మెగావాట్ల ఉత్పత్తి పెంచేందుకు ఒప్పందం, రాయలసీమలో సోలార్, పవన విద్యుత్ ఉత్పత్తి యూనిట్లను ఏర్పాటు చేసే అంశంపై ఒప్పందం చేసుకుంది. కృష్ణా జిల్లా మల్లవల్లిలో ఎలక్ట్రిక్ బస్సులు, తేలికపాటి వాహనాల తయారీ ప్లాంట్ ఏర్పాటుకు అంగీకరించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్ల నెట్వర్క్ ఏర్పాటు అంశంపై కుదిరిన అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఏపిలో గ్రీన్ ట్రాన్స్ పోర్ట్ ఎకో సిస్టంను అభివృద్ధి చేసేలా సహకరించనున్నట్టు హిందూజా గ్రూప్ వెల్లడించింది. హిందూజా గ్రూప్ ప్రతినిధుల్ని విశాఖలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు సీఎం చంద్రబాబు ఆహ్వానించారు.

## రాష్ట్రంలో రెండు భారీ పరిశ్రమలకు

# ఈ నెలలో శంకుస్థాపన

**విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రెండు భారీ పరిశ్రమలకు ఈ నెలలో భూమిపూజ నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. సీఎంవో వర్గాల సమాచారాన్ని అనుసరించి రెండు దశల్లో కలిపి రూ.1,37,400 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నారు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ ఉక్కు కర్మాగారం, శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో రక్షణ రంగానికి చెందిన కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. రెండు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల నిర్మాణ పనులు ఒకే నెలలో ప్రారంభించడం ద్వారా ప్రపంచ దృష్టిని ఆకర్షించాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఈ కార్యక్రమాలకు ఆయా శాఖల కేంద్ర మంత్రులు రానున్నారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ కేఎస్ఎస్ఎల్‌కు ఈ నెల 6న శంకుస్థాపన చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరుకానున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. బ్రిటన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 5న రాష్ట్రానికి తిరిగి రానున్నారు. అందుకు అనుగుణంగా కార్యక్రమాన్ని రూపొందించారు. సైన్యానికి అవసరమైన రక్షణ పరికరాలను తయారు చేసే డిఫెన్స్ ఎక్విప్‌మెంట్స్ యూనిట్‌ను సంస్థ ఏర్పాటు చేయనుంది. ఇక్కడ ఆయుధాల్లో మందుగుండు సామగ్రిని నింపడం, తుపాకీ తూటాలను కేఎస్ఎస్ఎల్ తయారు చేస్తుంది. దీనికి 1,000 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. మొదటి దశలో రూ. 1,000 కోట్లు, రెండో దశలో రూ. 1,400 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. రక్షణ రంగానికి అవసరమైన ఆయుధ సామగ్రి తయారీ, పరీక్షించే యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకు మరో 500 ఎకరాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిత్తల్ నిప్పాన్ స్టీల్ (ఏఎం/ఎన్ఎస్) రూ. 1.35 లక్షల కోట్ల పెట్టుబడితో భారీ ఉక్కు కర్మాగారానికి ఈ నెల 14న శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయెల్ హాజరవుతారని అధికారులు తెలిపారు. ఈ నెల 14, 15న విశాఖలో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు కేంద్రం తరఫున ఆయన రానున్నారు. అదే సమయంలో ఉక్కు కర్మాగారానికి భూమిపూజ కూడా చేస్తారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు మొదటి దశ 2029 నాటికి పూర్తి కానుంది. ఇక్కడ ఏటా 8.2 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో యూనిట్ అందుబాటులోకి వస్తుంది. రెండో దశను 2033 నాటికి పూర్తి చేయాలన్నది సంస్థ లక్ష్యం. ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు సొంతంగా పోర్టును సంస్థ నిర్మించనుంది. ఈ ప్రాజెక్టులకు 2,020 ఎకరాలను బుచ్చిరాజుపేట, చందనాడ, డీఎల్ పురం, రాజయ్యపేట, వేంపాడు గ్రామాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది.



ఉత్తరాఖండ్ సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

# జైపూర్‌లో టిప్పర్ బీభత్సం

**జైపూర్, నవంబరు 3:** దేశంలో మరో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రాజస్థాన్ జైపూర్‌లో ఓ టిప్పర్ బీభత్సం సృష్టించింది. హర్మద ప్రాంతంలోనిరద్దీగా ఉండే సికార్ రోడులో వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. లోహమండీ ప్రాంతంలో మధ్యాహ్నం 1 గంట సమయంలో ఈ ఘటన జరిగింది. అతి వేగంతో వచ్చిన టిప్పర్ నియంత్రణ కోల్పోయి ఎదురుగా వస్తున్న పలు వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో ఆ వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సుమారు14మంది ప్రాణాలు కోల్పోయారు. 50 మందికి గాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు పోలీసులకు సమాచారం అందించి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లోహమండిపెట్రోలు పంపునుంచి హైవేపైకి వసునతన్న డంపర్‌కు ఒక్కసారిగా బ్రేకులు విఫలం కావడంతో అదుపు తప్పి పార్కింగ్‌చేసి ఉన్న వాహనాలను ఢీకొట్టింది. ఈ వాహనాలను ధ్వంసంచేస్తూ సుమారు 300 మీటర్లవరకూ వాటిని ఈడ్చుకుని వెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బైకులు, ఆటో రిక్షాలు ఇతర చిన్నవాహనాలన్నింటినీ కూడా చిత్తుచేస్తూ ముందుకు పోయింది. లోపల చిక్కుకున్న వారిని ప్రత్యక్ష సాక్షులు బయటకు తీసుకువచ్చారు. ముగ్గురి పరిస్థితి మరింత విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.


# యువతి కిడ్నాప్, గ్యాంగ్ రేప్!

**చెన్నై, నవంబరు 3:** తమిళనాడులోని కోయంబత్తూరులో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ కళాశాల విద్యార్థినిని ముగ్గురు దుండగులు అపహరించి, సామూహిక అత్యాచారానికి పాల్పడిన అమానుష ఘటన ఆదివారం రాత్రి వెలుగులోకి వచ్చింది. నగరంలోని విమానాశ్రయం సమీపంలో ఈ ఘాతుకం జరిగింది. పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. బాధితురాలు తన స్నేహితుడితో కలిసి ఉన్న సమయంలో ముగ్గురు వ్యక్తులు వారిపై దాడి చేశారు. ముందుగా ఆమె స్నేహితుడిని తీవ్రంగా గాయపరిచి, అనంతరం యువతిని బలవంతంగా అపహరించుకుపోయారు. ఈ ఘటనతో షాక్‌కు గురైన బాధితురాలి స్నేహితుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీసులు, ఘటనా స్థలానికి సమీపంలో అపస్మారక స్థితిలో ఉన్న యువతిని గుర్తించారు. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈకేసును అత్యంత తీవ్రంగా పరిగణించిన పోలీసులు, నిందితులను పట్టుకోవడానికి ఏడు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. నిందితులను గుర్తించడానికి పోలీసులకు కీలకమైన ఆధారం లభించినట్లు తెలుస్తోంది. ఈ దారుణానికి పాల్పడటానికి ముందు నిందితులు ఒక బైక్‌ను దొంగిలించినట్లు కూడా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలో కూడా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం బాధితురాలు ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతోంది. పరారీలో ఉన్న ముగ్గురు నిందితుల కోసం పోలీసులు నగరం మొత్తం జల్లెడ పడుతున్నారు.

# 13 వరకు రిమాండ్

>> చారు. ఆయనతో పాటు ఆయన సోదరుడు రాముని వేర్వేరుగా కలిపి ప్రశ్నించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు జనార్ధనరావుతో సంబంధాలపై ఆరా తీశారు. వైద్య పరీక్షల అనంతరం ఎక్సైజ్ శాఖ అధికారులు, పోలీసులు ఆయన్ను న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టారు. అర్ధరాత్రి దాటిన తర్వాత వాదనలు ప్రారంభమయ్యాయి. న్యాయమూర్తి సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు రిమాండు విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ క్రమంలో కల్తీ మద్యం కేసు లో అరెస్ట్ అయిన మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన బ్రదర్ రాముని నెల్లూరు సెంట్రల్ జైలుకు పోలీసులు ఇవాళ (సోమవారం) తరలించారు. ఈ రోజు తెల్లవారుజామున న్యాయాధికారి రిమాండ్ విధించిన అనంతరం జోగి రమేష్ ఆయన సోదరుడు రామును విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. అయితే, కోర్టు ఆదేశాల మేరకు జోగి సోదరులని ఈ రోజు మధ్యాహ్నం నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ప్రత్యేక ఎస్కార్ట్‌తో జోగి బ్రదర్స్‌ను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు పోలీసులు.

# నెత్తురోడిన రోడ్లు



>> కారులో ఉన్న గాదిరాజు వైష్ణవి (11) చీరాల ఐకాన్ హాస్పిటల్‌లో, గాదిరాజు జయంత్ వర్మ, (13) గుంటూరు రమేష్ హాస్పటల్లో చికిత్స పొందుతున్నారు. . వీరు ప్రాణాపాయం నుంచి బయటపడి ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన వెంటనే కర్లపాలెం ఎస్సై రవీంద్ర సిఐ శ్రీహరి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరి క్షతగాత్రులను వెంటనే వైద్యశాలకు తరలించారు .అనంతరం నాలుగు మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. రెండు వాహనాలు కూడా అతివేగంగా రావటంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

# నాపై ఆరోపణలన్నీ రాజకీయ కుట్రలే!

## విమర్శలు కొట్టిపారేసిన ఎఫ్‌బిఐ డైరెక్టర్ క్యాష్ పటేల్

**న్యూయార్కు, నవంబరు 3:** ఎఫ్‌బిఐ డైరెక్టర్ కాష్ పటేల్ తన గర్ల్‌ఫ్రెండ్ ప్రదర్శనకు హాజరయ్యేందుకు ప్రభుత్వ విమానాన్ని ఉపయోగించారంటూ వచ్చిన ఆరోపణలపై స్పందించారు. ఇవి అసహ్యకరమైన, నిరాధారమైన ఆరోపణలని, రాజకీయంగా తనను లక్ష్యంగా చేసుకున్నారని మండిపడ్డారు. గతనెల 25న పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీలో జరిగిన ఓ రెజ్లింగ్ ఈవెంట్‌లో కంట్రీ సింగర్ అలెక్సిస్ విల్కిన్స్ ప్రదర్శన ఇచ్చారు. ఇందుకోసం ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ ఏకంగా 60 మిలియన్ డాలర్ల విలువైన ప్రభుత్వ జెట్‌లో వెళ్లారని ఎఫ్‌బీఐ మాజీ ఏజెంట్ కైల్ సెరాఫిన్ తన పాడ్‌కాస్ట్‌లో ఆరోపించారు. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంటే, ఈయన మాత్రం మన డబ్బుతో గర్ల్‌ఫ్రెండ్‌తో గడిపేందుకు విమానంలో వెళతారా అంటూ సెరాఫిన్ ప్రశ్నించడంతో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ వివాదంపై ఎఫ్‌బీఐ స్పందించి వివరణ ఇచ్చింది. భద్రతా కారణాల దృష్ట్యా డైరెక్టర్ వ్యక్తిగత పర్యటనలకు కూడా బ్యూరో విమానాన్ని ఉపయోగించడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. అయితే, అధికారికేతర ప్రయాణాలకు అయ్యే ఖర్చును కాష్ పటేల్ ముందుగానే ప్రభుత్వానికి చెల్లిస్తారని, ఆయన ప్రయాణాలు నిబంధనలకు అనుగుణంగానే ఉంటాయని అధికారులు తెలిపారు. నన్ను ఎంతైనా విమర్శించండి, కానీ నా వ్యక్తిగత జీవితంపై, నా చుట్టూ ఉన్నవారిపై దాడి చేయడం సిగ్గుచేటు" అని ఆయన పేర్కొన్నారు.

# సమ్మిట్‌పై గంపెడాశలు

>> అనంతపురం, చిత్తూరులో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు, కర్నూలులో రెన్యువబుల్ ఎనర్జీ, ప్రకాశం జిల్లాలో సీబీజీ, నెల్లూరులో డైవర్సిఫైడ్ ఇండస్ట్రీస్, అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్, ఉభయగోదావరి జిల్లాల్లో ఆక్వా, రిఫైనరీ, ఉత్తరాంధ్రలో ఫార్మా, మెడికల్ డివైస్, స్టీల్ సిటీ, డేటా సిటీలు ఏర్పాటవుతున్నాయి. ఇందుకు తగ్గట్లుగా ఆయా ప్రాంతాల్లో ఎకో సిస్టమ్ అభివృద్ధి చేస్తున్నాం. గూగుల్ 1 గిగావాట్ డేటా సెంటర్, సిఫీ సంస్థ 500 మెగావాట్ల డాటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చాయి. మా టార్గెట్ రాష్ట్రంలో 6 గిగావాట్ల డాటా సెంటర్లు ఏర్పాటు చేయడం. అందుకు అవసరమైన గ్రీన్ ఎనర్జీ, ఎకో సిస్టమ్ తీసుకురావాల్సి ఉంది. వర్టికల్, హారిజంటల్ ఇంటిగ్రేషన్ కు ప్రాధాన్యత నిస్తున్నాం. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ డేటా సంస్థలు ఏపీకి వస్తున్నాయి, స్టీల్, అల్యూమినియం, ఏఐ, ఆగ్రిటెక్, డ్రోన్ తదితర అన్నిరంగాల్లో ఏపీని అగ్రగామిగా నిలపాలన్నదే మాధ్యేయం. విశాఖపట్నంలో నిర్వహించే కార్యక్రమాన్ని మేం త్రీవే పార్టనర్ షిప్‌గా భావిస్తున్నాం. ప్రభుత్వం, ప్రజలు, పారిశ్రామిక సంస్థలు కలిసికట్టుగా ముందుకు సాగితేనే ఆంధ్రప్రదేశ్ అగ్రపథాన పయనిస్తుంది. నిన్న కూడా ముంబయిలో అనేకమంది పారిశ్రామికవేత్తలను కలిశాను. ఇప్పుడు ప్రతిఒక్కరూ ఏపీ వైపు చూస్తున్నారు. అయినా మేం సంతృప్తి చెందడం లేదు. అన్నిరంగాల్లో ఏపీని నెం.1 చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

**విద్వేషాలు రెచ్చగొడుతున్న వైసీపీ**

విలేకరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఇప్పటి వరకు 1.8లక్షల ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. త్వరలో నైపుణ్యం పోర్టల్ ప్రారంభించబోతున్నాం. సప్లయ్‌డిమాండ్ ఆధారంగా ఏఐ ద్వారా ఇంటర్వ్యూ విధానాన్ని ప్రవేశపెడుతున్నాం. మంత్రులంతా ఎకో సిస్టమ్ పై దృష్టిపెట్టాం, మా అందరి లక్ష్యం ఒక్కటే...20 లక్షల ఉద్యోగాల సాధన. అందరం ఫీల్డ్ కు వెళ్తున్నాం, నవంబర్‌లో చాలా కంపెనీల ఫౌండేషన్ స్టోన్స్, రిబ్బన్ కటింగ్స్ ఉంటాయి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వల్లే వస్తున్నాయి. ఆర్సెలర్ మిట్టల్ సంస్థ 14నెలల్లో, గూగుల్ 13నెలల్లో, ప్రీమియర్ ఎనర్జీ 45రోజుల్లో రాష్ట్రానికి రప్పించాం. జీసీసీ క్వాలిటీ ఆఫీస్ స్పేసెస్ విశాఖకు వస్తున్నాయి. పార్టనర్ షిప్ సమ్మిట్‌లో ప్రభుత్వం, పెట్టుబడిదారులు, ప్రజలు కలిసి వస్తేనే అనుకున్నది సాధించగలం. కులం, మతం, ప్రాంతంముసుగులో కొందరు విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. ఎవరేంచేస్తున్నారో మొత్తం ప్రజల ముందు ఉంచుతున్నాం.

**పరిశ్రమలకు అనుగుణంగా కరిక్యులమ్**

పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కరిక్యులమ్ బలోపేతం చేస్తున్నాం. టూవీలర్ మెకానిక్ నుంచి క్వాంటమ్ ఇంజనీర్ వరకు ఏఐ సాంకేతికతతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తాం. ఏఐ బేస్డ్ ప్లాట్ ఫాం ఏర్పాటుచేస్తున్నాం. అన్నీ అందులో ఇంటిగ్రేట్ చేస్తున్నాం. రాబోయే మూడేళ్లలో గూగుల్, 2028నాటికి ఆర్సెలర్ మిట్టల్, 2026 నాటికి ప్రీమియర్ ఎనర్జీ, ఏఎన్ఎస్ఆర్, ఇతర జీసీసీ సంస్థలు కార్యకలాపాలు ప్రారంభిస్తాయి. ప్రభుత్వాలు కొనసాగిన చోట రాష్ట్రాలు అభివృద్ధి చెందాయి. అందుకు తెలంగాణా, ఒడిశా రాష్ట్రాలు ఉదాహరణ. ప్రజలు కూడా ఆలోచించాలి. ఓవర్ నైట్ అద్భుతాలు జరగవు. మాకు అన్ని జిల్లాలు సమానం. విశాఖపట్నం ఎకనమిక్ కారిడార్ ఉత్తరాంధ్ర అంతటినీ కవర్ చేస్తుంది. అనంతపురంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుచేశాం.

**క్లస్టర్ బేస్డ్ అభివృద్ధిపైనే మా దృష్టి**

మేము ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపైన, ముఖ్యంగా క్లస్టర్ బేస్డ్ అభివృద్ధిపై దృష్టిపెట్టాం. ప్రతి క్లస్టర్ మాకు ముఖ్యమైనదే. సౌత్ ఆసియా ఫస్ట్ 158 క్యూబిక్ బిట్ కంప్యూటర్ జనవరిలో అమరావతి రాబోతోంది. తొలుత తాత్కాలికంగా విట్ లో ఏర్పాటు చేస్తున్నాం. క్వాంటమ్ కంప్యూటర్ ద్వారా విద్య, వైద్యరంగాల్లో చాలా మార్పులు వస్తాయి. పారిశ్రామిక ప్రగతిపై మాకు క్లియర్ రోడ్ మ్యాప్ ఉంది. విజనరీ లీడర్ చంద్రబాబుగారు 20 ఏళ్ల ముందుగా ఆలోచిస్తారు. గత ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను సమీక్ష చేస్తున్నాం. మంచి నిర్ణయాలను కొనసాగిస్తున్నాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వంటివి రద్దుచేశాం. విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడాలని మేం అడగడం వల్లే కేంద్రం రూ.13వేల కోట్ల రాయితీలు ఇచ్చింది. అయితే స్టీల్ ప్లాంట్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సి ఉంది. ఏపీ గవర్నమెంట్ కూడా స్టీల్ ప్లాంట్‌లో షేర్ హోల్డర్ అన్న విషయాన్ని మంత్రి లోకేష్ గుర్తుచేశారు.

## వారం - వర్జ్యం

04-11-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
చతుర్దశి రా.10.33
రేవతి మ.12.31, స్వాతి కార్తె
వర్జ్యం : ఉ.6.08-7.32
దు.ఉ.8.25- 9.11
2) రా.10.14-10.59
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** శ్రమించి పనులు పూర్తి చేసు కుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వివాదాలు తీరి ప్రశాంతత లభిస్తుంది.

**వృషభం:** ఇతరుల విషయాలలో అతి జోక్యం వల్ల అబాసుపాలవుతారు. ఉద్యోగులకు అనుకోకుండా బదిలీలు ఉంటాయి.

**మిథునం:** బంధువుల నుండి వచ్చిన సమాచారం కొంత ఊరట కలిగిస్తుంది. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి.

**కర్కాటకం :** నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. ఉద్యోగాలలో స్వల్ప మార్పులు చోటు చేసుకుంటాయి.

**సింహం:** కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. ఆభరణాలు కొనుగోలుచేస్తారు. కాంట్రాక్టులు దక్కుతాయి.

**కన్య :** వాహనాల విషయంలో కాస్త మెలుకువ అవసరం. కోపతాపాలకు దూరంగా వుండండి. ముఖ్యమైన పనులలో తొందరపాటు వద్దు.

**తుల :** అందివచ్చే అవకాశములను నేర్పుతో మీకు అనుకూలంగా మార్చుకొండి. ఉద్యోగులకు అనుకోకుండా బదిలీలు ఉంటాయి.

**వృశ్చికం:** వైరి వర్గం వలన ప్రయోజనాలు చేజారిపోవచ్చు. వాహనయోగం కలదు. జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు తలెత్తుతాయి.

**ధనుస్సు:** సంతాన విద్యాభివృద్ధి బాగుంటుంది. స్థిరాస్థి వృద్ధి చెందుతుంది. నూతన పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది.

**మకరం:** జీవితభాగస్వామి నుండి సలహాలు స్వీకరిస్తారు. విందు, వినోదాలు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**కుంభం:** భూ వివాదాలు తీరి లబ్ది పొందతారు. బంధువుల కలయిక. దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటారు.

**మీనం:** కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ముందుకు సాగుతారు. కొత్త కార్య క్రమాలకు శ్రీకారం చుడతారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎఐ ఆధారిత వ్యవస్థ

>> రాన్ని గుర్తించడంతోపాటు వాటిని స్వల్పంగా భయపెడతాయని తెలిపారు. ఏనుగులను గుర్తించిన వెంటనే అటవీ శాఖ అధికారులకి హెచ్చరిక సంకేతాలు పంపుతాయని తెలిపారు. తద్వారా అటు మనుషులు, ఇటు వన్యప్రాణులకు రక్షణ వ్యవస్థలా ఉపయోగపడతాయని వివరించారు పవన్ కల్యాణ్. 120 మీటర్ల పరిధి నుంచి 60 మీటర్ల దూరం వరకు సున్నిత ప్రాంతాలను ఈ వ్యవస్థ నిరంతరం పర్యవేక్షిస్తుందని చెప్పుకొచ్చారు. పంటల నష్టాన్ని నివారించడంతోపాటు మనుషులు - ఏనుగుల మధ్య సంఘర్షణను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని నొక్కిచెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుల దార్శనిక నాయకత్వంలో ఒక స్థిరమైన లక్ష్యసాధన దిశగా ముందుకు వెళ్తున్నామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఎఐ ఆధారిత వ్యవస్థ, సౌరశక్తి సాయంతో పనిచేస్తూ ఏనుగుల సంచారాన్ని గుర్తించడంతోపాటు ఏనుగులని స్వల్పంగా భయపెట్టి సహజ సిద్ధమైన నిరోధక వ్యవస్థను కలిగి ఉంటుందని వివరించారు. ఇప్పటికే అడవి ఏనుగుల సమస్య పరిష్కారానికి కర్ణాటక ప్రభుత్వ సహకారంతో నాలుగు కుంకీ ఏనుగులను ఎపికి తీసుకువచ్చామని గుర్తుచేశారు. ఏనుగుల బెడద నుంచి సరిహద్దు గ్రామాల ప్రజలకు రక్షణ కల్పించే చర్యలను మరింత ముందుకు తీసుకువెళ్లే కార్యక్రమంలో భాగంగా అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్ లెర్నింగ్ విధానంతో పని చేసే సరికొత్త వ్యవస్థను ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

# అనిల్ అంబానీకి ఇడి షాక్

>> పడి ఉన్న మనీలాండరింగ్ కేసులో ఆయనకు చెందిన రూ.3,084 కోట్ల విలువైన 40కి పైగా ఆస్తులను అటాచ్ చేసింది. ఈ మేరకు గతనెల31న ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇడి అధికారులు తెలిపారు. జప్తు చేసిన ఆస్తుల్లో ముంబైలోని పాలి హిల్‌లో ఉన్న అనిల్ అంబానీ కుటుంబ నివాసం, న్యూఢిల్లీలోని రిలయన్స్ సెంటర్‌తో పాటు పలు నివాస, వాణిజ్య భవనాలు, భూములు ఉన్నాయి. ఈ ఆస్తులు ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, ముంబై, పుణె, థానే, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో విస్తరించి ఉన్నాయి. 2017-19 మధ్యకాలంలో యెస్ బ్యాంక్ ఆర్‌హెచ్ఎఫ్ఎల్‌లో రూ.2,965 కోట్లు, ఆర్‌సిఎఫ్ఎల్‌లో రూ.2,045 కోట్లు పెట్టుబడిగా పెట్టింది. అయితే 2019 డిసెంబరు నాటికి ఈ పెట్టుబడులు నిరర్థక ఆస్తులుగా (ఎన్‌పిఎ) మారాయి. ఆర్‌హెచ్ఎఫ్ఎల్ నుంచి రూ.1,353 కోట్లు, ఆర్‌సిఎఫ్ఎల్ నుంచి రూ.1,984 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. సెబీ నిబంధనల ప్రకారం రిలయన్స్ నిప్పాన్ మ్యూచువల్ ఫండ్ నేరుగా అనిల్ అంబానీ గ్రూప్ ఆర్థిక సంస్థల్లో పెట్టుబడులు పెట్టడంపై ఆంక్షలు ఉన్నాయి. ఈ నిబంధనలను అధిగమించేందుకు, మ్యూచువల్ ఫండ్లలోని ప్రజాధనాన్ని పరోక్షంగా యెస్ బ్యాంక్ ద్వారా ఆర్‌హెచ్ఎఫ్ఎల్, ఆర్‌సిఎఫ్ఎల్ సంస్థలకు మళ్లించినట్లు ఇడి దర్యాప్తులో తేలింది. ఆ తర్వాత ఈ ఆర్థిక సంస్థలు, అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్‌కు చెందిన ఇతర కంపెనీలకు రుణాలుగా అందించాయి. చాలా సందర్భాల్లో ఎలాంటి తనిఖీలు లేకుండానే రుణాలను స్పీడ్‌ప్రాసెస్ చేశారని ఇడి గుర్తించింది. దరఖాస్తు, మంజూరు, ఒప్పందం అన్నీ ఒకే రోజు జరిగిపోయాయని, కొన్నిసార్లు దరఖాస్తు చేయడానికి ముందే నిధులు విడుదలయ్యాయని దర్యాప్తులో వెల్లడైంది. దీనిని ఉద్దేశపూర్వకమైన, స్థిరమైన నియంత్రణ వైఫల్యాలుగా ఈడీ వివరించింది. ఇడి తన దర్యాప్తును రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్)కు కూడా విస్తరించింది. ఇందులో రూ.13,600 కోట్లకు పైగా వ్యవస్థీకృత రుణ మోసాలు జరిగినట్లు గుర్తించింది. ఈ మొత్తంలో రూ.12,600 కోట్లను అనుబంధ సంస్థలకు మళ్లించగా, మరో రూ.1,800 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్ల ద్వారా గ్రూప్ కంపెనీలకు తరలించారు. ఈ నేరంలో భాగమైన మరిన్ని ఆస్తులను గుర్తించే పని కొనసాగుతోందని, జప్తు చేసిన ఆస్తుల ద్వారా రికవరీ చేసిన మొత్తం చివరికి ప్రజలకే చెందుతుందని దర్యాప్తు సంస్థ స్పష్టం చేసింది.

# ధాన్యం కొనుగోలు షురూ!

>> చేయడం జరిగిందని తెలిపారు. ఈరోజున 12 వేల సిబ్బందితో 34 వేల ట్రాక్టర్లు లారీలు తో దాదాపు నాలుగు వేల రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. భారతదేశంలోనే మొట్ట మొదటిసారి వాట్సాప్ ద్వారానే మీరు కోరుకొన్న మిల్లుకు, నచ్చిన తేదీల్లో దాన్ని అమ్ముకునేందుకు సాంకేతికతను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలతో నిర్వహించడం జరుగుతుందని అందరూ సహకరించాలని ఇంత భారీగా జరుగుతున్న ఈ ప్రక్రియలో చిన్న చిన్న ఉంటాయి దయచేసి క్షేత్రస్థాయిలోని అధికారులు ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ధాన్యం అమ్మిన రైతులకు ఏ విధమైన జాప్యం లేకుండానే 24 గంటల్లోనే వారికి డబ్బు జమ కావడం జరుగుతుందని అన్నారు.. తాడేపల్లిగూడెం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు వెంటనే ధాన్యం జమ చేయడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైంది అన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్ విసి అండ్ ఎండి ఢిల్లీ రావు, డైరెక్టర్ ఆర్.గోవిందరావు, చైర్మన్ తోట మెహర్ సీతారామ సుధీర్, శాసనసభ్యులు పితాని సత్యనారాయణ, సిరి బాలరాజు, సొంగ రోషన్ కుమార్, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జెఎస్పి జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, బిల్డింగ్ అసోసియేషన్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జి, ఆరుగొలను సర్పంచ్ పి బుచ్చిబాబు, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ ఎండి ఇబ్రహీం, అగ్రికల్చర్ జెడి జెడ్ వెంకటేశ్వరరావు, డీఎస్ఓ సరోజ, డి సి ఓ ఎస్ మురళీకృష్ణ, ఏడిఏ ఆర్ గంగాధర్ రావు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నీలకంఠాపురంలో ఎల్‌వి.ప్రసాద్ నేత్ర సంరక్షణా కేంద్రం

## ఆసుపత్రి ప్రారంభోత్సవానికి రాజకీయ ప్రముఖులు హాజరు


నీలకంఠాపురంలో ఎల్‌విప్రసాద్ నేత్ర సంరక్షణాకేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**మడకశిర, నవంబరు 3 ప్రభాతవార్త:** మారుమూల ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలోని నీలకంఠాపురంలో సిడబ్ల్యూసి మెంబర్ నీలకంఠాపురం డాక్టర్ రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎల్‌వి.ప్రసాద్ నేత్ర సంరక్షణా కేంద్రం అతిరథుల మధ్య ఘనంగా ప్రారంభమైంది. సిడబ్ల్యూసి మెంబర్ మాజీ మంత్రి మాజీ పిసిసి అధ్యక్షుడు డాక్టర్ రఘువీరారెడ్డి ఒక్క ఆలోచనతో కంటి చూపుతో సతమతమవుతున్న ఐదు లక్షల మందికి ఆశ్రయం కల్పించేందుకు ఎల్‌వి.ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ఆసుపత్రి సహకారాన్ని కోరి పట్టుదలతో వారి కటుంబ సభ్యుల సహకారంతో ఎల్‌వి. ప్రసాద్ వైద్య విజ్ఞాన సంస్థ నీలకంఠాపురం డాక్టర్ శాంత మరియు డాక్టర్ జయరాంల నేత్ర వైద్య కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి ఛైర్మన్ జి.ఎన్ రావ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎల్‌వి.ప్రసాద్ ఆధ్వర్యంలో 24 ఆసుపత్రులను ప్రారంభించి వైద్య సేవలు అందిస్తూ 25వ కంటి ఆసుపత్రిని నీలకంఠాపురంలో నేడు ప్రారంభించామని అన్నారు. మాజీ ఎంపి కేవిపి. రామచంద్ర రావ్ మాట్లాడుతూ రఘువీరారెడ్డి గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలను ప్రక్కన పెట్టి దేవాలయాల నిర్మాణాలలో ఉండిపోయారని అన్నారు. ఇప్పుడు ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి ఏర్పాటు విషయంలో రఘువీరారెడ్డి కృషి పట్టుదల కార్యదీక్షతో వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కంటి ఆసుపత్రి ఏర్పాటు చేశారని ఇది ప్రపంచ ఖ్యాతి గాంచిన ఆసుపత్రి అని అన్నారు. రఘువీరారెడ్డి మాట్లాడుతూ నీలకంఠాపురంలో ఓ దేవాలయం వెలసిందని, మనము ఏదేవాలయానికైనా వెళ్ళితే కళ్లు మూసుకొని దేవున్ని ప్రార్థిస్తాము దేవాలయంలో కళ్లు మూసుకొంటాము కానీ ఈ దేవాలయం మూసుకొన్న కళ్లను తెరిపించే దేవాలయం ఇది అన్నారు. దేవాలయం నిర్మాణ సంమయంలో దేవాలయం ఒక్కటే కాదు వైద్యం మరియు విద్య కూడా అవసరమని కుటుంబ సభ్యులు తెలియజేయడంతో అప్పటితో ఆసుపత్రిని ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో మొదలు చేసి ఈవిషయాన్ని కేవిపి.రామచంద్రరావుకు తెలియజేసి అతని ద్వారా ఎల్‌వి.ప్రసాద్ వారి సహకారంతో అత్యాధునిక వైద్య పరికరాలతో ప్రపంచ స్థాయి సమగ్ర కంటి ఆరోగ్య వైద్య సేవల కోసం నీలకంఠాపురంలో నేడు ప్రారంభించామని అన్నారు. మాజీ ఎంపి అనంతవెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపి తలారి రంగయ్య, మాజీ ఎంపి. మాజీ ఎంపి అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ పిసిసి గిడుగు రుద్రరాజు, సిడబ్ల్యూసి మెంబర్ కోప్పులరాజు, మాజీ కేంద్ర మంత్రి జేడి.శీలం, మాజీ ఎమ్మెల్యేలు నరసేగౌడు, వైటి.ప్రభాకర్‌రెడ్డి, కె.సుధాకర్, డాక్టర్ జి.తిప్పేస్వామి, కె.ఈరణ్ణలు మాట్లాడుతూ నీలకంఠాపురం లో ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రజలందరికి ఎంతో ఉపయోగపడుతుందని వారు అన్నారు. ఇది పేద ప్రజల పాలిట ఒక గొప్ప వరంగా అభివర్ణించారు. రఘువీరారెడ్డి ఎంతో ముందు చూపుతో కంటి ఆసుపత్రి నిర్మాణం చేశారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌విపిఈఐ ఛైర్మన్ జిఎన్.రావు, వైస్ ఛైర్మన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి, డాక్టర్ తార ప్రసాద్‌దాస్. డాక్టర్ రోహిత్‌ఖన్నా, హోట్టేబెట్ట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గోవిందరాజు, పావగడ జపానంద స్వామి,రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దమయంతి, తుంకూర్ రాజన్న, మహేష్,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గౌతమ్, దాదాగాంధీ, అనంతపురం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, హిందూపురం కాంగ్రెస్ నాయకుడు కేటీ శ్రీధర్, మాజీమంత్రి రఘువీరారెడ్డి సతీమణి సునీత రఘువీర్, కుమార్తె అమృత రఘువీర్, ఇతర కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వం అనే పదానికే అర్థం మారిపోయింది

**విజయవాడ,నవంబరు 3,ప్రభాత వార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం అనే పదానికే అర్థం మారిపోయిందని వైసీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. ప్రభుత్వమే వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతోందన్నారు. ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి కానీ, కూటమి ప్రభుత్వం మాత్రం వ్యవస్థలను గాలికి వదిలేసి ప్రత్యర్థులపై కక్ష సాధింపులకు దిగుతోందని ఆరోపించారు. మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్ట్‌తో వీరి వికృత చేష్టలు పరాకాష్ఠకు చేరాయని ఆయన విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైసీపీ నేతలు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు పెరిగిపోయాయని సజ్జల ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో లోకేశ్ రెడ్ బుక్ పాలన నడుస్తోందని, ఆయన నేతృత్వంలో విధ్వంసకర పాలన సాగిస్తున్నారని సజ్జల విమర్శించారు.

## మారికవలసలోని ట్రైబల్ హాస్టల్ శిక్షణా కేంద్రాన్ని పునః ప్రారంభించండి

**విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** వెనుకబడిన గిరిజన ప్రాంతాల విద్యార్థుల ఉన్నత విద్యావకాశాల అభివృద్ధి కోసం మారికవలసలోని ట్రైబల్ హాస్టల్ శిక్షణా కేంద్రాన్ని పున:ప్రారంభించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేందుకు నిధులు కేటాయించాలన్నారు. ఈమేరకు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ ఆధ్వర్యంలో 2017లో స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ పేరుతో విశాఖ ఏజెన్సీలో ఉన్న ఐదు రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఉత్తమంగా రాణించిన వారిని ఎంపిక చేసి ఉత్తమ శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. దీనికి ప్రత్యేకంగా ఉమ్మడి విశాఖపట్నం మధురవాడ ప్రాంతంలోని మారికవలస రెసిడెన్షియల్ కాలేజీలో శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం సుమారు 80 నుండి 100 మంది విద్యార్థులకు ప్రత్యేక సిబ్బంది ద్వారా శిక్షణ ఇస్తున్నారని వివరించారు. 2017 నుండి ఇప్పటి వరకూ 356 మంది విద్యార్థులు శిక్షణ పొందారని, వీరంతా ఐఐటి, ఎన్ఐటి, నీట్, లాసెట్ వంటి ఉన్నత స్థాయి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి వాటిల్లో ప్రవేశాలు పొందారని పేర్కొన్నారు.


మహారాజశ్రీ విజయవాడ ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెంబర్. 1013/2023

బిట్వీన్:
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్. విజయవాడ, రిప్రజెంటెడ్ బై జిపిఏ హోల్డర్, విజయవాడ.
...వాది

మరియు

సందయ్ టోబాకోస్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ ప్రొప్రైటర్, కంచర్ల శ్రీనివాస రావు, S/o. కంచర్ల సుబ్బారావు. నివాసం: డోర్ నెం. 35-15-885/1, సంజీవయ్య నగర్, 7వ లైన్, శారదా కాలనీ, మెయిన్ రోడ్, గుంటూరు - 522002.
... ప్రతివాది

పై నెంబరు దావా నందు పైన తెలిపిన ప్రతివాదికి దావా సమన్సు అందజేయు నిమిత్తం తేది: 18.12.2025న తేదీకి వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాది వాయిదా రోజు ఉదయం గం.10.30ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయి వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యెడల వారి పరోక్షమందు సదరు పై దావా తీర్మానము చేయబడునని ఇందుమూలముగా తెలియ చేయటమైనది.

కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము)
వాయిదా తేది : 18.12.2025

ఇట్లు
కునుకు రాజశేఖర్
వాది తరపు అడ్వకేట్,
గాంధీనగర్,
విజయవాడ-520003


# జీరో యాక్సిడెంట్‌జోన్‌గా రాష్ట్రం

## కఠిన చర్యలతోనే ప్రమాదాల నివారణ

## తిరుపతిలో రాష్ట్ర మంత్రి మండిపల్లి



**తిరుపతి రవాణ,నవంబరు 3ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌ను జీరో యాక్సిడెంట్ జోన్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్రర వాణాశాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. నిబంధనలు పాటించని, సామర్థ్యం లేని బస్సులను సీజ్ చేస్తున్నామని, ప్రతి విషయంలో చొరవచూపి కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మానవతప్పిదాలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్లీపర్ బస్సులు, దూరప్రాంతాలకు ప్రయాణించే బస్సులకు కొత్త నిబంధనలు,అలారం సిస్టమ్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో రోడ్డుప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. తిరుపతి జిల్లాలో అలిపిరి డిపో ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ఆర్టీసి డిస్పెన్సరీని రాష్ట్రమంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసి ఎండి ద్వారకతిరుమలరావు, తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాసులు, ఆర్టీసి జోనల్ ఛైర్మన్ కొనకళ్ల సత్యనారాయణతో కలసి సోమవారం డిస్పెన్సరీని ప్రారంభించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అందుకు డ్రైవర్ల నైనుణ్యం, మెలకువలు అవసరమన్నారు. వైసిపి నేత జోగిరమేశ్ అరెస్ట్ కక్షపూరితం కాదన్నారు. మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి చట్టం తనపనితాను చేసుకుంటూ పోతుందన్నారు. ఆర్టీసి ఉద్యోగుల కోసం తిరుపతిలో 1.92కోట్ల రూపాయలతో అలిపిరి డిపో సమీపంలో 0.12ఎకరాల విస్తీర్ణంలో డిస్పెన్సరీ, విశ్రాంతి గదులు ఏర్పాటుచేశామన్నారు. వృద్ధులు, రోగుల సౌకర్యార్థం మందులదుకాణం, ల్యాబ్, ఓపి ,వైద్యుల గదులుప్రత్యేకంగా లిఫ్ట్ సౌకర్యం కల్పించారన్నారు. తిరుపతి జిల్లాలోని 11 డిపోలు కలిపి ఉమ్మడిచిత్తూరుజిల్లాలోని 6వేల ఆర్టీసి కుటుంబాలు లబ్ధిపొందుతారన్నారు. రోజుకు సుమారు వందమందికి వైద్యసేవలు,30 రకాల వైద్యపరీక్షలు నెలకు 3లక్షల విలువైన ఉచిత మందులు పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి జోనల్ ఇడిలు సురేశ్‌రెడ్డి, చంద్రశేఖర్, రవివర్మ, చెంగల్‌రెడ్డి, తిరుపతి జిల్లా రవాణాఅధికారి విశ్వనాథ్,అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


గౌరవ వేతనాలు చెల్లించాలంటూ పంచాయతీరాజ్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ

# గౌరవ వేతనాలు చెల్లించాలి

## పంచాయతీరాజ్ భవన్ ఎదుట వైఎస్సార్‌సీపీ పంచాయిత్ రాజ్ విభాగం ధర్నా

**విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని స్థానిక ప్రజా ప్రతినిధులకు గౌరవ వేతనాలు ఇవ్వద్దని చట్టం ఏమైనా చెప్పిందా? అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుని, మంత్రి లోకేశ్‌లను, రాష్ట్ర ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ పంచాయిత్ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రా రెడ్డి సూటిగా ప్రశ్నించారు. సోమవారం తాడేపల్లిలోని పంచాయతీ రాజ్ భవన్ ఎదుట వైఎస్సార్‌సీపీ పంచాయిత్ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఎంపీపీలు, జెడ్‌పిటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పంచాయతీరాజ్ ఉప సంచాలకులు సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులంతా వైస్సార్సీపీ పార్టీ ద్వారా ఎన్నికైనందుకేనా ఈ వివక్ష? అని ప్రశ్నించారు. చంద్రబాబు ఈ డబ్బు మీ అబ్బా సొమ్మా?.. పవన్ కళ్యాణ్ మీ తాత సొమ్మా? ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ప్రతి నెల 3వ తేదీ జీతాలు తీసుకుంటున్నా కదా?. మీలాగానే ప్రజల్చే ఎన్నుకోబడిన జడ్పీ చైర్మన్లు, జడ్పీటీసీలు, ఎంపీపీ, ఎంపీటీసీలు వారు ప్రజాప్రతినిధులు కాదా?. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై దాడులపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ వైఖరి ఏమిటో తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తన ఎన్నికలు హామిలో స్థానిక ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలు పెంచుతామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిందని, వచ్చిన నాటి నుంచి నేటికీ కూడా ఒక్క నెల గౌరవవేతనం కూడా ఇవ్వలేదు. జడ్పీ చైర్మన్ లకు ఎం.పి.పి లకు, ఎం.పీ.టీ.సీ లకు వేతనాలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముళ్లపూడి గాంధీ, కృష్ణా, గుంటూరు జిల్లాల పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షులు దాసరి రాజు, వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు ఫిరోజ్, సహాయ కార్యదర్శి ఆదాం, సంఘం నాయకులు శ్రీనివాసరావు, రమేష్, సాంబశివరావు, ఆర్ కల్యాణి, జోజీ, శివప్రసాద్, బండారు ఆంజనేయులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## స్పెయిన్‌లో జరిగే స్మార్ట్ సిటీ ఎక్స్‌పో వరల్డ్ కాంగ్రెస్‌కు సురేష్ కుమార్



**విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఈ నెల 4 నుంచి రెండు రోజుల పాటు జరగనున్న 14వ స్మార్ట్ సిటీ ఎక్స్‌పో వరల్డ్ కాంగ్రెస్‌లో రాష్ట్రానికి చెందిన 4 స్మార్ట్ సిటీల అభివృద్ధిలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను ప్రదర్శించనున్నట్లు పట్టణాభివృద్ధి శాఖ వెల్లడించింది. ఈ ఎక్స్‌పోలో రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్ కుమార్ దేశం తరపున విశిష్ట వక్తగా ప్రసంగించనున్నారని ఆదివారంఒక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో పట్టణాభివృద్ధికి ఎఐ సాంకేతికత వినియోగంపై చర్చించనున్నట్లు తెలిపింది. గ్రేటర్ విశాఖ,తిరుపతి మున్సిపల్ కమిషనర్లతో కూడిన ముగ్గురు సభ్యుల అధికారిక బృందానికి సురేష్ కుమార్ నేతృత్వం వహిస్తారని వెల్లడించింది.స్మార్, సస్టైనబుల్ సిటీల అభివృద్ధికి దోహదపడే ఈఎక్స్‌పోకు 130 దేశాల నుంచి 850 మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొంది.

## ఫేస్‌బుక్‌లో పరిచయంతో రూ.17.99లక్షలు దోపిడీ

**తిరుపతి,నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి:** పేస్‌బుక్‌లో ప్రియ అనే పేరుతో పరిచయం అయిన వ్యక్తి నకిలీ ఉద్యోగ ఆఫర్‌లతో తిరుపతినగరంలోని ఓ వ్యక్తిని సైబర్‌మోసగాళ్ళుభారీ మోసం చేశారు. ఏకంగా 17.99లక్షలు రూపాయలు దోచుకున్నారు. ఈ సంఘటనపై బాధితుడు శ్రవణ్(47)సోమవారం అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. కొన్ని సామాజిక మాధ్యమాల్లో ఎస్కార్ట్‌సర్వీస్, ప్లేబాయ్‌జాబ్ పేరుతో నకిలీ ఉద్యోగ ఆఫర్‌లతో శ్రవణ్‌ను నమ్మించాడు. దీంతో మొదట రిజిస్ట్రేషన్‌ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్, రూమ్‌ఛార్జీలు,జిఎస్‌టి, ఎస్‌జిఎస్‌టి వంటివి చెబుతూ పలుసార్లు డబ్బులు తీసుకున్నారు. ఆ తరువాత ఫిర్యాదిదారుని ఫోటోలు, సంతకం తీసుకుని వాటిని ఎడిట్‌చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేసి బ్లాక్‌మెయిల్ చేయడంప్రారంభించారు. మోసగాళ్లబారిన 17,99,426 రూపాయలు వివిధ బ్యాంకు అకౌంటర్లు, యుపిఐ ఐడిలకు పంపారు. డబ్బులు తిరిగి అడిగినపుడు పంపుతాము అంటూ ఏమీ చెల్లించలేదు. దీంతో మోసగాళ్లబారిన పడిన అతను అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రజలు ఏ విధమైన డబ్బులు ఆన్‌లైన్‌ద్వారా తెలియని వ్యక్తులకు పంపవద్దని సిఐ రామకిశోర్ సూచించారు.

## మీర్జాగూడ దగ్గర బస్సు ప్రమాదంపై సిఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి

**విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని మీర్జాగూడ దగ్గర బస్సు ప్రమాదంపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రయాణికుల మృతి తనను తీవ్రంగా కలచివేసిందని, మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు సిఎం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబు కోరారు. అయితే, చేవెళ్ల రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య 24కి చేరుకుంది. ఈ ప్రమాదంలో 40 మంది గాయపడగా వారిలో సుమారు 20 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది.

## పవన్ ప్రగాఢసానుభూతి

**విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలోని చేవెళ్ల వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. ఆర్టీసీ బస్సును కంకర లారీ ఢీకొనడంతో 17 మంది మృతి చెందారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి లోనైనట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## కలిచివేసిందన్న మాజీ సిఎం జగన్

**విజయవాడ,నవంబరు3,ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణలోని చేవెళ్ళ దగ్గర జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పలువురు మృత్యువాత పడటంపై మాజీ సిఎంవైఎస్ జగన్ తీవ్రదిగ్రాంతిని వ్యక్తం చేశారు. ఆర్టీసి బస్సును కంకర లారీఢీకొట్టడంతో పలువురుమృతిచెందడం తీవ్రంగా కలిచివేసింది.

## ఇన్‌పుట్ సబ్సిడీ ఎకరాకు రూ.25వేలు చెల్లించాలి: వడ్డే శోభనాద్రీశ్వరరావు



**విజయవాడ,నవంబరు 3,ప్రభాత వార ప్రతినిధి:** మొంథా తుపాన్ రైతాంగాన్ని తీవ్రంగా నష్టపరిచిందని, ప్రభుత్వం తక్షణమే రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకోవాలని ఎపి సంయుక్త కిసాన్‌మోర్చా (ఎపికెఎస్‌ఎం) కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. విజయవాడ లో పాత్రికేయ సమావేశ ప్రాంగణంలో రైతు, కార్మిక సంఘాల రాష్ట్ర నాయకుల సమావేశం జరిగింది. సమావేశా నంతరం ఆయన మాట్లాడుతూ పంటల నష్టాన్ని సక్రమంగా ఎన్యు మరేషన్ చేయించాలని, రైతులను ఆదుకునేందుకు ఇన్‌పుట్ సబ్సిడీ ఆహార పంటలకు ఎకరాకు రూ.25వేలు, వాణిజ్య పంటలకు రూ.50వేలు, ఉద్యానపంటలకు రూ.75వేలు చొప్పున రైతు, కౌలు రైతులకు పంటబీమా వచ్చేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు సుధీర్ మాట్లాడుతూ విశాఖపట్టణం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరించేందుకు కుట్రలుసాగుతున్నాయన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటు వ్యక్తులకు కారుచౌకగా, కేటాయిస్తున్నారని ఆయన విమర్శించారు. ఎపిరైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్‌మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ విధానాలు అమలుపరచడంలో ముందువైపు నిలబడుతుందన్నారు. కాంగ్రెస్ కిసాన్‌సెల్ ఛైర్మన్ కామన ప్రభాకరరావు మాట్లాడుతూ నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని,13 గంటల పనివిధానం జీఓని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కౌలురైతులు, చేతివృత్తిదారుల రుణాలు మాఫీ చేయాలని కోరారు. కిసాన్‌సభ రాష్ట్రనాయకులు డి.హరినాధ్ మాట్లాడుతూ పనికి ఆహార పథకాన్ని 200రోజులకు వర్తింపజేయాలని రో.ఉ వారీ, వేతనంరూ.700లకు పెంచాలన్నారు. పత్తి,,ధాన్యం,శనగ.మొక్కజన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. సీనియర రైతుసంఘంనాయకులు చుండూరు రంగారావు మాట్లాడుతూ ఈనెల26 అన్నిజిల్లాకేంద్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక విధానాలను నిరశిస్తూ నిరసన, ప్రదర్శనలు చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందించాలని కోరారు. మీడియాసమావేశంలో నల్లమడరైతుసంఘంరాష్ట్ర నాయకులు డాక్టర్ రాజమోహన్, ఇప్టూ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్‌బాబు, రైతుకూలీ సంఘం రాష్ట్రకార్యదర్శి కెఎన్‌రాజు, పలుసంఘాల నేతలు పాల్గన్నారు.

## పూర్తి ఆధారాలతోనే జోగి రమేశ్ అరెస్టు



**విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** కల్తీ మద్యం కేసులో వైసీపీ నేత జోగి రమేశ్‌ను పూర్తి ఆధారాలతోనే పోలీసులు అరెస్టు చేశారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలో భాగంగానే జోగి రమేశ్ నకిలీ మద్యం తయారు చేయించారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ కేసులో అన్ని ఆధారాలూ సేకరించిన తర్వాతే చట్టపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు.సోమవారం మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం మీడియాతో మాట్లాడుతూ... జోగి రమేశ్‌కు, మరో నిందితుడైన జనార్దనరావుకు మధ్య ఉన్న సంబంధం అందరికీ తెలిసిందేనని అన్నారు. జనార్ధనరావు నేరుగా జోగి రమేశ్ ఇంటికి వెళ్లినట్లు నిర్ధారించే సీసీటీవీ ఫుటేజ్ కూడా తమ వద్ద ఉందని ఆయన వెల్లడించారు. బీసీల గురించి మాట్లాడే నైతిక అర్హత జోగి రమేశ్‌కు ఏమాత్రం లేదని విమర్శించారు. ఈ కేసు దర్యాప్తు విషయంలో ఎవరూ జోక్యం చేసుకోవద్దని మంత్రి హెచ్చరించారు. ఒకవేళ పోలీసు శాఖలో ఎవరైనా అధికారులు ఉద్దేశపూర్వకంగా జోగి రమేశ్‌కు అనుకూలంగా వ్యవహరించినా, కేసును తప్పుదోవ పట్టించాలని ప్రయత్నించినా వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఈ విషయాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుందని, దోషులు ఎవరైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు.

# తిరుమల సమాచారం



## రేపు కార్తీక పౌర్ణమిగరుడసేవ

**తిరుమల,నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి:** కొండలరాయుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పురస్కరించుకుని 5వతేదీ బుధవారం కార్తీక పౌర్ణమి గరుడసేవ జరగనుంది. ప్రతినెలా పౌర్ణమికి తిరుమలలోఅత్యంత వేడుకగా గరుడసేవ నిర్వహించడం ఆనవాయితీ. బుధవారం సాయంత్రం మలయప్పస్వామిని సర్వాలంకారభూషితుడ్నిచేసి అర్చకులు వాహనమండపం వద్దకు వేంచేపుచేస్తారు. అక్కడ గరుడవాహనంపై అధిరోహింపజేసి ఆలయ మాఢవీధుల్లో రాత్రి 7గంటలకు మలయప్పస్వామిని ఊరేగిస్తారు. బ్రహ్మోత్సవాల్లో గరుడసేవకు అత్యంత విశిష్టత ఉంది. 108 వైష్ణవ దివ్యదేశాల్లో గరుడసేవను వైఖానస ఆగమోక్తంగా నిర్వహింపజేస్తారు.



## శ్రీవారి ఆశీస్సులతో లోకం సుభిక్షం

### వనమామలి జీయర్‌స్వామి

**తిరుమల,నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మానవాళి సుభిక్షంగా ఉండాలని,అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని శ్రీమద్ పరమహమ్‌సేథాయంతి మధురకవి వానమామలి జీయర్‌స్వామి ఆకాంక్షించారు. పవిత్రమైన కార్తీక సోమవారం ఉదయం శిష్యులతో కలసి ఆలయం వద్దకు విచ్చేసిన స్వామివారికి ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా మహాద్వారం వద్ద స్వాగతం పలికారు. ఆలయంలోపలకు చేరుకుని తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు.ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకులమండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## శ్రీవారి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి

### పలువురు న్యాయమూర్తులు

**తిరుమల,నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని దేవుని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. కార్తీకమాసం రెండవ సోమవారం ఉదయంనైవేద్యాల విరామసమయంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టున్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు కుటుంబసభ్యులతో కలసి వేర్వేరుగా ఉదయం ఆలయంలోనికి చేరుకుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి దర్శనంతో మనసు సంతోషం



**తిరుమల,నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు ఆనందంగా ఉంటుందని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ సిఎస్,మాజీ ఇఒ ఎల్‌వి సుబ్రమణ్యం ఆకాంక్షించారు. సోమవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఎల్‌వి సుబ్రమణ్యం దంపతులు ఆలయంలోనికి చేరుకున్నారు. వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## శ్రీవారి సేవలో ప్రముఖులు

**తిరుమల,నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి:** కార్తీకసోమవారం ఉదయం ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం మనస్సు ఆనందంగా ఉందని పలువురు ప్రముఖులు తెలిపారు. ఉదయం విఐపి బ్రేక్‌లో బాలీఉడ్‌నటుడు ,దర్శకుడు తుషార్‌కపూర్, సినీ దర్శకుడు ఎంఎం రత్నం వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల బాలీఉడ్‌నటుడితో పలువురు పొటోలు దిగారు.

## వెంకన్న దర్శనంలో శ్రీలంక నెట్‌బాల్ క్రీడాకారిణి తర్జని



**తిరుమల,నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీలంక జాతీయ నెట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ తర్జని శివలింగం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమె ప్రపంచంలోనే అత్యంత పొడవైన నెట్‌బాల్ క్రీడాకారిణిగా పేరుంది.సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలసి తిరుమలకు వచ్చిన ఆమె శ్రీవారిని దర్శించు కున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

## బ్యాటరీ ద్విచక్రవాహనాలు విరాళం



**తిరుమల,నవంబరు 3ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిపై భక్తివిశ్వాసాలతో ఓ దాత భక్తుడు బ్యాటరీతో నడిచే మూడు ద్విచక్ర వాహనాలను విరాళంగా అందించారు. అనంతపురం జిల్లా ధర్మవరంకు చెందిన వేణుమోటార్స్ అధినేత డి.వేణుగోపాల్ 1.53 లక్షల రూపాయలు విలువ చేసే ఈ మూడు బ్యాటరీ వాహ నాలను సోమవారం సాయంత్రం టిటిడి ఆలయ ఎఇఒ మోహన్‌రాజు,రవాణా విభాగం ఇన్‌ఛార్జి హరిబాబుకు దాత అందజేశాడు.

వార్త

ఏ కాలంలోనైనా, ఏ జాతికైనా దాని భవిష్యత్తు ఇరవై ఐదేళ్లలోపు వయస్సున్న యువకుల భావాలపైనే ఆధారపడి ఉంటుంది.

-కార్లయిల్

# ఈ చావులను ఆపలేరా?


ఎవరి చావు ఎప్పుడొస్తుందో ఎవరికీ తెలియదు, ఎలా వస్తుందో అసలే తెలియదు. కానీ ఎందుకనో తెలుగు రాష్ట్రాల్లో ఈ మధ్యచావులు కట్టకట్టుకుని వస్తున్నాయి. అదేమిటో కానీ మొన్న రాయలసీమలో, నిన్న ఉత్తరాంధ్రలో, ఇవాళ్ల ఉదయం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడలో ఓటిప్పర్ ఢీకొని ఆర్టీసీ బస్సులోని 24 మంది మృతులైనారు. తెల్లవారు జామున 4.45కి తాండూరులో బయలుదేరిన పల్లెవెలుగు బస్సులో ప్రమాదం జరిగే సమయానికి 70 మంది ప్రయాణికులున్నారు. 50 టన్నుల కంకరతో వస్తున్న టిప్పర్ బస్సును ఢీకొనగా కుడిచేతి వైపు భాగాన్ని బలంగా ఢీకొని అటువైపు కూర్చున్న 21 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు చనిపోయారు. మరికొంత మంది పరిస్థితి విషమంగా ఉంది. ప్రయాణం జరిగిన తీరు బాగా విచిత్రంగా ఉంది. బస్‌ను టిప్పర్ ఢీకొని ముందు భాగాలు ధ్వంసం అవడం మామూలే. కానీ టిప్పర్ అతివేగంతో వస్తున్నట్లుంది. అదుపు తప్పి నేరుగా బస్సు కుడివైపు అర్ధభాగంలో టిప్పర్ కుడివైపు భాగాన్ని చీల్చేసింది. ఆ సందర్భంలోనే టిప్పర్ బస్సు మీద వాలిపోగా కుడివైపు ప్రయాణికుల మీద కంకర రాళ్లు జారిపడ్డాయి. కంకర కింద చాలా మంది ప్రయాణికులు ఉండిపోయారు. ఇంతటి ఘోరం కనీవినీ ఎరుగని విషాదంగానే పరిగణించాలి. కొన్నాళ్ల క్రితం బోయింగ్ విమాన ప్రమాదంలో లెక్కకు మించి ప్రయాణికులు తనువు చాలించారు. ఆ తరువాత ఎన్నో విమాన ప్రమాదాలు వినవచ్చాయి. చిన్నవైనా, పెద్దవైనా ప్రమాదాలు, వాటి తాలూకు చేదు స్మృతులు చూసి చూసి జనం విసుగెత్తిపోయారు. చావులు లెక్కల నమోదు వారికీ చిరాకు వేసింది. ఆ తర్వాత కుంభకోణం నుంచి భక్తజన సందోహంతో తొక్కిసలాటలు మితిమీరిన వేగం, నిర్లక్ష్యం, నియమనిబంధనలు పాటింకపోవడంతో బస్సులు, వామనాల ప్రమాదం, అవాంఛనీయ సంఘటనలు. వాటి మీద వచ్చే కథనాలతో ఆత్మీయుల ఆక్రోశమేకాదు, మానవతావాదుల్లో అనుకోని అలజడి. ఇవన్నీ మామూలే అని సరిపెట్టుకోలేం. గత యేడాదిలో జరిగిన ప్రమాదాల జాబితా చూస్తే కొల్లేటి చాంతాడంత. నిర్లక్ష్యానికి నిర్లక్ష్యానికి మధ్య, ప్రమాదానికి ప్రమాదానికి మధ్య, విషాదానికి విషాదానికి మధ్య ఎలాంటి గ్యాప్ లేకుండా తరచు ప్రమాదాల బారిన పడి అమాయకులు బలౌవుతున్నారు. ఇండియాలో గతంలో జరిగిన పెద్ద ప్రమాదాలు, భారీ సంఖ్యలో ప్రాణనష్టం వంటి అంశాలు చూస్తే ఏ ప్రమాద ఘటన మరో ప్రమాద ఘటన నకలు కాదు. దేని ప్రత్యేకత దానిదే. ఈ కారణాలను విశ్లేషించుకుని అలాంటి మరో ప్రమాదం జరగకుండా చూడడం ప్రభుత్వాల బాధ్యత. ప్రమాదం జరిగిన వెంటనే బాధ్యతగల అధికార్లు చేస్తున్న ప్రకటనలతో జనంలో ఇంకా అనుమానాలు పెరిగిపోతున్నాయి. కేవలం పరిహారాలు ప్రకటించి సరిపెట్టుకోమంటే ఎవరూ ఊరుకోవడం లేదు. అయినా మళ్లీ మామూలే. ఇండియాలో గతంలో ఇలాంటి ప్రమాదాలు ఎందుకు ఎలా జరిగాయో తెలిసికూడా మరోసారి అలాంటి ప్రమాదం జరగకుండా ప్రభుత్వాలు తీసుకున్న చర్యలేవీ కనపడవు. ఎక్కడ ప్రమాదం జరిగినా ప్రమాద దృశ్యాలు మనసును కలిచివేస్తాయి. ప్రమాద సమయంలో టిప్పర్ డ్రైవర్ తాగిఉన్నాడని, మితిమీరిన వేగంతో బండి నడుపుతున్నాడని, ప్రమాదాన్ని గమనించినా టిప్పర్‌ను కంట్రోలు చేసుకోలేక బస్సును ఢీకొన్నాడని సమాచారం. అతను, బస్ డ్రైవర్ మరో 4 పురుష ప్రయాణికులు, 12 మంది మహిళా ప్రయాణికులు, ఒక పసిపాప చనిపోయిన వారిలోఉన్నారు. వారిని కబళించేందుకు ఓ మృత్యు శకటం అమిత వేగంతో వస్తున్నట్లు వారిలో ఎవరికీ తెలియదు. ప్రమాద ఘటనపై పాలకుల దిగ్భ్రాంతులు, సంతాపాలు, పరిహారాలు, ప్రకటనలు, ఘటనపై విచారణ వంటివన్నీ కంటితుడుపు చర్యలే! మృతుల్లో అధికులు తాండూరు వాసులే. ఓవర్‌లోడ్, ఓవర్ స్పీడ్‌లు ఇక్కడ వారిప్రాణాలు తీసాయి. కేవలం 33 టన్నుల మేరకే లోడ్ పరిమితి ఉండగా 50 నుంచి 60 టన్నుల సరుకు రవాణా చేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘన స్పష్టంగా కనబడుతోంది. ఇలా అధిక లోడ్ చేయడం ఇదే మొదటిసారేమీ కాదు. అధికారులు పూర్తిస్థాయిలో చెక్ పెడితే తప్ప వాహనదారుల్ని నియంత్రించడం కష్టం. ప్రమాదం ఎంత తీవ్రత ఉన్నా దానికి కారణం అతివేగం. నిర్లక్ష్యమేనని వేరే చెప్పనవసరం లేదు. డ్రైవర్ల మద్యపాన ప్రభావానికి లోనయ్యాడా, లేదా! అనే విషయాలను పోలీసులు క్రమం తప్పకుండా చేయాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ యేడాది ఇంతవరకు జరిగిన ప్రమాదాల్లో 353మంది మరణించారు. తెలంగాణ ప్రయాణికులు 104 మంది మృతి చెందినవారిలో ఉన్నారు. తాజా ప్రమాదానికి కారణం షాద్‌నగర్ నుంచి బయలుదేరిన టిప్పర్ అధికలోడ్‌తో వెళ్తూ స్టీరింగ్‌ను అదుపు చేయలేకపోవడం, ఎదురొచ్చే వాహనాల తాకిడికి తొందరపాటు నిర్ణయం, తీసుకోవడం వల్లనే ఈ ప్రమాదం జరిగింది. ఈ బస్సులోనే తాండూరుకు చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు కూడా మృతిచెందారు. ఇటువంటి ఘోర విషాద సంఘటనలో ఒకే కుటుంబం వారు చనిపోవడం మరీ హృదయవిదారకం. రహదారుల్లో తిరిగే వాహనాలు వేగ నియంత్రణ ప్రభుత్వం కర్తవ్యం. చిత్తశుద్ధితో ముందుకు సాగాలి. అదేమిటో కానీ గతుకుల గుంతల రోడ్డుల్లో వెళ్లే వాహనాలకు మరిన్ని అవస్థలు తోడై చివరికి చావు అంచుకు తీసుకెళ్తుంది. అధిక లోడు, అమిత వేగంతో వెళ్లేవాహనాలను ప్రాథమిక దశలోనే కట్టడిచేయడం అవసరం.

యుద్ధానికి ఎవరూ కారణాలను అన్వేషించరు. ఫలితం ఏమిటనే అందరూ ప్రశ్నిస్తారు.



సెనెకా

మీరు తప్ప మీకు శాంతిని ఎవరూ ప్రసాదించలేరు. సిద్ధాంతాలు పాలనలో విజయాన్ని సాధించినప్పుడే మీకు మానసిక శాంతి లభిస్తుంది.



ఎమర్సన్

# ప్రజావాక్కు



## భక్తి ఉత్సాహం కాదు - జాగ్రత్తే జీవం

ఆంధ్రప్రదేశ్‌లోని కాశీబుగ్గ దేవాలయంలో జరిగినరద్దీ ఘటనలో ఎనిమిది మంది మహిళలు, ఒకచిన్నారి మృతి చెందడం ఎంతో విషాదకరమైనసంఘటన. భక్తి భావంతో దేవాలయానికి వచ్చిన వారుప్రాణాలు కోల్పోవడం మనం దరినీ కలచివేస్తోంది. ఇటువంటి ఘటనలు సాధారణంగా సరైన ప్రణాళికల లోపం, భద్రతా చర్యల తక్కువతనం, జనసందోహ నియంత్రణలో విఫలం వంటి కారణాలతో జరుగుతుంటాయి. ప్రభుత్వం, దేవాలయ నిర్వాహకులు ముందుగానే పెద్ద సంఖ్యలో భక్తులు చేరుతారని అంచనా వేసి, తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలి. బారికేడ్లు, ఎమర్జెన్సీ మార్గాలు, తగిన వైద్య సదుపాయాలు, పోలీసులు, వాలంటీర్ల సమన్వయం తప్పనిసరి. అంతేకాదు, భక్తులు కూడా క్రమశిక్షణ పాటిస్తూ, నెమ్మదిగా కదలాలి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## మితిమీరిపోతున్న వాగ్దానాలు

బీహార్ రాష్ట్రఅసెంబ్లీకి జరగనున్న ఎన్నికలలో పలు పార్టీలవాగ్దానాలుమితిమీరిపోతున్నాయి. ముఖ్యంగా ఇండియా కూటమిఅభ్యర్థి మహాగఠ్‌బంధన్‌పార్టీనాయకుడు, ముఖ్యమంత్రి పదవిని ఆశించే తేజస్వియాదవ్ ప్రతీ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇస్తామని ప్రజలను మభ్యపెడుతూ ఓటర్లను ఆకర్షిస్తున్నారు. అదీకాక మరెన్నో సంక్షేమపథకాలనుప్రకటిస్తూపోతున్నారు. దీనికయ్యే ఖర్చు రాష్ట్ర వార్షిక బడ్జెట్‌కు రెట్టింపుపైనే అని ఆర్థిక నిపుణులు లెక్కలు వేసి చెప్పారు. ఈ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారువస్తే ఆప్రభావం రాబోయే తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల మీద బి.జె.పి. ప్రభావం గట్టిగా ఉండవచ్చు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## సెలవులు మంజూరు చేయాలి

రాష్ట్రంలోని వివిధగురుకులలో పేదవిద్యార్థులకు విద్యతో పాటుగా రుచికరమైన వంటల కోసం ప్రభుత్వం ఆహార మేనును పెంచడం చాలా సంతోషకరం. డిప్యూటీ వార్డెన్ ఇచ్చిన సరుకులు పిల్లలసంఖ్యను బట్టివంట మనుషులకు ఇవ్వడం జరుగుతుంది. కానీ వంట సిబ్బంది ఆహార పదార్థాలుసంచులు, బ్యాగ్స్ లలోఇంటికితీసుకొనిపోవడం వలన కొన్నిఇబ్బందులు జరుగుతున్నాయి. డిప్యూటీ వార్డెన్ పర్యవేక్షణలోవంట వర్కర్స్ సెలవులు మంజూరు కావాలి.

- రాపాక రవీందర్, జనగాం

## భాషపై వ్యతిరేకత

తమిళనాడులో ఇతర రాష్ట్ర భాషఅమలుపై వ్యతిరేకత దేశవ్యాప్తంగా చర్చలకు కారణమైంది. ఈ వ్యతిరేకత కేవలం భాషా సమస్యకాదు, ఇది రాష్ట్రపు సాంస్కృతిక, భౌగోళిక, సామాజిక, చరిత్రాత్మక అస్తిత్వానికి సంబంధించినది. తమిళనాడు ప్రజలు తాము పుట్టిన భాష, సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడానికి పదేపదే పోరాటంచేస్తున్నారు. వారిపై హిందీ భాషను బలవంతంగా రుద్దడంపై వారు వ్యతిరేకిస్తున్నారు. భాషా పరిరక్షణకు చట్టాలు, ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నప్పటికీ, కేంద్రప్రభుత్వం ఒక భాషకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా రాష్ట్రానికి అమలు పరచాలని ప్రయత్నించడం బాధాకరం. ఇది స్థానిక జీవనశైలిని, భిన్నత్వాన్ని, సామాజిక సమన్వయాన్ని దెబ్బతీస్తుంది. భాషకేవలం సంభాషణపద్ధతికాదు, అది గుర్తింపు. భావప్రవాహం, చరిత్ర, సాంప్రదాయాల ప్రతిబింబం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## అమెరికాను నమ్మకూడదు

ఆసియాన్ తూర్పు దేశాలకూటమి, మొత్తంగా ఆసియాన్ కూటమిలలో భారత్ ప్రముఖపాత్ర పోషించే అవకాశంఉంది. ఎందుకని ఇంతకు ముందు అవలంబించిన తూర్పు దేశాల వైపు చూపు. ఇప్పుడుఅవలంబిస్తున్న నీబర్‌దేశాలను బలంగ తయారు చేసుకోవడం వంటి అంశాలు ఇప్పుడు మనముందు ఉన్న అంశాలుగా ఉన్నాయి. అందుకే అమెరికా కూడా ఆసియా పసిఫిక్ కాకుండా ఇండోపసిఫిక్‌గా పేరు మార్చడంచూసాం. బలహీనమైన మూడో ప్రపంచ దేశాలను చెయ్యి చాచడం కూడా మనం గమనిచవచ్చు. జీ20 కూటమిలోకి ఆఫ్రికన్ దేశాల కూటమిని చేర్చడంలో భారత్ ముఖ్యపాత్ర పోషించింది. అయితే అమెరికాను నమ్మదగ్గ మిత్రునిగా ఎప్పుడు పరిగణించకూడదు.

- భారత అవినాష్, జనగామ

## శ్రీకాకుళం ఘటన బాధాకరం

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వెంకన్న ఆలయంలో ఏకాదశి సందర్భంగా భక్తులు విపరీతంగా వస్తారని ముందే సమాచారం ఉన్నా, ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేకపోవడం వల్ల తొమ్మిది మంది భక్తుల ప్రాణాలు పోయాయి. ఇప్పుడు ఈ ఘటనను ప్రైవేట్ ఆలయం పేరుతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఘటన అందరినీ కలచి వేస్తుంది. మృతుల కుటుంబాలకు కనీసం రూ.25 లక్షల పరిహారంఇవ్వాలి. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాలి.

- కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# దేశాల మధ్య యుద్ధం కాదు.. శాంతి కావాలి

**ప్రస్తుతం కృత్రిమ మేధస్సు ఉద్భవించి భవిష్యత్తుతో పరిస్థితులు, పరిణామాలు ఏరూపు దిద్దుకుంటాయో అన్న ఆలోచనతో కూడిన భయాన్ని కలిగి స్తున్నాయి. సైన్యాలతో ఆయుధాలతో భౌతికంగా దేశాలను ఆక్రమించుకొనే స్థితి ఇప్పుడు లేదు. కాలు కదపకుండా, ఆయుధం బయటపెట్టకుండానే ఆక్రమణ సాగించే పరిస్థితులు వస్తాయా అన్న ఆందోళనలో దేశాలు ఉలిక్కిపడుతున్నాయి. అందుకనే ఏ దేశమైనా కాలానుగుణంగా, విపత్కర పరిస్థితుల నేపథ్యంలో సమదృష్టితో సమతుల్యత పాటించే నేర్పులో చాకచక్యంగా దేశాల మధ్యశత్రుత్వ భావాలను రూపుమాపి స్నేహభావాన్ని పటిష్టం చేసే నాయకుడు రావాలని కోరుకోవటంలో తప్పులేదు. శాంతి సందేశంతో, ప్రేమానురాగాలు స్నేహ, సుహృద్భావ వాతావరణం ఏర్పరిచే నాయకుడి కోసం ఎదురుచూస్తున్నాయా గ్లోబల్ వ్యవస్థకు ఎక్కడినుంచి ఎప్పుడు వస్తారో ఎదురు చూడక తప్పదేమో!**



రావులపాటి సీతారాంరావు

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పెద్ద పజిల్‌గా మారారు. మాటలకూ, చేతలకూ పోలికే ఉండదు. చెప్పేదానికీ, చేసే దానికీ, ఎంత ప్రయత్నించినా లంకె అందటంలేదు. అగ్రదేశంగా భావిస్తున్న అమెరికా అధ్యక్షుడే ఈ విధంగా అంతర్జాతీయ అవగాహనకు అతీతంగా వివిధ దేశాలతోటి సంబంధాలు నెరపుతుంటే ఎవరు ఏం చేయగలరు? ఒకప్రక్కన లెక్కకు మించిన సుంకాల బరువు భారత్‌నెత్తిన పెట్టానే మరోపక్క ప్రధాని మోడీని ప్రాణ మిత్రుడు, ఇంద్రుడు, చంద్రుడు అని ప్రకటనలు చేస్తుంటే దౌత్యసంబంధాలు చూసి భారతీయ విదేశాంగ శాఖ నిపుణులు తలలు పట్టుకుంటున్నారు. ఈ రకమైన విదేశాంగ విధానాన్ని అర్థం చేసుకోలేక, జవాబు ఇవ్వలేక సతమతమవుతున్నారు. ఆసియా, పసిఫిక్ ఎకనామిక్ కోపరేషన్ సమ్మిట్ సౌత్ కొరియాలోని జిమొంజోలో ఈ మధ్య జరిగిన సమావేశంలో మాట్లాడిన తీరు వింతగా ఉంది. మీడియా కథనాల ప్రకారం ప్రధాని మోడీ మంచివాడు, గట్టివాడు, ఆయనకు ఫోన్‌లో చెప్పాను, మీతో వాణిజ్య ఒప్పందం (ట్రేడ్ డీల్)కు దూర్చుకోలేను. కాదు, కాదు చేయలేం! పాకిస్థాన్‌తో యుద్ధం మొదలు పెట్టున్నారు. అందుకనే చేయలేం అన్నట్లు వచ్చాయి. ఈ సందర్భంలోనే పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌ను గొప్ప పోరాట యోధుడిగా పొగిడారు. అంతేకాదు 'గ్రేట్ గై' అని కూడా కితాబ్‌ఇచ్చారు. పాకిస్థాన్‌కు కాల్ చేసి చెప్పాను. మీతో ట్రేడ్ చేయలేం! మీరు ఇండియాతో పోరాడుతున్నారుగా అందుకని. మీ రెండు దేశాలలోనూ అణ్యదేశాల వాళ్లేఉన్నారు. లేదు, లేదు. మమ్మల్ని పోట్లాడుకోనివ్వండి అని రెండు దేశాలు అన్నాయి అనికూడా చెప్పి ద్వంద్వనీతిని ప్రదర్శించారు. ఇన్ని అలవోకగా చెప్పిన ప్రసిడెంట్ ట్రంప్ క్రితం రోజు టోక్యోలోరెండు దేశాల మధ్య యుద్ధాన్ని 24 గంటల్లోనే ఆపేసానని చెప్పటం ఎవర్నీ ఆశ్చర్యపర్చలేదు. ఆయన ఇప్పటికే చాలాసార్లు ఆ విషయాన్ని చెప్పారు కాబట్టి. భారత్, అమెరికాల మధ్య సంబంధాలు 50శాతం సుంకంతో ఇబ్బందుల్లో పడ్డాయి. రష్యా నుంచి క్రూడాయిల్ దిగుమతుల మీద 25 శాతం లేవీ కూడా విధించటంతో మరింత జటిలమయ్యాయి. ట్రేడ్ ఒప్పందాలు జరిగాయని అంటున్నా ఏ విధంగా ఇలాంటి ప్రకటనల మధ్య అవి అమలు కాబడతాయో ఎవరూ చెప్పలేకపోతున్నారు. పరిస్థితులు భారత్ అమెరికాల మధ్య ఈ విధంగా ఉన్న సమయంలోనే నిన్నగాక మొన్న రెండు దేశాలూ 10 సంవత్సరాల కాలపరిమితితో డిఫెన్స్ ఒప్పందం కౌలాలంపూర్‌లో చేసుకోవటం గమనార్హం. ముందస్తుగా డిఫెన్స్ ఇండస్ట్రీ అభివృద్ధి సాధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడటంలో సహకరించుకోవాలని ఒప్పందం ఇరు దేశాల రక్షణ శాఖ మంత్రులు చేసుకున్నారు. రెండు దేశాల మధ్య స్నేహసంబంధాలు మరింతగా పెంచుకోవాలని కూడా నిర్ణయించుకున్నారు. అటువైపు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తికమక సందేశాలు ప్రకటిస్తున్న తరుణంలోనే ఈరక్షణ ఒప్పందాలు జరగటం విశేషంగా చెప్పుకోవాలి. రక్షణ అనేది మన సంబంధాలకు మూలస్తంభం లాంటిది అని రాజ్‌నాథ్‌సింగ్ భారత్ రక్షణ శాఖమంత్రి అనటం కూడా విశేషంగానే చెప్పుకోవాలి. ఈ విధంగా పరస్పర విరుద్ధ ప్రకటనల మధ్య అమెరికా, భారత్ స్నేహసంబంధాలు కొనసాగుతున్నాయి.



ఏ దేశం అయినా స్నేహసంబంధాలు కొనసాగించడంలో తప్పుపట్టే అవకాశం ఉండదు. కానీ 'నమ్మకం' ఆ సంబంధం కలిగించే విధంగా ఉంటేనే ఇరు దేశాలనూ, ప్రపంచ దేశాలు నమ్ముతాయి. గ్లోబల్‌గా ఆలోచించటం ప్రతి దేశానికీ అలవాటయింది. కష్టదాటు వ్యవహారం తేలిగ్గానే కనుక్కొనే సమయం ఇది. సాంకేతిక పరిజ్ఞానంతో ముడిపడిఉన్న ఈ కాలంలో మాటల మూలాలు ఎవరికీ అక్కర్లేదు. అగ్రరాజ్యంగా భాసిల్లటానికి అనేక రంగాల్లో విజయాన్ని సాధించి చూపించక తప్పదు. హుంకరింపులతో ఏ దేశాన్ని ఎంత చిన్నదైనా, బలహీనదేశమైనా లొంగటానికి సిద్ధంగా లేదు. అంతర్జాతీయ రాజకీయాలు మారాయి. గతించిన కాలంలో అగ్ర దేశాలు పేరుపడిన యు.యస్.ఏ, యు.యస్.యస్.ఆర్ ఆర్థిక బలంతోపాటు అంగబలం, ఆయుధబలం సమకూర్చుకొని తాము చెప్పిందే వేదం అన్న రీతిలో ఇతర దేశాలను అదుపులో ఉంచుకున్నాయి. కుటమూలు కట్టి చెరికొన్నిరాజ్యాలను తమ గుప్పిట్లో ఉంచుకొనే ప్రయత్నం చేశాయి. భారత్ మరికొన్ని దేశాలు జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలో స్వతంత్ర ఆలోచనలతో ఈ కూటముల నాయకత్వాన్ని సవాలు చేసే రీతిలో కాకుండా సమన్యాయం, సమదృష్టి సమాన దూరం పేరుతో అలీన విధానానికి ప్రాణప్రతిష్ట చేసి బలహీనంగా కనపడిన దేశాలకు నైతికబలం చేకూర్చాయి. కాలక్రమేణా వైవిధ్య భరితమైన పరిస్థితుల్లో అనేకరంగాల్లోచిన్నా, పెద్దా తేడా లేకుండా సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యత సాధించి 'మేమూ ఉన్నాం' అన్నట్లుగా పెద్ద అని చెప్పుకొనే దేశాలను సవాలు చేస్తున్నాయి. ఇజ్రాయిల్ చిన్న దేశమే కానీ మతం పేరిట సమిష్టి బలాన్ని ఏర్పరుచుకుంటున్న దేశాలకు ముకుతాడు వేయగలిగింది. మెరుపు వేగంతో యుద్ధ పటిమను ప్రదర్శించి లొంగకుండా ప్రపంచ చిత్రపటంలో మెరుస్తున్నది. ఉక్రెయిన్ రష్యా నుంచి విడిపోయిన తర్వాత సవాల్‌కు ప్రతి సవాల్ విసిరే స్థాయికి ఎదిగింది. అమెరికా, రష్యాలు ఈ రెండు దేశాలను లొంగదీసే ప్రయత్నంలో సామ, దాన, భేద, దండోపాయాలు ప్రయోగించినా, ఎదురొడ్డి చాకచక్యంగా పోరాడి, ఇంకా బలపటిమకు ప్రతిరూపంగా నిలుస్తూనే ఉన్నాయి. చైనా, పాకిస్థాన్ దేశాలు భారత్‌కు అనేక రకాలుగా సరిహద్దు సమస్యలు సృష్టించి పైచేయి సాధించాలని ప్రయత్నించినా 'ఆపరేషన్ సిందూర్'తోభారత్ ఆటకట్టించింది. చైనా, భారత్‌తో 'భాయీ-భాయీ'అనటమే మేలు అని భావించిందో ఏమో స్నేహ హస్తాన్ని చాపుతున్నది. స్నేహ హస్తాన్ని శత్రువు చూపినా అందుకోవటం భావ్యమే అని యుద్ధనీతి చెప్తుందని విజ్ఞులు వల్లిస్తుంటారు. భారత్ అందుకనే చైనాతో, తాను అన్నిరంగాల్లో అగ్రస్థాయిని సాధించిన తర్వాతనే సమఉజ్జీగా స్నేహ హస్తాన్ని అంగీకరించింది. చైనా, ఇండియాల కలయిక ఇతర అగ్రదేశాలను కూడా కలవరపెడ్తున్నాయి. భారత్ సరిహద్దు దేశాలైన శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్, మయన్మార్‌లకు ఈ రెండు సరిహద్దు దేశాలు బలంగా ఉంటేనే, భవిష్యత్తు ఉంటుంది. రెండు దేశాల మధ్య శత్రుత్వం ఉంటే వాటికి లేగదూడల పరిస్థితి ఏర్పడుతుంది. కాల మాన పరిస్థితులానుసారం అనేక రంగాల్లో మార్పులు సంభవిస్తున్నాయి. సాంప్రదాయ యుద్ధరీతులు మారి అణుయుద్ధాలు కూడా ఒక సమయంలో చోటు చేసుకొనే ప్రమాదాన్ని సూచించాయి. అదీ మారి డిజిటలైజేషన్‌తో దేశాల మధ్య భౌతిక దూరాలు కనుమరుగయ్యాయి. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు ఉద్భవించి భవిష్యత్తుతో పరిస్థితులు, పరిణామాలు ఏరూపు దిద్దుకుంటాయో అన్న ఆలోచనతో కూడిన భయాన్ని కలిగిస్తున్నాయి. సైన్యాలతో ఆయుధాలతో భౌతికంగా దేశాలను ఆక్రమించుకొనే స్థితి ఇప్పుడు లేదు. కాలు కదపకుండా, ఆయుధం బయటపెట్టకుండానే ఆక్రమణ సాగించే పరిస్థితులు వస్తాయా అన్న ఆందోళనలో దేశాలు ఉలిక్కిపడుతున్నాయి. అందుకనే ఏ దేశమైనా కాలానుగుణంగా, విపత్కర పరిస్థితుల నేపథ్యంలో సమదృష్టితో సమతుల్యత పాటించే నేర్పులోచాకచక్యంగా దేశాల మధ్యశత్రుత్వ భావాలనురూపుమాపి స్నేహభావాన్ని పటిష్టం చేసే నాయకుడు రావాలని కోరుకోవటంలో తప్పులేదు. శాంతి సందేశంతో, ప్రేమానురాగాలు స్నేహ, సుహృద్భావ వాతావరణం ఏర్పరిచే నాయకుడి కోసం ఎదురుచూస్తున్నాయా గ్లోబల్ వ్యవస్థకు ఎక్కడినుంచి ఎప్పుడు వస్తారో ఎదురు చూడక తప్పదేమో! •

# మన రూపాయితో యూకె 'వర్సిటీ'ల సోకు

బి.మధుపాళి

దూరపు కొండలు నున్నగా కనిపిస్తాయి. పొరుగింటి పుల్ల కూర రుచిగానే ఉంటుంది. విదేశీ చదువులు ఆకర్షణీయంగా తోస్తాయి. సొమ్మొకడిది, సోకొకడిది లాగా ఉంది విదేశీ యూనివర్సిటీల తీరు. మన యూనివర్సిటీలు అంటే అంత ఇష్టం ఉండదు. మధ్య తరగతితో పాటు పేద విద్యార్థులు కూడా రుణాలు తీసుకొని విదేశీ చదువులకు క్యూ కడుతున్నారు. తీరా చదువులు పూర్తి అయ్యాక ఉద్యోగ ఉపాధులు దొరక్క, చేసేదేమీ లేక నిరాశానిస్పృహలతో మూట ముల్లె సర్దుకొని వెనుదిరుగుతున్నారు. యూకె (యునైటెడ్ కింగ్‌డమ్) లేదా గ్రేట్ బ్రిటన్ అంటే ధనిక దేశమని ఓ అపోహ మన తల్లితండ్రులు, యువతలో కనిపిస్తున్నది. మన బలహీనతను ఆసరాగా చేసుకొని విదేశీ యూనివర్సిటీలు, ముఖ్యంగా యూకె లాంటి దేశాల ఉన్నత విద్యా సంస్థలు మన యువత చెల్లించే అపరిమిత ఫీజులతో మనుగడ సాగించడం, నాణ్యత కొరవడిన విద్యను అందించడం, కోర్సు పూర్తి కాగానే మీ దేశం వెళ్లమని గెంటేయడం అనాదిగా కొనసాగుతున్నది. దాదాపు 33 శాతం బ్రిటన్ లేదా యూకె విశ్వవిద్యాలయాలు నిధుల కొరతతో లోటు బడ్జెట్ నడుమ నత్తనడకతో కొనసాగుతున్నాయని, ఈ యూనివర్సిటీల మనుగడ విదేశీ విద్యార్థులు, ముఖ్యంగా భారతీయ యువత అధిక మొత్తంలో చెల్లించే ఫీజులతో ఆధారపడుతున్నట్లు తాజా విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. యూకె పౌరుల నుంచి అతి తక్కువ ఫీజులు వసూలు చేస్తూ, విదేశీ విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ముక్కు పిండి వసూలు చేస్తూ తమ పబ్బం గడుపుతుంటున్నాయి. భారతీయ విద్యార్థులు 49శాతం యూకెలోని తక్కువ ర్యాంకులు/నాణ్యత కొరవడిన కోర్సులు కలిగిన యూనివర్సిటీల్లో, మామూలు ర్యాంకులు పొందిన యూనివర్సిటీల్లో 41 శాతం మంది,10శాతం మంది ఏ ర్యాంకు పొందని యూని



వర్సిటీల్లో చేరుతున్నట్లు తెలుస్తున్నది. తొలి పది అత్యుత్తమ ర్యాంకులు పొందిన యూనివర్సిటీల్లో 4శాతం మంది భారతీయ యువత మాత్రమే అడ్మిషన్లు పొంది చదువులు కొనసాగిస్తున్నారు. ఏరు దాటాక తెప్ప తగిలేసినట్లు, అధిక ఫీజులు చెల్లించి కోర్సులు పూర్తి చేసిన భారతీయ యువత వీసా గడువులు ముగియడంతో ఉద్యోగాలు దొరక్క బలవంతంగా వెనుదిరగడం జరుగుతున్నది. 2021-22 విద్యా సంవత్సరంలో 60 శాతం యూకె యూనివర్సిటీలు లోటు బడ్జెట్‌లో పడ్డాయని, 2022-23 నాటికి వీటి సంఖ్య 33 శాతానికి చేరిందని విశ్లేషించబడింది. రోజురోజుకు విదేశీ విద్యార్థుల సంఖ్య, వారు చెల్లించే ఫీజుల మొత్తం క్రమంగా పెరగడంతో యూకెలోని విఫలమైన యూనివర్సిటీల మనుగడకు వరంగా మారడం గమనించారు. 2022-23లో విదేశీ విద్యార్థులు 23.7 శాతం అడ్మిషన్లు పొందగా, వారు చెల్లించే ఫీజులు మాత్రం 53శాతం వాటాను పొందడంతో బ్రిటన్ యూనివర్సిటీలు విదేశీ విద్యార్థుల ఫీజులతోనే నడుస్తున్నట్లు తెలుస్తున్నది. 2023-24లో 1,11,329 మంది భారత యువత అడ్మిషన్లు పొందారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2022-23లో ప్రపంచ దేశాల్లోనే (చైనాను కూడా అధిగమించి) అత్యధికంగా 1.25 లక్షల భారతీయ యువత యూకె యూనివర్సిటీల్లో చేరారని, వీరు చెల్లించే ఫీజులు అధిక మొత్తంలో ఉంటున్నాయని తెలుస్తున్నది. భారతీయ యువతకు ఐదేళ్ల కాలపరిమితులతో యూకె వీసాలు ఇస్తున్నారని, గడువు పూర్తి కాగానే 70 -80 శాతం యువత తిరుగు ప్రయాణం చేస్తున్నారని, కేవలం 24 శాతం మంది మాత్రమే వర్క్‌వీసాలకు అర్హత పొందుతున్నారని తెలుసుకోవాలి. యూకెలో కాల పరిమితులు లేని వీసాలు పొందడం భారతీయ యువతకు అసాధ్యంగానే తోస్తున్నది. ఈ విషయాలన్నింటినీ క్షుణ్ణంగా విశ్లేషించుకొని నాణ్యతా ప్రమాణాలు కలిగిన యూకె యూనివర్సిటీల్లో మాత్రమే అడ్మిషన్లు పొంది తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తల్లితండ్రులకు, విద్యార్థులకు సూచిస్తున్నారు. •

# రైతు గెలుపుతోనే దేశాభివృద్ధి సాధ్యం

డా. చిటికెన కిరణ్ కుమార్

మట్టి తడిగా ఉన్నంతవరకు మన జీవితం తడిగా ఉంటుంది. ఆ మట్టిని తడిపేది వాన కాదు, రైతు చెమట. రైతు పొలం మనిషి ఉనికికి మూలం, ఆ మూలం ఎండిపోతే ప్రపంచం నిర్జీవమవుతుంది. రైతు కేవలం పంట పండించే వ్యక్తి కాదు, భూమిని ఊపిరిగా మార్చే జీవశక్తి. మనం తినే అన్నంలో, మనం పీల్చే గాలిలో, మనం నడిచే నేలలో ఆయన కష్టానికి ముద్ర ఉంటుంది. రైతు చేతిలో మన భవిష్యత్తు ఉందని చెప్పడం కేవలం నినాదం కాదు. అది నిస్సందేహ సత్యం. రైతు చెమటతో పుట్టిన ధాన్యం మన జీవితంలోని ప్రతి వేళకు ఆధారం. ఆ చెమటలో సువాసన ఉంది, ఆ సువాసనలో జీవం ఉంది. రైతు ఉదయించే సూర్యుడికి ముందు లేస్తాడు, సాయంత్రం అస్తమించే సూర్యుడితో కలిసి ఆగుతాడు. ప్రతి విత్తనంలో ఆయన ఆశ ఉంటుంది, ప్రతి వానలో ఆయన ప్రార్థన ఉంటుంది. వానలు ఆలస్యమైనా, భూమిని వదిలిపెట్టడు. భూమి ఆయనకు అమ్మలా ఉంటుంది, పంట ఆయనకు పిల్లలా ఉంటుంది. ఆ బంధం మాటల్లో కాదు, హృదయంలో ఉంటుంది. రైతు చేతిలో భవిష్యత్తు అనగానే మనకు గుర్తొచ్చేది పంట కాదు, పరంపర. ఆ పరంపరలో సహనం, సత్యం, శ్రమ ఉంటాయి. రైతు కష్టపడితే దేశం నిలుస్తుంది, రైతు వెనుకబడితే జీవనం నిలవదు. మన పంటల వలెనే మన సమాజం కూడా రైతు భుజాల మీదే పెరుగుతుంది. ఆయన ఉనికి అంటే దేశపు ఆర్థిక ధమనిలో రక్తం ప్రవహించడం. రైతుపడే కష్టాలు బయటికి కనిపించకపోవచ్చు. కానీ ఆయన ప్రతి చెమట చుక్క మన జీవితానికి ఆక్సిజన్. వానలు ఎగతాళి చేసినా, మార్కెట్ ధరలు ఆడినాట్లు చేసినా, ఆయన ఆగడు. ఎందుకంటే ఆయన నమ్మకం మట్టి మీదే, ఆ మట్టి కృతజ్ఞతతో తిరిగి పంట ఇస్తుంది. రైతు ఆశలు బియ్యం గింజల్లా చిన్నవైనా, వాటి విలువ ప్రపంచానికీ పెద్దదే. రైతు సంతానం నగరాలకు వెళ్ళి ఉద్యోగాలు వెతికినా, ఆయన మనసు మాత్రం పొలంలోనే ఉంటుంది. మట్టి వాసన మానవ రక్తంలో కలిసిపోయినది. ఆ వాసనను మరచిపోవడం అంటే మన మూలాన్ని కోల్పోవడం. మనం ఎన్ని యంత్రాలు వాడినా, రైతు చేతిలోని మట్టి ముద్దే నిజమైన జీవం. భవిష్యత్తు రైతు చేతిలో ఉందనే మాటలో లోతైన అర్థం ఉంది. రైతు నిలబడితే దేశం నిలుస్తుంది. పంట పండితే మనం తింటాం, రైతు పడిపోతే మనం నిలువలేము. అందుకే రైతు ఉనికి అంటే మన ఉనికే. రైతు కేవలం ఆర్థిక వ్యవస్థకు కాదు, జీవన వ్యవస్థకూ హృదయం. ఆయన శ్రమను గౌరవించని సమాజం భవి



ష్యత్తును కోల్పోతుంది. రైతు తన పొలంలో విత్తనాలు వేస్తాడు, కాని ఆ విత్తనాలు భవిష్యత్తును పండిస్తాయి. ప్రతి విత్తనం జీవితం, ప్రతి మొలక ఆశ. ఆయన బలహీనంగా ఉన్నా, ఆయన ఆశ బలంగా ఉంటుంది. ఆ ఆశే మన భవిష్యత్తు. రైతు తినకపోయినా, ఇతరులు తినాలని కోరుకునే మనిషి. ఆ నిస్వార్థతే ఆయన గొప్పతనం. పొలంలో మడుసుకుంటున్న గడ్డి మధ్య ఆయన కాళ్లు నడుస్తున్నప్పుడు, ప్రపంచం ఆయన భుజాలపై ఉందని మనకు తెలియదు. కరువు, వరద, అప్పులు, తిప్పలు ఇవన్నీ ఆయన జీవనంలో భాగం. అయినా ఆయన నవ్వుతాడు. ఆ నవ్వులో గెలుపు లేదు, గెలుపుకు నమ్మకం ఉంది. రైతు గెలిస్తే, దేశం గెలుస్తుంది. రైతు పడిన చేతులు దేశానికి భద్రతా గోడలు. ఆ చేతులు మురికిగా కనిపించవచ్చు కానీ అవి మన భవిష్యత్తును మలుస్తాయి. నగరాల వెలుగులు ఆయన చెమట వెలుగుతోనే వెలుగుతాయి. ఒక రైతు తన భూమిలోపడే శ్రమను మనం గౌరవిస్తే, మనం భవిష్యత్తును కాపాడుతున్నట్టే. రైతు కేవలం పంట పండించడమే కాదు, సంస్కృతిని పండిస్తాడు. పంటతో పాటు ఆయన విలువలను కూడా పెంచుతాడు. సహనం, సమానత, త్యాగం, కృతజ్ఞత. ఆయన జీవితం కష్టాల నుంచి పుట్టిన కవితలా ఉంటుంది. ప్రతి గాలి, ప్రతి మబ్బు, ప్రతి విత్తనం ఆయనకు తోడు. ప్రకృతితో ఆయన స్నేహం వందల సంవత్సరాల పాతది. రైతు చెమట మట్టి తడిపితే, ఆమట్టి మన పాదాల కింద పసిడిగా మారుతుంది. ఆయన కష్టాన్ని గుర్తించని మనిషి మనుగడను మర్చిపోతాడు. రైతు జీవితం మనకే అద్దం. ఆయన ప్రతి శ్వాసలో భూమి రాగం ఉంటుంది. ఆ రాగాన్ని వినగలిగితేనే మనం నిజమైన భారతీయులం అవుతాం. పొలాల్లో పంటలు పెరిగేటప్పుడు, రైతు ముఖంలో ఆ వెలుగు పండుతుంది. ఆ వెలుగు ఎటువంటి దీపంతోనూ వెలగదు అది చెమటతో వెలిగే దీపం. ఆదీపం కాంతి మన ఇంటి అన్నపాత్రలో నిండిపోతుంది. రైతుఒక్క చుక్క చెమట విలువను మనం గుర్తించకపోతే, రేపటి భవిష్యత్తు మన చేతుల్లో ఉండదు. రైతు ఆశలు పెద్దవి కావు సరైన వానలు, సరైన ధరలు, సరైన గౌరవం ఇవే అతనికి కావలసిన భవిష్యత్తు. ఆయన మౌనం మన సమాజానికి అద్దం. ఆయన కష్టాన్ని గమనించి చూపే మనిషి మానవత్వానికి ప్రతీక. రైతు సంతోషంగా ఉంటే దేశం ప్రశాంతంగా ఉంటుంది. రైతు కష్టానికి ప్రతిఫలం విత్తనం పుట్టిన క్షణంలోనే మొదలవుతుంది. కానీ ఆవిత్తనం పంటగా మారేంతవరకు అతని హృదయంలో వంద ఆశలు మొలుస్తాయి. ఒక్కోమొలక ఎదుగుతుంటే ఆయన కళ్లలో వెలుగు పెరుగుతుంది. పంట పండకముందే ఆయన మనసులో భవిష్యత్తు పండుతుంది. ఇది కేవలం జీవన పోరాటంకాదు, అది ఆత్మతో మట్టికి మధ్య బంధం. మట్టిలో పుడుతూనే మనిషి రైతుగా మారడు. కానీ భూమిని మనసుతో చదివిన వాడే నిజమైన రైతు. ఆయన కాళ్లు పంటమధ్య నడుస్తున్నప్పుడు ఆ భూమి ఊపిరి పీలుస్తుంది. విత్తనాలు మొలకెత్తిన ప్రతిసారి భూమి నవ్వుతుంది. ఆ నవ్వు ఆయనకే వినిపిస్తుంది. •

## శిల్పాధికారంపై డాన్స్ విద్యార్థులకు ప్రత్యేక వర్క్‌షాప్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబర్3, ప్రభాతవార్త: వర్సిటీలోని డాన్స్ విభాగం విద్యార్థులకు శిల్పాధికారంపై ప్రత్యేక వర్క్‌షాప్ సోమవారం జరిగింది. ఈ వర్క్‌షాప్‌కు ముఖ్యవక్తగా వెల్లూరులోని తిరువల్లూరు యూనివర్సిటీ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏ.రూప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిల్పాధికారం గ్రంథంలోని



సాహిత్య, సాంస్కృతిక తత్త్వవిలువలను సమగ్రంగా వివరించారు. శిల్పాధికారం తమిళ సాహిత్యంలో ఉన్న ప్రాధాన్యాన్ని వివరిస్తూ ఆధునిక విద్యార్థులు తమ వ్యక్తిత్వ నిర్మాణంలో శిల్పాధికారం అనే భావనను ఎలా అర్థం చేసుకోవాలో చర్చించారు. ఏఎన్‌యు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య యం.సురేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ భాషల మధ్య సమన్వయం అవసరమన్నారు. అన్ని బాషల సాహిత్యాల తులనాత్మక అధ్యయనం మనకు విస్తృత దృష్టిని ఇస్తుందని వివరించారు. ఇటువంటి వర్క్‌షాప్‌లతో విద్యార్థులకు అవగాహనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విభాగాధిపతిఆచార్య పి.వరప్రసాదమూర్తి మాట్లాడుతూ శిల్పాధికారం తమిళ సాహిత్యంలో వేదానికి సమానమైన విలుల కలిగిందన్నారు. ఆ సాహిత్యం మన భారతీయ సంప్రదాయ కళల మూలాధారమని వివరించారు. ఈ వర్క్‌షాపులో కూచిపూడి విభాగం అతిథి అధ్యాపకులు మట్టుపల్లి కాశయ్య, థియేటర్ ఆర్ట్స్ విభాగాధిపతా ఆచార్య భూషణరావు, తెలుగు ప్రాచ్య భాషల విభాగం అతిథి అధ్యాపకులు డాక్టర్ పవన్, డాక్టర్ పి.వాసు, కూచిపూడి, భరతనాట్యం విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతీ గ్రామం స్వచ్ఛతకు నిలయం కావాలి

గుంటూరు వెస్ట్,నవంబర్ 3,ప్రభాతవార్త : ప్రతి గ్రామం స్వచ్ఛతకు నిలయం కావాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు.జిల్లా నీరు,పారిశుద్ధ్య కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణకు పెద్దపీట వేయాలని,ఎక్కడా బహిరంగ మల విసర్జన లేకుండా చూడాలన్నారు.బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా గతంలో ప్రకటించిన గ్రామాల్లో తనిఖీలు చేసి పరిస్థితులను గమనించాలన్నారు.ఎక్కడైనా వ్యక్తిగత,సామూహిక మరుగుదొడ్లు అవసరం అనుకుంటే మంజూరుకు



ప్రతిపాదనలు సమరి ్పంచాలని ఆదేశించారు.గ్రామీణ నీటి సరఫరా విభాగం పర ్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ కొత్తగా వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరుకు ప్రతిపాదనలు రావాల్సి ఉందన్నారు.గ్రామ సచివాలయాల పరిధిలో 109సామూహిక మరుగుదొడ్లు మంజూరు చేయగా, 101పూర్తి చేయడం జరిగిందని,అంగన్‌వాడీల వద్ద 22 మంజూరు చేయడం జరిగిందని,వసతి గృహాలు తదితర ఇతర ప్రదేశాల్లో 17మంజూరు చేయడం జరిగిందన్నారు.గ్రామస్థాయిలో 171నీరు మరియు పారిశుద్ధ్య కమిటీలు ఏర్పాటు చేశామని,171గ్రామాలను ఓడిఎఫ్ గ్రామాలుగా గతంలో ప్రకటించామన్నారు.గుంటూరు జిల్లాకు మరియు బాపట్ల జిల్లాలో కొంత భాగానికి ప్రకాశం బ్యారేజి,నాగార్జున సాగర్ డ్యామ్ నుండి ఉపరితల నీటి సరఫరాతో తాగునీటిని కల్పించేందుకు వాటర్ గ్రిడ్ ప్రతిపాదనలను రూ.7496కోట్లతో తయారుచేసి సమర్పించాలని వివరించారు.సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి వి.జ్యోతిబసు ,జిల్లా పంచాయితీ అధికారి బి.వి.నాగసాయికుమార్,ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.ప్రసూన,వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అయితా నాగేశ్వరరావు,జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శంకర్,జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన కమీషనర్

గుంటూరు నగరపాలకసంస్థ,నవంబర్ 3,ప్రభాతవార్త : గుంటూరు నగరంలో రోడ్లు,డ్రైన్ల నిర్మాణాలు నిర్ధేశిత గడువుమేరకు,నాణ్యతా ప్రమాణాలతో జరిగేలా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమీషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు.సోమవారం కమీషనర్ ఏటి అగ్రహారం మెయిన్‌రోడ్డు,నగరంపాలెం,కుందులరోడ్డు,బృందావన్ గార్డెన్స్ ,కృష్ణనగర్,గుజ్జనగుండ్ల,ఎస్వీఎన్ కాలనీ



ప్రాంతాల్లో రోడ్డు,డ్రైన్ల నిర్మాణ పనులను,రోడ్ల ఆక్రమణలను పరిశీలించి,సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ప్రారంభించిన పనులు అసంపూర్తిగా ఉంటే ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు.ఎస్వీఎన్ కాలనీ మెయిన్ రోడ్డులో రోడ్డు,డ్రైన్లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు.ఇస్కాన్ గుడి ప్రాంతాల్లో ప్రజల నుండి అందిన ఫిర్యాదుల మేరకు పర్యటించి,ఇళ్ళ మధ్యలో ఉన్న ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలని,వర్షంనీరు నిలిచిన ప్రాంతాల్లో బెయిల్ అవుట్ చేయాలని ప్రజారోగ్య,ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.పర్యటనలో పట్టణ ప్రణాళిక,ఇంజనీరింగ్,ప్రజారోగ్య అధికారులు,సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రదోషకాలంలో నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

పెదనందిపాడు నవంబర్ 3 (ప్రభాతవార్త) పెదనందిపాడు శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి దేవాలయంలో. కార్తీక సోమవారం సందర్భంగా ప్రదోషకాలంలో స్వామివారికి నందీశ్వరులకు రుద్ర. నమక. చమక. పంచామృత .పండ్ల రసాల తో అభిషేకాలు. సప్త హారతుల కార్యక్రమాన్ని అర్చక స్వాములు వడ్లమూడి చంద్రశేఖర శర్మ. సముద్రాల దత్తాత్రేయ శర్మలు కన్నుల పండగ



నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సెక్రెటరీ తడవర్తి సురేష్ బాబు. పారిశ్రామికవేత్తలు ముద్దన రాఘవయ్య. డి ఎల్ ఎస్ ప్రసాదు. దాసరి సత్యనారాయణ. నున్న ఆంజనేయ గుప్తా. రాయపూడి అర్జునరావు లు భక్తులకు వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భజన సంఘాలు వారు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వార్లకు స్వయంగా పూజలు నిర్వహించారు.

## కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న వినుకొండ మున్సిపల్ కమీషనర్




వినుకొండ,నవంబర్3,ప్రభాతవార్త: వినుకొండ మున్సిపల్ కమీషనర్ సుభాష్‌చంద్రబోస్ ఇటీవల మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సమర్ధవంతంగా సహాయ చర్యలు చేపట్టి ఉత్తమ సేవలు అందించినందుకుగాను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. తుఫాను సమయంలో ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించి పునరావాసం కల్పించడంలో చురుగ్గా వ్యవహరించారని అభినందించారు.

# గుంటూరు వార్త



## నానో టెక్నాలజీ ఫలితాలు విడుదల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,నవంబర్3, ప్రభాతవార్త: వర్సిటీలోని నానో టెక్నాలజీ కోర్సు ఆగస్టులో జరిగిన 5/5 రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సిఇ ఆలపాటి శివప్రసాదరావు సోమవారం విడుదల చేశారు. 25మంది పరీక్షలు రాయగా వారిలో 20మంది ఉత్తీర్ణత సాధించారు.

**పీజీ కోర్సుల రెండవ సెమిస్టర్ రీవాల్యూయేషన్ ఫలితాలు**

వర్సిటీ పరిధిలో జనవరిలో జరిగిన పీజీ కోర్సుల రీవాల్యూయేషన్ ఫలితాలను సిఇ శివప్రసాదరావు విడుదల చేశారు. ఎంఏ ఆర్కియాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్. ఎంబిఏ మీడియా మేనేజ్‌మెంట్, ఎంబిఏ టిటియం, ఎంబిఏ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుల రెండవ సెమిస్టర్, ఎంయస్సీ ఫుడ్ సైన్స్ కోర్సు మొదటి సెమిస్టర్ రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేశారు.

**బిపిఇడి, యంపిఇడి పరీక్షల షెడ్యూల్**

వర్సిటీ పరిధిలో బిపిఇడి, యంపిఇడి, డిపిఇడి కోర్సుల 3వ సెమిస్టర్ రెగ్యులర్/సప్లమెంటరీ పరీక్షల షెడ్యూల్‌ను సిఇ ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు. విద్యార్థులు ఈనెల 21లోగా ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. డిసెంబరు1 నుంచి పరీక్షలు జరుగుతాయని వివరించారు.

# కర్లపాలెంలో ఘోర రోడ్డు ప్రమాదం

### బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు బంధువులు నలుగురు మృతి చిన్నారులకు తీవ్ర గాయాలు

కర్లపాలెం,నవంబర్3,ప్రభాతవార్త: బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం సత్యవతి పేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు ఇరువురి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.నరసాపూర్ నుంచి బాపట్ల వైపు వస్తున్న లారీని బాపట్ల నుంచి కర్లపాలెం వస్తున్న కార్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం నలుగురు వ్యక్తులు చనిపోగా ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. కర్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శాసన సభ్యుని కుమారిని పెళ్ళి సందర్భంగా నిర్వహించిన వేడుకల కార్యక్రమానికి హాజరై తిరిగి వెళుతూ ఉండగా సత్యవతి పేట వద్ద కారు ప్రమాదానికి గురైంది.ఈ ప్రమాదంలో కర్లపాలెం కు చెందిన బేతాళం బలరామరాజు(65),ఆయన భార్య బేతాళం లక్ష్మీ(60), బలరామరాజు వీపరాలు గాదిరాజు పుష్పవతి(60). ముదుచారి శ్రీనివాసరాజు (54) అక్కడికక్కడే మృతి చెందారు వీరితో పాటు కారులో ఉన్న గాదిరాజు వైష్ణవి (11) చీరాల ఐకాన్ హాస్పిటల్ లో, గాదిరాజు జయంత్ వర్మ (13) గుంటూరు రమేష్ హాస్పటల్లో చికిత్స పొందుతున్నారు. . వీరు ప్రాణాపాయం నుంచి బయటపడి ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన వెంటనే కర్లపాలెం ఎస్సై రవీంద్ర సిఐ శ్రీహరి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరి క్షతగాత్రులను వెంటనే వైద్యశాలకు తరలించారు .అనంతరం నాలుగు మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. రెండు వాహనాలు కూడా అతివేగంగా రావటంతోనే ఈ ప్రమాదం









జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

**216జాతీయ రహదారి డిజైన్‌లో పలు లోపాలు..**

సహజంగా కోస్తా ప్రాంతాల్లో నిర్మించిన 216 జాతీయ రహదారి డిజైన్లు అనేక లోపాలు ఉన్నట్లు ప్రజలు ఆరోపణ చేస్తున్నారు ముఖ్యంగా ఎటువంటి సర్వీసు రోడ్డు లేకుండా ఈ జాతీయ రహదారిని నిర్మించడం వలన అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని నిపుణులు ఆరోపిస్తున్నారు ముఖ్యంగా కర్లపాలెం మండల ప్రాంతంలోని గత 20 రోజుల్లో కేవలం రోడ్డు ప్రమాదంలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు సత్యవతి పేట వద్ద నుంచి రెడ్డిపాలెం వరకు జరిగినటువంటి ప్రమాదాలకు వేగ నియంత్రణ బోర్డు లేకపోవడం అంతే కాకుండా ఈ ప్రమాదాలకు కారణమని తెలుస్తుంది గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ రహదారి మీదకు రావడానికి ఎక్కడా కూడా సూచిక బోర్డులు వేగనియంత్రణ బోర్డులు ఒక్కటి కూడా లేవు పైగా ప్రజలకు కూడా రహదారి నిబంధనలపై అవగాహన లేకపోవడం కూడా ప్రధాన కారణం దీనికి తోడు జాతీయ రహదారి డిజైన్ లో కూడా పలు లోపాలు ఉండటంతో ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగి అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాల నివారణకు జాతీయ రహదారి వారు పోలీసులు కలిసి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆర్.వి.ఆర్ జె.సి ఇన్నోవేషన్ సెంటర్లో "ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఇన్నోవేషన్ పై వర్క్‌షాప్

గుంటూరు విద్య ప్రభాతవార్త ఫార్మసీ మరియు కెమికల్ రంగాల్లో విద్యార్థులు సమాజ శ్రేయస్సుకు దోహదపడే నూతన ఆవిష్కరణలలు జరిపి దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు. స్థానిక చౌడవరం లోని ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో ళిజుళిరిదిదిని–ళీగిశి ఫౌండేషన్ (గితీ) ఆధ్వర్యంలో "ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఇన్నోవేషన్" పై జరిగిన వర్క్‌షాప్ కార్యక్రమంలో కళాశాల కెమికల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులతో పాటు పలు ఫార్మసీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో నిపుణులు బయోమెడికల్, అగ్రిటెక్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (్ళగి) వంటి రంగాల్లో సమస్యల పరిష్కారం (శ్భ్ళు ళీ్ళు) మరియు ఆవిష్కరణల ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు విద్యతో పాటూ వారిలోని ఆలోచనా శక్తిని స్టార్టప్‌లు మరియు ఆవిష్కరణల దిశగా మలచుకోవాలని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ ఫార్మసీ మరియు కెమికల్ విద్యార్థులు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడే ఉత్పత్తులు, సేవలను సృష్టించే దిశగా అడుగులు వేయాలని, నూతన స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు కళాశాల ళిరి నివినిళీగి ద్వారా ఆర్థిక మరియు సాంకేతిక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ అండ్ ఆర్ డి డైరెక్టర్ డా.కె.రవీంద్ర, ।గితీ। ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డా. ఎమ్.వి.పి. చంద్రశేఖర్ రావు, సి ఈ ఓ డా.ఆర్.హఫీజ్ బాషా, మేనేజర్ డా.శోభా, సిమ్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.ప్రశాంతి ఎవాంజెలిన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెదనందిపాడు లోతుఫాన్ బాధితులకు ప్రభుత్వ సహాయం

ఎదనందిపాడు నవంబర్ 3 (ప్రభాతవార్త) పెనందిపాడు నల్లమడ వాగు కట్టాపై నివసిస్తున్న వారితో పాటు మరికొందరు వరద బాధితులకు 41 కుటుంబాల వారికి ప్రభుత్వ సహాయం కింద 1.8 లక్షల



నగదు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు టిడిపి నాయకులు గతంలో మాదిరిగా కాకుండా ప్రభుత్వ సహాయాన్ని వెంటనే అందజేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో. మండల రెవెన్యూ అధికారి అబిద్ అలీ. వీఆర్వో అనిల్. టిడిపి నాయకులు రావి శివరామకృష్ణయ్య. దివి నాగరాజు,నూతి శ్రీనివాసరావు, ముప్వనవీన్, శంకర్, దిలీప్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళాశాలలో నీరు బయట పంపించాలని కోరుతూ వినతి



పెదనందిపాడు నవంబర్ 3 (ప్రభాతవార్త) పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తరచూ చిన్నపాటి వర్షానికే కళాశాల క్రీడా మైదానంలో నీరు నిలుస్తూ ఉండటంతో కళాశాల విద్యార్థులకు అధ్యాపకులకు ఇబ్బందికరంగా మారింది. క్రీడా మైదానంలో మోకాలు పైగా నీళ్లు నిలువుంటున్నయని. కళాశాల ప్రాంగణం నుంచి గుంటూరు ఆర్ అండ్ బి రోడ్డు వరకు కాలువ పూడికలు తీయించి అధ్యాపకులకు, విద్యార్థులకు కలుగుచున్న ఇబ్బందులు తొలిగించవలసినదిగా కోరుతూ సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీరరాఘవయ్య. ఫిజికల్ డైరెక్టర్ పాతూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల సిబ్బంది పెదనందిపాడు తహసీల్దార్ హేనాప్రియకు వినతి పత్రం అందజేశారు. ఈ సమస్యపై స్పందించిన తహసిల్దార్ వెంటనే ఎంపీడీవో స్వామి రెడ్డిని పిలిపించి విషయం వారి దృష్టికి తీసుకెళ్లి కళాశాలలో నిలువ ఉన్న నీటి సమస్యను వెంటనే పరిష్కరించవలసిందిగా ఆదేశించారు.

## అలరించిన అన్నమాచార్య సంకీర్తనామృతం

గుంటూరు కల్చరల్,నవంబర్ 3,ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం సూరపనేని శ్రీకాంత్ ఎండోమెంట్ కార్యక్రమం జరిగింది.తొలుత ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు లంకా విజయబాబు,భజన బృందం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాని ్న ప్రారంభించారు.శ్రీవత్స భజనమండలి తెనాలి,కొండపి వసుంధర బృందంచే అన్నమాచార్య సంకీర్తనల గానం శ్రావ్యంగా సాగింది.వీరికి కీబోర్డుపై రామకృష్ణ,తబలపై వెంకటరమణ చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు.ఆలయ కమిటీ సభ్యులు సూరపనేని శ్రీరామచంద్రమూర్తి,జయలక్ష్మి నిర్వహణలో భజన బృందం వారిని ఘనంగా సత్కరించారు.

## మహా రుద్రాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు వెస్ట్, నవంబర్ 3,ప్రభాతవార్త: గుంటూరు నగరంలోని విద్యానగర్ 1/3వ లైన్ లోని కమలేష్ ఎస్టేట్స్ అపార్ట్మెంట్ నందు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించిన రుద్రాభిషేకం కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజల సుఖశాంతులు, రాష్ట్ర ప్రగతి, ప్రపంచ శాంతి కోసం భగవంతుడిని ప్రార్థించారు.ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనాలి. ఈ రుద్రాభిషేకాలు సమాజానికి శాంతి, సౌఖ్యాన్ని ప్రసాదిస్తాయి. మన సమాజంలో సానుకూల ఆలోచనలు, సామరస్యం పెంపొందించడంలో ఇలాంటి పూజలు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రజల సంక్షేమం కోసం మనం చేసే ప్రతి పూజ, ప్రార్థన ఒక శక్తిగా పనిచేస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

## ఘనంగా కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు



నూజెండ్ల,నవంబర్3,ప్రభాతవార్త: కార్తీక సోమవారం పురస్కరించుకొని మండలంలోని రవ్వారం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు వేకువజాము నుంచే ఆలయానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వర్ణ శ్రీనివాస్ స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

## రాష్ట్రంలో రాక్షస పాలన : మాజీ ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ,నవంబర్3,ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి నాయకుల అరాచకాలు రాక్షస పాలన కొనసాగుతోందని వినుకొండ వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. సోమవారం పట్టణంలోని వైకాపా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో బొల్లా మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలో ప్రజలు శుభకార్యాలు కూడా జరుపుకునే పరిస్థితులు లేకుండా కూటమి నాయకులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పట్టణంలో ఇటీవల ముస్లిం మైనార్టీ



వివాహ వేడుక సందర ్భంగా జగన్ పాటలు వేసినందుకు 11 మంది వైకాపా కార్యకర్తలపై అన్యాయంగా కేసులు పెట్టారని ఇది అప్రజాస్వామికమన్నారు. ఎమ్మెలే ్య జీ.వీ ఆంజనేయులు అండతోనే కూటమి నాయకులు రెచ్చిపోతున్నారని అధికారం శాశ్వితం కాదని హెచ్చరించారు. సమావేశంలో వైకాపా నాయకులు ఎం.ఎన్ ప్రసాద్,పిఎస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## యంగ్‌స్టార్స్‌హెల్పింగ్‌హార్ట్స్‌ఫౌండేషన్‌కు సేవారత్న పురస్కారం

వినుకొండ,నవంబర్3,ప్రభాతవార్త: వినుకొండకు చెందిన యంగ్‌స్టార్స్ హెల్పింగ్‌హార్ట్స్ ఫౌండేషన్ చేస్తున ్న సేవా కార్యక్రమాలు గుర్తించి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం



నాంపల్లి,హైదరాబాద్ విశ్వజనని ఫౌండేషన్ వారు విశ్వజనని సేవారత్న పురస్కారం అందజేశారు. విశ్వజనని ఫౌండేషన్ ఛైర్మన్ బొగ్గవరపు బ్రహ్మానందం,సినీనటుడు పృథ్వీరాజ్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని యంగ్‌స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పమిడిపల్లి అనిల్‌రాజ్,ఉపాధ్యక్షులు గుమ్మడి మనోహర్‌బాబుకి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని సహాయ,సహకారాలు అందజేస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞ తలు తెలిపారు.

## భారత క్రికెట్ మహిళా జట్టుకు శుభాకాంక్షలు తెలిపిన న్యాయవాది



సత్తెనపల్లి, నవంబర్ 3 ప్రభాతవార్త : భారత క్రికెట్ మహిళా జట్టుకు లోక్ జనశక్తిపార్టీ జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్‌కుమార్ సోమవారం శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మహిళలు క్రీడల్లో అద్భుతంగా రాణిస్తున్నారని తెలిపారు. ప్రపంచ కప్‌ను గెలవడం దేశానికి గర్వకారణం అన్నారు. ఇటువంటి అద్భుతమైన టీంకు తగిన ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. క్రమశిక్షణ, సమిష్టి కృషి ఉంటే ఏ విజయమైనా సొంతమవుతుందని మహిళా క్రికెట్ జట్టు నిరూపించిందని జొన్నలగడ్డ విజయ్‌కుమార్ తెలియజేశారు.

## ృవిద్యార్థుల సంఖ్యపై..పాఠశాల గుర్తింపుపై అర్‌జెడి విచారణ

యడ్లపాడు, నవంబర్ 3, ప్రభాతవార్త : విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(అర్‌జెడి) సోమవారం యడ్లపాడులోని లూథరన్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. గతంలో ఈ పాఠశాల మూసివేతకు ఉత్తర్వులు జారీ అయినప్పటికీ, రికార్డులు పూర్తిస్థాయిలో విద్యాశాఖకు అప్పగించకపోవడం, తిరిగి విద్యార్థులు ఉన్నారనే సమాచార నేపథ్యంలో విద్యాసంస్థ నిర్వహణపై క్షేత్రస్థాయి విచారణకు వచ్చినట్లు అర్‌జెడీ విలేకర్లకు వెల్లడించారు. యడ్లపాడు ఎంఈవో ఎంవీ నాగరత్నంతో కలిసి విచారణకు వచ్చిన అయన విలేకర్లకు అయా వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం



పాఠశాలలో కేవలం నలుగురు విద్యార్థులు ఉండగా, అరుగురు ఉపాధ్యాయులు ఉన్నట్లు గుర్తించామన్నారు. జోన్లవారీగా సర్‌ప్లస్‌గా ఉన్న ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారో మొదటిగా గుర్తిస్తున్నాము అని తెలిపారు. నిబంధనల ప్రకారం ఈ అదనపు ఉపాధ్యాయులను లూథరన్ సంస్థ పరిధిలోని ఇతర పాఠశాలల్లోనే సర్దుబాటు చేయాల్సి ఉందని, అయితే అదిశగా యాజమాన్యం చర్యలు తీసుకోలేదని అర్‌జెడీ అరోపించారు. దీంతో తాను స్వయంగా పరిశీలించి సర్దుబాటు విషయాన్ని అచరణలోకి తీసుకువచ్చేందుకు చూస్తామని తెలిపారు. గతంలో పాఠశాల మూసివేతకు గల కారణాలను అర్‌జెడీ విశ్లేషించారు. గత మూడేళ్ల నుంచి హైస్కూల్ విద్యార్థుల సంఖ్య క్రమేణ తగ్గుతూ వచ్చిందని, చివరకు జీరో హాజరు అని తెలియడంతో పాఠశాల మూసివేతకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని గుర్తుచేశారు. అయితే పాఠశాల మూసివేతకు సంబంధించిన రికార్డులను జిల్లా విద్యాశాఖ అధికారికి అప్పగించాలని గతంలో ఉత్తర్వులు ఇచ్చినా అవి ఇంకా పూర్తిస్థాయిలో అప్పగించలేదన్నారు. ప్రస్తుతం మళ్లీ విద్యార్థులు ఉన్నారంటూ తెలియడంతో స్వయంగా పరిశీలించి నివేదికలు కమీషనర్‌కు పంపటం జరుగుతుందన్నారు. దాదాపు ఐదు నెలలుగా అ అరుగురు ఉపాధ్యాయులు ఖాళీగా ఉన్న మాట వాస్తవమే అని అయన ధ్రువీకరించారు. పిల్లలు ఉన్నారా, వారికి సరిపడా స్టాఫ్ ఉన్నారా అదనంగా ఉంటే వారి పరిస్థితి ఏంటి వారిని ఎక్కడకు బదలాయించాలనే ఉద్దేశంతోనే తాము పరిశీలిస్తున్నామని తెలిపారు. అలాగే ప్రస్తుతం ఉన్న నలుగురు పిల్లలు ఎక్కడ నుంచి వస్తున్నారు, ఎప్పుడు వచ్చారనే విషయాలను అరా తీయడం జరుగుతుందన్నారు. పూర్తిస్థాయిలో నివేదికలు తయారుచేసి కమీషనర్‌కు పంపటం జరుగుతుందని, తదుపరి వారి నిర్ణయాల అధారంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

## విద్యార్థులకు మెరుగైన విద్య, పోషకాహారం అందించాలి : విద్యాశాఖ అర్‌జెడీ

యడ్లపాడు, నవంబర్ 3, ప్రభాతవార్త : యడ్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను విద్యాశాఖ సంయుక్త సంచాలకులు సోమవారం అకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా



అయన మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, హైస్కూల్ ప్లస్ 2 విద్యాబోధన, ప్రగతి అంశాలపై పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం, మెరుగైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు, సిబ్బందికి సూచించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకం అమలులో ఇంకా మెరుగుదల అవసరమని పేర్కొన్నారు. భోజనం నాణ్యతను మరింత పెంచాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వం ఈ పథకం ఎందుకు అమలు చేస్తుందో దాని లక్ష్యాలు ఏమిటో సంబంధిత సిబ్బంది అర్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. పథకం లక్ష్యాలు మెనూ వివరాలను బయట అందరికీ తెలిసేలా ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేయవాలని అదేశించారు. భోజనం లేదా కూరల తయారీలో ఏ వస్తువుల్ని ఎంతెంత మొత్తంలో వేస్తే విద్యార్థులకు మంచి పోషకాలు లభిస్తాయో అవి వివరాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం వివరించారు. ఇంటర్ చదివే విద్యార్థినులకు బోధన నాణ్యత, ప్రగతి అంశాలపై సమీక్ష నిర్వహించారు. గ్రేడ్‌లకు తగ్గ బోధన ప్రణాళికలు ఎలా ఉన్నాయనే విషయంపై అరా తీశారు. సీ, డి గ్రేడ్ విద్యార్థుల్ని మరింత మెరుగు పరిచే దిశగా రోజు మార్చి రోజు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో అకస్మిక తనిఖీలు కొనసాగుతాయని అర్‌జెడీ తెలిపారు. విద్యాశాఖ కమీషనర్ రూపొందించిన పదోతరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక విధానాన్ని క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేసేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని అయన తెలిపారు.

## ప్రశ్నార్ధకంగా మారిన పాఠశాల నిర్వహణ

యడ్లపాడు, నవంబర్ 3, ప్రభాతవార్త : యడ్లపాడు గ్రామంలోని లూథరన్ ఉన్నత పాఠశాల పూర్వ చరిత్ర ఈ విధంగా ఉంది. 1952వ సంవత్సరంలో పాఠశాలకు గ్రామానికి చెందిన పోపూరి వెంకటసుబ్బారావు 333వ సర్వే నంబరులో



0.88సెంట్లు ఇవ్వగా అప్పుడు గ్రామ కమిటీ తీర్మానం చేసి పాఠశాల భవనాలను నిర్మించిందని, తదుపరి నిర్వహణ బారంగా కావటంతో పాఠశాలను గుంటూరుకు చెందిన ఎఇఎల్‌సి సంస్థకు నిర్వహణ బాధ్యతలు మాత్రమే ఇచ్చిందని, అప్పటి నుండి వారు నిర్వహించుతూ కాలక్రమేణా అశ్రద్ద చేస్తూ ఇటు ఉపాధ్యాయులు లేకుండా నిర్మాణాలకు మరమత్తులు లేకుండా కాలంగడపటం వలన పాఠశాల అభివృద్ధి కమిటీ భవనం పై కప్పులు, ప్రహరీ గోడ నిర్మాణాలు చేపట్టిందని, కాలక్రమేణా విద్యార్థుల లేక నేడు జీరోలో ఉందని, నాడు పాఠశాల నిర్వహణకు గ్రామస్థులు నూతలపాటి వంశీకులు ప్రకాశం జిల్లాలో 12.75ఎకరాల భూమిని వచ్చే కొంత భాగం మాత్రమే అనుభవించమని ఇవ్వటం జరిగింది. అయినా దానిని సరీగా సంస్థనిర్వహించలేక పోవటంతో అదీ అక్రమణకు గురవ్వటంతో కమిటీ జోక్యంచేసుకొని పొలంకు సంబంధించి కొంత నగదు చెల్లించి మరలా కమిటీ పేరున బదలాయింపు చేసామన్నారు. అనాది నుండి అదాయాన్ని అనుభవించటమేగాని, పాఠశాల అభివృద్ధికి ఒక్కపైసా ఖర్చుచేయలేదని వాపోయారు. అయితే క్రమేణా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నా ఉపాధాయుల సంఖ్య తగ్గించకుండా ఇటు యాజమాన్యం, అధికారులు చోద్యం చూడటం వారికి సరిఅయిన పనిలేకపోయినా నెల జీతబత్యాలు చేతికందటంతో వారు నిమ్మకు నీరెత్తిన విధంగా ఉన్నారు. ప్రభుత్వం నుండి జీతాలు తీసుకొనే వారు పనులు సక్రమంగా చేస్తున్నారా లేదాఅనే విషయం మాత్రం విద్యా శాఖ అధికారులు విస్మరించారన్నది వాస్తవం. పాఠశాలలు పున:ప్రారంభమై అయిదు మాసాలు గడుస్తున్నాయి. అయితే గత రెండు మాసాల క్రితం జిల్లా విద్యా శాఖ నుండి ఉత్తర్వులు పాఠశాలకు చేరాయి. పాఠశాలలో విద్యార్థులు లేరు, పాఠశాల గుర్తింపు లేదు కాబట్టి పాఠశాలలో ఉన్న రికార్డులు జిల్లా విద్యా శాఖ అధికారులకు అప్పగించాలని కోరటం జరిగింది. దానిపై పాఠశాల యాజమాన్యం తాత్సారం చేస్తూ వచ్చి చివరికి మరలా మా పాఠశాలలో విద్యార్థులు 21మంది ఉన్నారు కాబట్టి పాఠశాల అనుమతులు మంజూరు చేయాలని కోరటం జరిగింది. దీనిపై అర్‌జెడీ విచారణకు వచ్చిన సమయంలో మాత్రం పాఠశాలలో ఉన్నది నలుగురు విద్యార్థులు మాత్రమే. ఉపాధ్యాయులు మాత్రం అరుగురు ఉన్నారని నిర్ధారణ అయింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం విధ్యార్థుల శాతాన్ని బట్టి ఉపాధ్యాయులు ఉండాలి. మరి ఇక్కడ విద్యార్థుల కన్నా అధికంగా ఉన్నా వారిని ఎవరూ పట్టించుకోకుండా నెల వారీ జీతబత్యాలు ఇస్తున్నారంటే అర్ధమవుతుంది విద్యా శాఖ పనితీరు ఏవిధంగా ఉందో నన్న విషయం అశ్చార్యాన్ని కలిగిస్తుంది. మరి అనుమతులు లేని పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్ ఏమిటని ఇటు సంస్థ నిర్వాహకులు అలోచించారా అంటే అదీనూ ప్రశ్నార్ధకంగానే మిగులు తుంది. ఎందుకంటే పాఠశాల ప్రారంభమైన మూడు మాసాల తదుపరి వీరి పాఠశాలలో ఎక్కడి నుండి వచ్చి విద్యార్థులు చేరన్నదే ప్రశ్న. వీరికి ప్రభుత్వం నుండి వచ్చే అన్ని రకాల సదుపాయాలు అందుతాయా అంటే అదీనూ ప్రశ్నార్ధకమే. ఎందుకంటే పాఠశాలకు ఇప్పటి వరకు గుర్తింపు లేకపోవటంవల్ల వీరి జీవితాలు గాలిలో దీపంలా ఉన్నదన్నది వాస్తవం. ఒక వేళ అనుమతులు ఈ ఏడాది రాకపోతే వీరి పరిస్థితి ఏమిటన్నదే ప్రధాన సమస్య. ఇంత జరుగుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించవల్సిన విద్యాశాఖ తప్పిదాల వల్ల ఇంతజరుగుతుందన్నదే స్థానికుల అనుమానం.

**..విచారణ చేసి నివేదికలు పంపుతాం :** అర్‌జెడీ లింగేశ్వరరెడ్డి : లూథరన్ ఉన్నత పాఠశాలను పరిశీలించటం కొరకు రావటం జరిగిందని, గతంలో విద్యార్థుల సంఖ్య లేదని, కావున పాఠశాలలో ఉన్న రికార్డులు అప్పగించాలని ఉత్తర్వులు ఇవ్వటం జరిఇందని, మరలా విద్యార్థులు ఉన్నారు గుర్తింపు ఇవ్వండని కోరటంతో పరిశీలనకు వచ్చామని, ఇక్కడి పరిస్థితులపై పూర్తి స్థాయిలో నివేదికలు తయారుచేసి విద్యాశాఖ కమీషనర్‌కు పంపటం జరుగుతుందని, తదుపరి చర్యలు వారి అదేశాలకనుగుణంగా ఉంటాయని తెలిపారు.

## విఅర్‌వోకు అందిన ప్రశంశా పత్రం




యడ్లపాడు, నవంబర్ 3, ప్రభాతవార్త : మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతములలో ఉత్తమ సేవలందించి నందుకుగాను మండల తహశీల్దార్ కార్యాలయంలోని తిమ్మాపురం విఅర్‌వోగా విధులు నిర్వహించుతున్న జగన్ మోహనరావుకు ఉత్తవ సేవా పురస్కారాన్ని కలెక్టర్ కృతికా శుక్ల అందజేసారు. ఈ సందర్భంగా అయనను సహచర విఅర్‌వోలు, తహశీల్దార్ విజయశ్రీ, డిటి అనురాధ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## ఎస్ ఆర్ ఎమ్ లో ఐఈటీఈ వ్యవస్థాపక వేడుకలు..

మంగళగిరి, నవంబర్ 3, ప్రభాతవార్త : ఏపీ ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీలో సోమవారం సాయంత్రం ది ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి కమ్యూనికేషన్స్ ఇంజనీర్స్( ఐఈ టీఈ )విజయవాడ సెంటర్ 72వ వ్యవస్థాపక దిన వేడుకలు ప్రారంభమయ్యాయి. ఐఈటీఈ విజయవాడ కేంద్రం చైర్మన్ డాక్టర్ బి సూర్యప్రసాదరావు, కార్యదర్శి డాక్టర్ షేక్ రియాజుద్దీన్ లు వేడుకలకు హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన ఐఈటీ ఈ జాతి నిర్మాణంలో విశేషమైన సేవలు అందిస్తోందన్నారు. కృష్ణ గుంటూరు, ప్రకాశం, ఖమ్మం జిల్లాల పరిధిలోని 4,000 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఐ ఈ టి ఈ సేవలను అందుకుంటున్నారని వివరించారు ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాల్లో అపారమైన అనుభవం ఉన్న




మేధావుల గైడెన్స్ ను విద్యార్థులకు చేరవేయడంలో ఐ ఈ టి ఈ ఎంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సిహెచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, ఎంతో చరిత్ర కలిగిన ఐఈటిఈ తో కలిసి పరస్పర భాగస్వామ్య పద్ధతిలో యూనివర్సిటీ పనిచేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఈసీఈ విద్యార్థులు స్వయంగా రూపొందించిన ఎక్స్ ట్రానిక్స్ టెక్నాలజీ క్లబ్ ను వైస్ ఛాన్స్ లర్ డాక్టర్ సతీష్ ప్రారంభించగా, యూనివర్సిటీ డీన్ డాక్టర్ సి వి టామీ లోగోను ఆవిష్కరించారు. సర్క్యూట్ మేకింగ్, వర్క్ షాప్స్




హ్యాకతాన్స్ నిర్వహణ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కార్యక్రమాలను క్లబ్ ద్వారా నిర్వహించనున్నామని ఈసీఈ విభాగం అధిపతి డాక్టర్ కె ఏ సునీత పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐ ఈ టీ ఈ సీనియర్ సభ్యులైన డాక్టర్ పి కాళీ ప్రసాద్, డాక్టర్ ఎం వేణుగోపాల్ రావులను ఐఇటిఈ చైర్మన్ సూర్య ప్రసాదరావు, వీసీ సతీష్ కుమార్ లు ఘనంగా సత్కరించి జ్ఞాపికలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఈసీఈ విభాగం అధిపతి డాక్టర్ సునీత, డాక్టర్ సుజిత్ కల్లూరి, ఐ ఈ టి ఈ ఉమెన్ వింగ్ కార్యదర్శి డాక్టర్ గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిరోజు తనిఖీ చేస్తాం: నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం

పిట్టలవానిపాలెం,నవంబర్ 3,ప్రభాతవార్త: వాహన దారులు నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎంతో కీలకంగా ఉంటుందని చందోలు ఎస్సై శివ కుమార్ తెలిపారు. రేపల్లె బాపట్ల జాతీయ రహదారిలోని రెడ్డిపాలెం టోల్ ప్లాజా వద్ద సోమవారం వాహనాలు తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ . ఆటో డ్రైవర్లకు,బస్సు డ్రైవర్లకు, లారీ డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించామన్నారు.. ఆటోలలో ప్రయాణికులను నిబంధనల ప్రకారం తరలించాలని అధికారుల నిబంధనలు అతిక్రమించి అధికంగా ప్రయాణికులు ఎక్కించి ప్రమాదాలకు గురైతే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, నవంబర్ 3 ప్రభాతవార్త : పట్టణంలోని షణ్ముఖ రాయల్ గేటెడ్ కమ్యూనిటీ నందు సోమవారం నిర్వహించిన సత్యనారాయణస్వామి వ్రతంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. నాగ వెంకట సుమన్ నూతన గృహంలోకి ప్రవేశించిన సందర్భంగా వారి



కుటుంబసభ్యులకు శుభాకాంక్షలను తెలియజేశారు. ఎమ్మెల్యే కన్నా వెంట నియోజకవర్గ, మండల, గ్రామ నాయకులు ఉన్నారు.

## కార్తీక మాస ప్రత్యేక పూజలు

సత్తెనపల్లి, నవంబర్ 3 ప్రభాతవార్త : కార్తీకమాసం రెండవ సోమవారం దేవాలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. అచ్చంపేట రోడ్డులో ఉన్న దుర్గా అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు దీపోత్సవాన్ని నిర్వహించారు. పండ్లు, తమలపాకులు, పూలతో ప్రమిదలు వెలిగించి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు చదలవాడ సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ కార్తీకమాసంలో వెలిగించే దీపం భగవంతుని రూపం, జ్యోతి స్వరూపం, దీపం అనునది సనాతన ధర్మంలో చాలా ప్రాముఖ్యత కలిగిందన్నారు. పరమేశ్వరుని కరుణతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## ఉత్తమ సేవలకు ఆర్.ఐ. బోసుబాబుకు ప్రశంసాపత్రం

సత్తెనపల్లి, నవంబర్ 3 ప్రభాతవార్త : మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో ఉత్తమ సేవలు అందించిన మండల రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ బోసుబాబుకు సోమవారం జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ బి.కృష్ణారావులు ప్రశంసాపత్రం అందజేశారు. తుఫాన్ వచ్చిన సందర్భంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి మంచి ప్రతిభను చూపారని తెలిపారు. వారు భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో విధులు నిర్వహించాలన్నారు. ప్రశంసాపత్రాన్ని అందుకున్న బోసుబాబును పలువురు అభినందించారు.

## వార్డు ముఖ్య నాయకులు, సచివాలయ అధికారులతో ఎమ్మెల్యే కన్నా సమీక్షా సమావేశం

సత్తెనపల్లి, నవంబర్ 3 ప్రభాతవార్త : పట్టణంలోని 8వ వార్డు నందు సోమవారం టిడిపి ముఖ్య నాయకులు, సచివాలయ అధికారులతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వార్డులోని ప్రజలు తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. నివేశన గృహాలకు సంబంధించి



తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వార్డులో ఏమైనా సమస్యలు ఉంటే వేగంగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలను ఎక్కడా ఇబ్బంది పెట్టవద్దని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రజలకు అవసరమైన ధృవీకరణ పత్రాలు మంజూరు విషయంలో అధికారులు పదేపదే వారిని తిప్పుకోవద్దన్నారు. అభివృద్ధి పథంలో వార్డును నిలపాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచించారు. ఈ సమావేశంలో వివిధ హోదాలలో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శివయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలి

బాపట్ల,నవంబర్3,ప్రభాతవార్త: పరమశివుడు ఆశీస్సులు అందరి పై ఉండాలని భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ శాసనమండలి సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. బాపట్ల పట్టణంలోని ఎస్ ఎన్ పి అగ్రహారంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతీ వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం శతాబ్ది ఉత్సవాలు సందర్భంగా అన్నం సతీష్ సోమవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి.స్వామి వారికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం కమిటీ సభ్యులు భక్తుల సహాయ సహకారాలతో



దేవస్థానం 100 సంవత్సరాల వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించడం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారన్నారు. స్వామివారి సేవలో తన వంతు సేవా అందించడానికి ఐదు రోజులపాటు జరిగే పూజా కార్యక్రమాలకు వచ్చే భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందని ఆ శివయ్య ఆశీస్సులతో సేవ చేసుకునే అదృష్టం కల్గిందన్నారు. ఈ ఐదు రోజులు పాటు జరిగే కార్యక్రమాలు ఎంతో విజయవంతం కావాలని భక్తులందరూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థప్రసాదాలు సేకరించాలని ఆయన కోరారు. ఈ పూజా కార్యక్రమాలకు పీఠాధిపతులు, వివిధ ప్రముఖులు హాజరవుతున్నారని ఎటువంటి సమస్యలు తలెత్తకుండా కమిటీ సభ్యులు పర్యవేక్షణ చేయాలన్నారు.పోలీసులు, ఫైర్,విద్యుత్ శాఖ అధికారుల సూచనలు పాటించాలని కమిటీ సభ్యులకు వివరించారు.

## తనిఖీ చేస్తాం నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం

పిట్టలవానిపాలెం,నవంబర్03,ప్రభాతవార్త: వాహన దారులు నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎంతో కీలకంగా ఉంటుందని చందోలు ఎస్సై శివ కుమార్ తెలిపారు. రేపల్లె బాపట్ల జాతీయ రహదారిలోని రెడ్డిపాలెం టోల్ ప్లాజా వద్ద సోమవారం వాహనాలు తనిఖీ



కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ . ఆటో డ్రైవర్లకు,బస్సు డ్రైవర్లకు, లారీ డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించామన్నారు.. ఆటోలలో ప్రయాణికులను నిబంధనల ప్రకారం తరలించాలని అధికారుల నిబంధనలు అతిక్రమించి అధికంగా ప్రయాణికులు ఎక్కించి ప్రమాదాలకు గురైతే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి

బాపట్ల,నవంబర్ 3,ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను శ్రద్ధతో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ భావన అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ భావన నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో బాధితులు కలెక్టర్ కార్యాలయానికి వస్తారన్నారు.. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. జిల్లాలో తుఫాను ప్రభావం వల్ల జరిగిన పంట నష్ట వివరాలను వెంటనే అందజేయాలని అధికారులకు సూచించారు. తుఫాను



ప్రభావంవల్ల నష్టపోయిన బాధితుల కు నగదు, బియ్యం పంపిణీపూర్తి చేయాలన్నారు. తుఫాను ప్రభావం వల్ల దెబ్బతిన్న కౌలు రైతులను ఆదుకోవాల ని రైతు సంఘాల ప్రతి నిధులు జాయింట్ కలెక్టర్ ని కలిసి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. కొల్లూరు మండలం అనంత గ్రామానికి చెందిన రైతులు విత్తనాల కంపెనీ వారి మాటలు నమ్మి నకిలీ విత్తనాలు వేశామని వరి పంట దిగుబడిని కోల్పోయా మని న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్ కు అర్జి ఇచ్చారు. ఈ విషయంపై జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారిని విచారణ చేపట్టి చర్యలు తీసుకో వాల్సిందిగా ఆదేశించారు. ఈనెల 1వ తేదీన భారీ వర్షాలను సైతం లెక్కచేయకుండా95 శాతం పెన్షన్లు పంపిణీ చేసిన బాపట్ల మున్సిపాలిటీ డ్రైవర్స్ కాలనీ సచివాలయ సిబ్బంది చిమట వెన్నెలను జాయింట్ కలెక్టర్ జ్ఞాపిక ఇచ్చి శాలువాతో సన్మా నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ లవన్న, ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధామాధవి, జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ ఏడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలను చట్ట పరిధిలో విచారించి పరిష్కరిస్తాం

బాపట్ల,నవంబర్ 3,ప్రభాతవార్త: అర్జీలను చట్ట పరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీ దారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీ గారికి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో విచారించి పరిష్కరించాలని జిల్లా పోలీస్ అధికారులను



ఆదేశించారు. అర్జీలు పదేపదే పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. మహిళలు, వృద్ధుల యొక్క ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీలను పరిష్కరించేందుకు తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీస్ కార్యాలయానికి పంపాలన్నారు. భూ వివాదాలు, ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన మోసాలు వంటి పలు సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 83 మంది అర్జీ దారులు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి విచ్చేసి తమ సమస్యలను విన్నవించుకున్నారని, వారి అర్జీలను చట్టపరిధిలో విచారించి పరిష్కరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ నాయక్ ,పిజిఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ యు.శ్రీనివాసరావు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తుఫాను వల్ల దెబ్బతిన్న కాలువలు పరిశీలించిన ఎన్నెస్పీ అధికారులు

నూజెండ్ల,నవంబర్3,ప్రభాతవార్త: మొంథా కారణంగా మండలంలోని ములకలూరు డీసీ పరిధిలో దెబ్బతిన్న,కోతకు గురైన కాలువలు,యుటిలను ఎన్నెస్పీ ఇఇ శ్రీనివాసరావు,డిఈ వెంకటనారాయణ,ఏఇఇ ప్రసన్నకుమార్,ములకలూరు డీసీ నక్కా బుల్లేశ్వర్‌రెడ్డిలు సోమవారం



పరిశీలించారు. దెబ్బతిన కాలువ కట్టలకు త్వరితగతిన మరమ్మత్తులు చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా నీటిని విడుదల చేయాలని డీసీ నక్కా బుల్లేశ్వర్‌రెడ్డి అధికారులను కోరారు.

## శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి సందర్భంగా అన్నదానం:

తెనాలి టౌన్ నవంబర్ 3 (ప్రభాతవార్త): జగద్గురువు,కాలజ్ఞాన తత్వవేత్త,శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి జయంతి సందర్భంగా, పట్టణంలోని గాంధీచౌక్ లో ఉన్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవస్థానం నందు,ఆలయ కార్యనిర్వహణాధికారి హరిప్రసాద్ పర్యవేక్షణలో, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు భక్తులు,శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తన కాలజ్ఞాన రచనతో సమాజాన్ని



మేలుకొలిపారని,అన్ని మతాలను అన్ని కులాలను సమానంగా ఆదరించి,మనిషి యొక్క జీవనచిత్రాన్ని ఆవిష్కరించారని,తన యొక్క మహిమతో దుర్మార్గులను సన్మార్గంలో నడిపారని,ఈ సందర్భంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కాలజ్ఞాన సూక్తులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో,ఆలయ అర్చకులు జంపని భాస్కర్ పలువురు ఆలయకమిటీ సభ్యులు,పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక : కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,నవంబరు 3,ప్రభాతవార్త ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో కూడ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర




పేర్కొన్నారు. నగరపాలకకు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గర లోని కార్యాలయంలో సంప్రదించవచ్చని, ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని,అధికారులందరూ జోనల్ కార్యాలయంతో పాటు ప్రధాన కార్యాలయంలో కూడ అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

## భోళాశంకరుని సేవలో తరించిన ఎమ్మెల్యే బోడేప్రసాద్

పెనమలూరు,నవంబరు3ప్రభాతవార్త : శ్రీశైలం శ్రీభ్రమరాంబఅమ్మవారి శక్తిపీఠం ఆలయం నందు శివుడుకు సోమవారం పెనమలూరు నియోజకవర్గ శాశనసభ్యులు బోడేప్రసాద్ కుటుంబం ప్రత్యేకపూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల భారతదేశ ఉమెన్స్ క్రికెట్ ఛాంపియన్‌షిప్ విజయోత్సవం సందర్భంగా భారతజట్టుకు అభినందనలు తెలియజేస్తూ



వారి తరుపున అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నామన్నారు.శ్రీశైలక్షేత్రం అష్టాదశ జ్యోతిర్లింగాలలో, శక్తిపీఠాలలో ఒకటి అని తెలిపారు.ఆ పరమశివుడికి ఎంతో ప్రీతికరమైన కార్తీకమాసంలో దర్శించుకోవడం మంచిదని తెలిపారు.

## ప్రతి ఒక్కరు సేవా మార్గాన్ని ఎంచుకోవాలి.. ఎంపి కేశినేని చిన్ని వెల్లడి

ఎ కొండూరు, నవంబర్ 3, ప్రభాతవార్త : ప్రేమే లక్ష్యం సేవే మార్గంగా గత 20ఏళ్లుగా కులమతాలకతీంగా రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న సూఫీ సేవా సదన్ ట్రస్ట్ కాషానాయే రహమత్ సేవకు ప్రతిరూపమని ప్రతిఒక్కరు సేవామార్గాన్ని ఎంచుకొని పనిచేయాలని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కోరారు. ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం విజయవాడ రూరల్ గొల్లపూడిలో నూతనంగా ఏర్పాటు చేసిన సూఫీసేవా సదన్ ట్రస్ట్ కార్యాలయానికి ఎంపి కేశినేని చిన్ని చీఫ్‌గెస్ట్‌గా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి చిన్ని మాట్లాడుతూ ట్రస్ట్ చైర్మన్ ఎస్‌ఎం ఫైజాన్ చేస్తున్న ఈ సేవా కార్యక్రమాలకు తాను పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని





ఎంపి చిన్ని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ ఫైజాన్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు యువనేత మంత్రి నారా లోకేష్‌బాబు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ల సూచనల మేరకు సేవా కార్యక్రమాలను విస్తరింప చేస్తామని ఫైజాన్ పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షుడు కెడిసిసి బ్యాంక్ చైర్మన్ మాజీ మంత్రి నెట్టెం రఘురామ్‌తో పాటు తెదేపాలో వివిధ హోదాల్లో ఉన్న లీడర్లు, పార్టీ శ్రేణులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు ఎంపి చిన్నికి కెడిసిసి చైర్మన్ ఎన్ రఘురామ్ తదితర నేతలకు ఫైజాన్ వారి సోదరులు యజాన్, సల్మాన్ జావిద్, నోమాన్, గుఫ్రాన్ లుక్‌మాన్, ఎజాజ్ పాల్గొని ఘన స్వాగతం పలికి శాలువలతో సత్కరించి బొకేలు అందచేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ కార్యాలయానికి వచ్చిన పుర ప్రముఖులకు శ్రేణులకు నాయకులకు కార్యకర్తలకు వివిధ వర్గాల ప్రజలకు లంచ్ అవర్‌లో మటన్ బిర్యాని ఏర్పాటు చేశారు.

## కృష్ణమూర్తి వర్ధంతికి సిపిఎం నాయకుల నివాళి

తెనాలి టౌన్ నవంబర్ 3 (ప్రభాతవార్త):ఆర్టీసీ కార్మిక నాయకులు, సిపిఎం తెనాలి డివిజన్ మాజీ కమిటీ సభ్యులు, దివంగత,కామ్రేడ్ పి.కృష్ణమూర్తి రెండోవర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన స్వగృహంలో,సోమవారం సిపిఎం నాయకులు నివాళులర్పించారు.రిటైర్డ్ ఆర్టీసీ ఎంప్లాయిస్



అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రవీంద్ర,ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారితో పాటు సిపిఎం తెనాలి కమిటీ కార్యదర్శి కేబి.ప్రసాద్, షేక్.హుస్సేన్ వలి,పి.జోనేష్, కే.లక్ష్మణ్ రావు, ఎస్.సుబ్రమణ్యం, కే.దుర్గా ప్రసాద్,ఉమామహేశ్వరరావు తో పాటు వారికుటుంబ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేబి.ప్రసాద్, ఎస్.సుబ్రహ్మణ్యం,జి.రవీంద్ర మాట్లాడుతూ, కామ్రేడ్ కృష్ణమూర్తి, ఏఆశయం కోసం పనిచేశారో ఆలక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి అంకిత భావంతో పనిచేయాలని, అదే ఆయనకు ఇచ్చే నివాళి అని చెప్పారు.ఈ కార్యక్రమంలో పలువురు సిపిఎం పార్టీకి చెందిన నాయకులు,కార్యకర్తలు, పెద్దఎత్తున పార్టీ సానుభూతిపరులు పాల్గొన్నారు.

## నూతన ఫంక్షన్ హాల్ ఈ కన్వెన్షన్ ప్రారంభోత్సవం

తెనాలి టౌన్ నవంబర్ 3 (ప్రభాతవార్త): పట్టణంలో బస్టాండ్ అవుట్ గేట్ ఎదురుగా,సోమవారం, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్యవిభాగ అధికార ప్రతినిధి,ఈదర వెంకట పూర్ణచంద్ చే నూతనంగా ఏర్పాటుచేయబడిన ఖీ ఈఖీ కన్వెన్షన్ ను రోటరీ డిస్టిక్ 3150 ఫాస్ట్ గవర్నర్ అన్నే రత్న ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.ముఖ్య అతిధులుగా,రోటరీ క్లబ్ ఆంధ్ర ప్యారిస్ తెనాలి



అధ్యక్షులు రావి కృష్ణ మోహన్ (చిన్ని), రోటరీ క్లబ్ తెనాలి వైకుంటపురం అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం అధ్యక్షులు కేశన శంకర్రావు పాల్గొన్నారు,అనంతరం అన్నే రత్న ప్రభాకర్ మాట్లాడుతూ, ఈ కన్వెన్షన్ చాలా సౌకర్యవంతంగా ఫంక్షన్లు చేసుకునే వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందని, ఫంక్షన్ హాలు దినదినాభివృద్ధి చెంది పూర్ణచంద్ కు మంచి జరగాలని కోరుకుంటున్నానన్నారు,ఈ కార్యక్రమంలో రావి భగత్ దత్తు,సుంకర హరికృష్ణ, ముక్కామల మధుబాబు, కోగంటి రోహిత్,ఈదర శ్రీనివాసరావు,కన్నెగంటి మురళీకృష్ణ,కేసన కోటేశ్వరరావు,జొన్నదల మహేష్,ఈదర పూర్ణచంద్, రమ్య ,భావన,గుత్తా వెంకటరత్నం,కుర్ర శ్రీహరి, ఫణి,రోటరీ క్లబ్ ఆంధ్ర ప్యారిస్ తెనాలి,రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంతపురం సభ్యులు, మరియు ఆత్మీయులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిధులకి ఈదర పూర్ణచంద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## పురపాలకసంఘ గ్రీవెన్స్ కి పలు అర్జీలు


తెనాలి మున్సిపాలిటీ నవంబర్ 3 (ప్రభాతవార్త): పురపాలక సంఘ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కి ప్రజలు పలు అర్జీలు అందజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్యాధికారి మొవ్వ ఏసుబాబు పాల్గొని ప్రజల నుండి



వచ్చిన అర్జీలు స్వీకరించారు.ప్రధానంగా పట్టణంలో 32 వ వార్డులో నూతనంగా మురుగు కాలువల నిర్మాణం జరపాలని,అలాగే 28వ వార్డులో నూతనంగా సిసి రోడ్డు నిర్మించాలని,వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు,త్వరగా పరిష్కరించే విధంగా ఆదేశాలు ఇచ్చామని ఆరోగ్యాధికారి ఏసుబాబు తెలిపారు.బిల్డింగ్ రూల్స్ పై అభ్యంతరాలు ఏడురోజుల్లో తెలపండి:మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్!!అర్బన్ డెవలప్మెంట్ శాఖ ద్వారా బిల్డింగ్ రూల్స్ 2017కి కొన్ని సవరణలు చేస్తూ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశారని, మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు తెలిపారు. ప్రతిపాదిత సవరణల పై అభ్యంతరాలు,సూచనలు ఉంటే ఏడురోజుల్లో రాత పూర్వకంగా తెలియజేయాలని,అలాగే ముసయిదా సవరణ నోటిఫికేషన్ అన్ని ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ఉంచామని కమీషనర్ అప్పలనాయుడు తెలిపారు.

## తహసీల్దార్ గ్రీవెన్స్ కి నాలుగు అర్జీలు:

తెనాలి టౌన్ నవంబర్ 3 (ప్రభాతవార్త): మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కి నాలుగు అర్జీలు వచ్చాయి. మండల పరిధిలోని కొలకలూరు,నందివెలుగు, గుడివాడ,కాజీపేట,గ్రామాలకు చెందిన పలువురు సమస్యలపై



తహసీల్దార్ కెవి. గోపాలకృష్ణను కలిసి అర్జీలు సమర్పించారు. ముఖ్యంగా కొలకలూరు గ్రామపంచాయతీకి పర్మినెంట్ కార్యదర్శిని నియమించాలని అలాగే గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని అలాగే దళిత వాడలో డ్రైనేజీ కాలువలు నిర్మించి మురుగు దోమలు అంటూ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కొలకలూరు వాసులు అర్జీ సమర్పించారు. అనంతరం తాసిల్దార్ వారితో మాట్లాడుతూ అర్జీలను పరిశీలించి త్వరలో పరిష్కారమయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారిణి అత్తోట దీప్తి,మండల వ్యవసాయ శాఖ అధికారి సుధీర్ బాబు, మండల విద్యాశాఖ అధికారి మేకల లక్ష్మీ మ్నారాయణ,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కార్తీక సోమవారం,ఆలయాల్లో భక్తుల పూజలు:

తెనాలి మున్సిపాలిటీ నవంబర్ 3 (ప్రభాతవార్త): కార్తీక మాసం విశేషమైన సోమవారం సందర్భంగా పట్టణంలోనీ శివాలయాలు భక్తులతో రద్దీగా మారాయి. తెల్లవారుజాము నుండి ఆలయాలకు చేరుకున్న భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలతో కార్తీక దీపారాధనలు చేశారు.



పట్టణంలోని రామలింగేశ్వరపేటలో గల శ్రీ దుర్గా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా అమ్మవారికి గాజులతో విశేషమైన అలంకరణ చేశారు. మంగళవారం సాయంత్రం అమ్మవారికి ఉంజల్ సేవ నిర్వహించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించిన గాజులను, మహిళలకు పంచుతామని ఆలయకార్యనిర్వహణ అధికారి హరిప్రసాద్,ఆలయ ప్రధాన అర్చకుడు రాఘవేంద్ర శివ వరప్రసాద్ తెలిపారు.ఈ సందర్భంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లతో పాటు, ప్రత్యేక సిబ్బందిని కూడా నియమించినట్లు వారు తెలిపారు.

## సబ్ కలెక్టర్ గ్రీవెన్స్ కి 19అర్జీలు

తెనాలి మున్సిపాలిటీ నవంబర్ 3 (ప్రభాతవార్త): ప్రతి సోమవారం నిర్వహించే, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో సబ్ కలెక్టర్ కార్యాలయానికి 19 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంజన సింహ పాల్గొని ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరించారు.ముఖ్యంగా సబ్ కలెక్టర్ ను కలిసిన రైతు సంఘం నాయకులు,ఇటీవల వచ్చిన తుఫాను కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం త్వరగా ఆదుకోవాలని తుఫాను వల్ల కొందరు రైతులు తీవ్రంగా నష్టపోయారని నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందేలా చూడాలని, రైతు సంఘం నాయకులు కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ సంజనా సిన్హా మాట్లాడుతూ వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 19 అర్జీలు వచ్చినట్లు వాటిని సంబంధిత విభాగాలకు పంపి వీలైనంత త్వరలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

## భారత మహిళా క్రికెటర్ల ఘన విజయం ..
## హృదయాల నుంచి చెరిగిపోని చారిత్రక ఘట్టం

చిలకలూరిపేట, నవంబర్ 3, ప్రభాతవార్త: భారత మహిళా క్రికెటర్లు తమ అసమాన ప్రతిభా, సామర్థ్యంతో ప్రపంచ కప్పు గెలిచిన ప్రత్యేక సందర్భాన్ని నియోజకవర్గ తెలుగుమహిళా విభాగం, పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు సంతోషంగా వేడుక చేసుకున్నారు. భాతర క్రికెటర్ల ఫైనల్ మ్యాచ్ చూసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుగారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన మహిళానేతలు, జట్టుకు అభినందనలు తెలుపుతూ కేక్ కట్ చేసి తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఆ వివరాలు వారిమాటల్లోనే ..!భారతజట్టు విజయం సాధించాలని చంద్రబాబు, లోకేశ్, ప్రత్తిపాటి బలంగా కోరుకున్నారు.. శ్రీమతి అద్దంకి అనితా భాయి (నియోజకవర్గ తెలుగు మహిళా విభాగం అధ్యక్షురాలు) ˇ ప్రపంచమంతా ఇండియావైపు చూసేలా చేసిన భారత మహిళా క్రికెటర్లను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాము. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ రాష్ట్ర మహిళలకు ఆర్థిక స్థిరత్వం కల్పించడంతో పాటు.. వారి శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పారు. అటువంటి నాయకుల సారథ్యం రాష్ట్రానికి, ముఖ్యంగా తెలుగుమహిళలకు ఎంతో మేలు చేస్తోంది. భారత మహిళా క్రికెట్ జట్టు విజయం సాధించాలని బలంగా కోరుకున్న వారిలో చంద్రబాబు, లోకేశ్ ముందువరసలో నిలిచారు."మహిళా క్రికెట్ జట్టు విజయాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి గారు మాతో పంచుకొని ఆనందించారు.. కూన ప్రమీల (కౌన్సిలర్) ˇచిలకలూరిపేట శాసనసభ్యులు, మాజీమంత్రి



వర్యులు ప్రత్తిపాటి పుల్లారావు, మంత్రి నారా లోకేశ్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం. భారత జట్టు ప్రపంచకప్ ఫైనల్ కు చేరిన శుభసందర్భాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే ప్రత్తిపాటి గారు స్థానిక క్యాంపు కార్యాలయంలో మహిళలు ఫైనల్ మ్యాచ్ చూసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. మన జట్టు కప్పు గెలిచిన ప్రత్యేక క్షణాల్లో ప్రత్తిపాటి గారు తమ ఆనందాన్ని మాతో పంచుకున్నారు. ఫైనల్ మ్యాచ్ నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించి ముందుగానే నియోజకవర్గంలోని మహిళా విభాగాలకు సమాచారం అందించారు. ముంబైలో ఫైనల్ మ్యాచ్ జరుగుతున్నా..ఇక్కడే జరుగుతుందా అనిపించేలా మ్యాచ్ ముగిసేవరకు మా సోదరీమణులు తమ ఆనందోత్సాహాలతో ప్రతి బాల్ కు జట్టుకు మద్దతుగా నిలిచారు" ప్రపంచం భారత్ వైపు చూసేలా మన మహిళా జట్టు సత్తా చాటింది యాలగల సుజాత (తెలుగుమహిళా విభాగం పట్టణ ప్రధాన కార్యదర్శి) మహిళా క్రికెటర్ల చిరస్మరణీయ విజయాన్ని పురస్కరించుకొని ప్రత్తిపాటి గారి క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రపంచం మొత్తం భారత్ వైపుచూసేలా మన దేశ మహిళా క్రికెటర్లు తమ సత్తా చాటారు. ఉత్తమ ఆటతీరుతో ప్రతి ఒక్కరి మనసు గెలిచిన మహిళా క్రికెటరర్లు అందరికీ పేరుపేరునా ప్రత్యేక అభినందనలు తెలియచేస్తున్నాం. మహిళలు దేనిలోనూ తీసిపోరని చెప్పడానికి ఈ విజయమే నిదర్శనం. తెలుగు మహిళల్ని అన్ని రంగాల్లో ముందుండేలా ప్రోత్సహిస్తున్న మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, ముఖ్యమంత్రి చంద్రబాబు,మంత్రి లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గార్లకు పట్టణ తెలుగు మహిళలందరి తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మాద్దుమాల రవి, టీడీపీ నాయకులు బత్తినేని శ్రీనివాసరావు, నజీరునిసబెగం, మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## ఏ దేశంలో ఉన్నా..ఎంత ఉన్నతస్థానానికి ఎదిగినా స్వగ్రామాన్ని.. సొంత రాష్ట్రాన్ని ప్రేమించడం. అభివృద్ధి చేయడం చాలా గొప్ప విషయం

చిలకలూరిపేట, నవంబర్ 3, ప్రభాతవార్త: హైదరాబాద్ కూకట్ పల్లిలో జరిగిన నాదెండ్ల గ్రామస్తుల 6వ ఆత్మీయ సమావేశానికి ప్రత్యేక అతిథిగా హాజరైన ప్రత్తిపాటి.. జంట నగరాల్లో స్థిరపడి, గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరినీ పేరుపేరునా అభినందించిన అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడారు. ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని అన్న తీరుగా తెలుగువారు ప్రపంచంలో ఎక్కడున్నా.. ఎంత ఉన్నతస్థానంలో ఉన్నా జన్మభూమిపై తమకున్న మమకారాని విడిపెట్టలేరని ప్రత్తిపాటి తెలిపారు. హైదరాబాద్ లో స్థిరపడి, వివిధ రంగాల్లో గొప్పగా స్థిరపడిన నాదెండ్ల గ్రామస్తుల పవిత్రమైన కార్తీక మాసాన గ్రామంలో సమావేశం కావడం అభినందించాల్సిన విషయమన్నారు. నాదెండ్ల గ్రామాన్ని రాష్ట్రంలో మేటిగా అభివృద్ధి చేయడంపై గ్రామస్తులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి, అందరూ ఏడాదిలో ఒక్కసారైనా సమావేశమై తమ గ్రామ..నియోజకవర్గ.. రాష్ట్ర ప్రగతికి తమవంతు చేయూత నందించాలని ప్రత్తిపాటి కోరారు. హైదరాబాద్ లో స్థిరపడిన గ్రామస్తులందరినీ ఒకచోటికి చేర్చి ప్రత్యేక ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసిన స్థానిక కమిటీ సభ్యుల్ని ప్రత్తిపాటి అభినందించారు. కుటుంబసభ్యులతో సహా సమావేశంలో పాల్గొన్న హైదరాబాద్ లో స్థిరపడిన నాదెండ్ల గ్రామ వాస్తవ్యులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటిని ఘనంగా సన్మానించి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటికి వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీ. వెంకటేశ్వరరావు, నల్లమోతు అమరేశ్వరరావు, కాట్రగడ్డ పరమేశ్వరరావు, నల్లమోతు కోటేశ్వరరావు, నల్లమోతు జయరాం, నాదెండ్ల గ్రామ కమిటీ సభ్యులు నల్లమోతు శివరాం ప్రసాద్, నల్లమోతు బాలమురళీ కృష్ణ, చేకూరి అమరేశ్వర్రావు, కాట్రగడ్డ పరమేశ్వరరావు, నల్లమోతు ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చిలకలూరిపేట పట్టణ సుగాలీ కాలనీ వాసుల కనీస అవసరమైన స్మశాన వాటిక ఏర్పాటుకు స్థలం కేటాయించాలి.

చిలకలూరిపేట, నవంబర్ 3, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి.చిలకలూరిపేట పట్టణంలో అర్ధ శతాబ్ది కాలానికి పైగా జిల్లాలోని వివిధ తండాల నుండి జీవనాధారం కోసం వలస వచ్చి స్థిరనివాసం ఏర్పరచుకుని జీవనం సాగిస్తున్న పదివేల మందికి పైగా గల షెడ్యూల్డ్ తెగలకు చెందిన సుగాలీలకు కనీస అవసరమైన ప్రత్యేక స్మశాన స్థలాన్ని కేటాయించాలని చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం రాధాకృష్ణ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం ప్రసన్నలు విజ్ఞప్తి చేశారు. ఈరోజు కాంగ్రెస్ పార్టీ నాయకులు సుగాలీల సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండల డిప్యూటీ తహసీల్దార్ గారికి వినతి పత్రం సమర్పించారు. సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సుగాలీలకు ప్రత్యేక స్మశాన వాటిక స్థలాన్ని కేటాయించి సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మానవుని కనీస అవసరాలలో ఒకటైన స్మశానం లేక నిరుపేద సుగాలీలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాలకులు మారినా ప్రభుత్వాలు మారినా సుగాలీల సమస్య పరిష్కారం కాకపోవడం దురదృష్టకరమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సుగాలీలకు స్మశాన వాటిక స్థలాన్ని ఏర్పాటు చేయాలని చిరకాల అపరిష్కృత సమస్యకు పరిష్కారం చూపించాలని కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేసింది. సుగాలీల స్మశాన వాటిక ఏర్పాటు కు స్థలం కేటాయించేంతవరకు కాంగ్రెస్ పార్టీ దశలవారీ పోరాటాన్ని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం రాధాకృష్ణ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం ప్రసన్న రిటైర్డ్ హవల్దార్ మేజర్ కేతావతు మంత్రు నాయక్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ విభాగం నాయకులు కేతావతు సాంబశివ నాయక్ కేతావత్ భీమా నాయక్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇంటూరి భవాని వెంకటేష్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కారుచోల స్వప్న కుమార్ చిలకలూరిపేట మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు షేక్ ఖాజాబుడే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పాల బాబు, కె ఆంజనేయులు షేక్ షరీఫ్, షేక్ సునీల్ బాబు, షేక్ ఇస్మాయిల్, షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవార్డులు వేడుక



చిలకలూరిపేట, నవంబర్ 3, ప్రభాతవార్త: వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవార్డులు వేడుక ఘనంగా జరిగింది. ముఖ్య అదితి గా చిలకలూరిపేట పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. చిలకలూరిపేట్ఘ్బు కాలనీ లో ఉన్న పార్క్ఆవరణలో మంచి నీటి శుద్ధి చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ప్లాంట్ తో పాటు పార్క్ లో పలు రకాల అభివృద్ధి పనులు సభ్యులు సహకారంతో జరిగాయి. ఈ సందర్భంగా వారికి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవార్డులు అందుకున్నారు.జిల్లా స్థాయి లో అవార్డులు రావడం తో పలువురు ప్రముఖులు తవ్వా నాగేశ్వరరావు ను అభినందించారు. చిలకలూరిపేట రత్న బేకర్స్ అధినేత తవ్వా నాగేశ్వరరావు కు ఈ అవార్డ్ దక్కింది. తవ్వా నాగేశ్వరరావు ను కూడా పార్కు సభ్యులు అభినందించారు

## మొంథా తుపానులో చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ హరిబాబు పనితీరును ప్రశంసించిన జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా

చిలకలూరిపేట : మొంథా తుపానులో పట్టణ ప్రజలకు అండగా నిలిచిన చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ పీ. శ్రీ హరిబాబు పనితీరును జిల్లా అధికారులు అభినందించారు. మొంథా తుఫాను సమయంలో అత్యుత్తమ సేవలు అందించిన అధికారులను, సిబ్బందిని సోమవారం నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఘనంగా సత్కరించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయడం,వార్డులు మరియు కాలనీల్లో మునిసిపల్ సిబ్బందిని వేగంగా పనిచేసేందుకు ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టడం, అవసరమైన సాయం – త్రాగునీరు, విద్యుత్, వైద్య సహాయం తదితరాలను సమయానికి అందించడంలో కమిషనర్ చూపిన కృషిని కలెక్టర్ ప్రశంసించారు.

4-11P8exHMNWJQE_4-11P8exHMNWJQE.qxd 04/Nov/25 2:00 AM Page 1



# చేవెళ్ల రహదారి రక్తసిక్తం

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్

## 19 మంది దుర్మరణం.. 25 మందికి గాయాలు

## మృతుల్లో పసికందుతో పది మంది మహిళలు



**చేవెళ్ల, నవంబరు 3, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల వద్ద ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సును వేగంగా వచ్చిన కంకర టిప్పర్ ఢీకొట్టడంతో 19 మంది మృత్యువాత పడ్డారు. మరో 25 మంది గాయాల పాలయ్యారు. ఈ విషాద సంఘటన సోమవారం హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. తాండూరు నుంచి హైదరాబాద్ వెళుతున్న తాండూర్ డిపో బస్సు (టిఎస్34టిఎ 6354)ను ఎదురుగా రాంగ్‌రూట్‌లో వస్తున్న కంకర టిప్పర్ (టిజి06టి.3879) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 19 మంది దుర్మరణం చెందారు.

అదేసమయంలో వెనక నుంచి మరో బస్సులో వస్తున్న మహిళా పోలీసు బృందం వారిని కాపాడేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. మృతదేహాలను బయటకు తీసుకునేందుకు మూడు గంటల సమయం పట్టింది. పటాన్‌చెరు నుండి వికారాబాద్ వైపు వెళ్తున్న కంకర టిప్పర్ చేవెళ్ల మండలం మీర్జాగూడ మలుపు వద్ద బస్సును ఢీకొట్టింది. రోడ్డుపైన గుంత ఉండడంతో టిప్పర్ డ్రైవర్ గుంతను తప్పించబోయి ఎదురుగా వస్తున్న బస్సు ను అతివేగంగా ఢీకొట్టాడు. టిప్పర్‌లో ఉన్న కంకర మొత్తం బస్సులోపలికి పడి ప్రయాణికులను కప్పేసింది. ఒకవైపు టిప్పర్, మరోవైపు కంకరమీద పడ టంతో ప్రయాణికులు ఆర్తనాదాలు మిన్నంటాయి. ఊపిరి ఆడక 19 మంది అక్కడికక్కడే మరణించారు.

**మృతులు..**

1.కల్పన(45)-బోరబండ, 2.తారిఫ్‌బాయ్-ధన్నారం తండా, 3.అఖిలా రెడ్డి- యాలాల, 4.నాగమణి- కర్ణాటక, 5.గున్నమ్మ-బోరబండ, 6.మాగల హనుమంతు- నీటూర్, 7.షేఖ్ కాలేద్ హుసేన్-తాండూర్, 8.తబస్సుమ్ జాహ - తాండూర్, 9.నందిని - తాండూర్, 10.డ్రైవర్ దస్తగిరి బాబా-మంతటి, 11. తళియాబేగం- తాండూర్, 12.బందప్ప-హాజీపూర్, 13.లక్ష్మి- హాజీపూర్, 14.ముస్కన్ బేగం-తాండూర్, 15.ఆకాష్ కమ్లే -తాండూర్, 16.సాయిప్రియ- తాండూర్, 17.తనూష -తాండూర్, 18.40 రోజుల పసికందు (తాండూర్), 19.కె.వెంకటమ్మ -తాండూర్.

**గాయపడిన వారు..**

వెన్నెల (మల్కాజిగిరి), రవి (వికారాబాద్), మహమద్ యూనిస్(తాండూర్), అన్సూజ (గోంగుపల్లి),సుజాత (అస్తెపూర్), రాజా(తాండూర్), వెంకటయ్య (వికారాబాద్), అబ్దులల్ రజాక్(వికారాబాద్), బుజ్జిభాయ్ (దన్నారం), అశోక్ కుమార్ రెడ్డి(దౌల్తాబాద్), నవీన్ (యాలాల్), నందిన(దారుర్), శ్రీను (తాండూర్),బస్వరాజ్ (కోకట్), ప్రేరణ (వికారాబాద్), శ్రీసాయి(తాండూర్), అక్రమ్ (తాండూర్), అస్లామ్ (తాండూర్), జయసుధ (కేరెల్లి),జగదీష్ (బీరారెడ్డిపల్లి), అబ్దుల్‌వాజిత్ (తాండూర్).

## టిప్పర్ దూకుడును ముందే గమనించాం

### మా బస్సును డ్రైవర్ రోడ్డు కిందకు దింపాడు

### అయినా టిప్పర్ వచ్చి ఢీకొట్టింది



బస్సు ప్రమాదం ఉదయం 6:40 నుంచి 7 గంటల మధ్యలో జరిగింది. మేము ప్రయాణించే బస్సు నెమ్మదిగానే వెళుతోంది. టిప్పర్ చాలా వేగంగా దూసుకొచ్చింది. అది గమనించిన బస్సు డ్రైవర్ మా బస్సును రోడ్డు కిందకు దింపాడు. అయినా టిప్పర్ వచ్చి ఢీకొట్టింది. చిట్టెంపల్లి దగ్గర ఓ ప్రయాణికురాలికి టికెట్ ఇచ్చి ఇలా కూర్చున్నాం అంతే. ప్రమాదం జరిగిపోయింది. అది జరుగుతదని అనే విషయం కూడా తెలియకుండా వేగంగా జరిగిపోయింది. కొంతమంది పోలీసులు కూడా సిటీకి వెళ్లడానికి బస్సు ఎక్కారు. ప్ర యా ణికుల తో పాటు ఉద్యో గులు, విద్యా ర్థులు కూడా ఉన్నారు.

– రాధ, బస్సు కండక్టర్

# కేంద్రం రూ. 2 లక్షల పరిహారం

### క్షతగాత్రులకు రూ. 50 వేలు ఆర్థిక సాయం

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** చేవెళ్ల బస్సు ప్రమాద సంఘటనపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ, సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధిక ప్రాణనష్టం కలుగడం బాధాకరమని అన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ కింద మృతులకు రూ.2 లక్షల చొప్పున గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ప్రధాని ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. చేవెళ్ల బస్సు ప్రమాదంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ సంఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వారికి తగిన ఆర్థిక సహాయంతో పాటు గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందజేయాలని సీఎస్, డీజీపీలను ఆదేశించారు. ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. మంత్రులు, ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉంటూ వారికి అందుబాటులో ఉండాలన్నారు. సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పరిస్థితిని సమీక్షించేందుకు ఆర్టీసీ ఎండీ, రవాణా కమిషనర్, అగ్నిమాపక డీజీలను సంఘటనా స్థలానికి వెళ్లాలని ఆదేశించారు. ఇలా ఉండగా సంఘటనా స్థలానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు, విప్ డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, యాదయ్య, మనోహర్‌రెడ్డి వెళ్లారు. బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయ సహకారాలు అందజేస్తామని భరోసా ఇచ్చారు.

# రాష్ట్ర ప్రభుత్వం రూ. 7 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన

**చేవెళ్ల, నవంబరు 3, ప్రభాతవార్త :** చేవెళ్ల ఆసుపత్రిలో ప్రమాదంలో మృతి చెందిన క్షతగాత్రులను మృతి చెందిన వారిని రాష్ట్ర ఐటీ శాఖ,పరిశ్రమల శాఖమంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు, వైద్యశాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ, రవాణ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌లు ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, రాంమోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డిలు పరామర్శించారు, చేవెళ్ల రోడ్డు ప్రమాద దుర్ఘటకరమని ప్రభుత్వం మృతుల కుటుంబాలకు 7లక్షల రూపాయలు అందిస్తామన్నారు. గాయపడినవారికి మెరుగైన వైద్యం అందిస్తామన్నారు, ప్రమాదవిషయం తెలిసిన వెంటనే సిఎం రేవంత్ రెడ్డి స్పందించి రాష్ట్ర యంత్రాంగాన్ని మంత్రులను అప్రమత్తం చేశారన్నారు, వెంటనే ప్రమాదస్థలంకు వెళ్లాలని సిఎం ఆదేశించారన్నారు, ప్రభుత్వ యంత్రాంగం మొత్తం సహాయచర్యలు ముమ్మరంగా చేస్తున్నదన్నారు, ప్రమాదానికి గల కారణాలను తెలుసు కొనేందుకు శాఖపరమైన విచారణకు ఆదేశించామన్నారు. ప్రమాదంలో గాయపడినవారికి మెరుగైన వైద్యం అందిస్తామని వెల్లడించారు.

# మమ్మీ బస్ ఎక్కాను..

### అదే అఖిలారెడ్డి ఆఖరు కాల్



అఖిలారెడ్డి

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** 'మమ్మీ బస్ ఎక్కాను..' ఆ కూతురు తల్లికి చేసిన ఆఖరు ఫోన్ ఇది. బస్సు దిగిన తర్వాత కూడా ఫోన్ చేసే అలవాటు ఉన్న ఆమె గొంతు శాశ్వతంగా మూగబోయింది. చేవెళ్ల బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన అఖిలారెడ్డి స్వగ్రామం యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్. బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసిన అఖిలారెడ్డి మంచి అవకాశాల కోసం హైదరాబాద్‌లో ఎంబీఏ చదువుతోంది. జీవిత ఆమె కోసం తల్లిదండ్రులు మొబైల్ ఫోన్ కొనుగోలు చేశారు. ఫోన్ తీసుకువెళ్లాలని సూచించడంతో శనివారం స్వగ్రామానికి వచ్చిన అఖిల సోమవారం ఉదయం హైదరాబాద్ బస్సు ఎక్కింది. తాను బస్సు ఎక్కానని తల్లికి చెప్పింది. ఉదయం 8 గంటలకు హైదరాబాద్‌లో బస్సు దిగిన తర్వాత మళ్లీ తల్లికి ఫోన్ చేసే అలవాటు ఉంది. కానీ ఈరోజు అఖిల నుంచి ఫోన్‌రాలేదు. అప్పటికే చేవెళ్ల ప్రమాదంలో అఖిలారెడ్డి ప్రాణాలు కోల్పోయింది. బస్సు ప్రమాద సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈరోజు ప్రయాణం మానుకోవాలని చెప్పినా ఆమె వినలేదని, కాలేజీలో స్పోర్ట్స్ వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. ప్రమాదాలు తగ్గాలంటే ఈ ప్రాంత రోడ్డు బాగు పడాలని బాధిత కుటుంబీకులు అన్నారు. తరచూ డ్రంక్ అండ్ డ్రైవ్ రైడ్స్ జరగాలని డిమాండ్ చేశారు.

# ఆది నుంచీ ఉల్లంఘనుడే!

### కంకర టిప్పర్‌కు పెండింగ్ చలానాలు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** చేవెళ్ల బస్సు ప్రమాదానికి కారణమైన కంకర్ టిప్పర్ పలుమార్లు నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలుస్తున్నది.



ఆర్టీసీ హైర్ సర్వీసు బస్సును ఢీకొట్టిన టిప్పర్ టీజీ06టీ3879 నెంబర్‌పై రిజిస్ట్రేషన్ చేశారు. ఈ టిప్పర్ రెండుసార్లు నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలంగాణ పోలీసులు చలానా విధించారు. కానీ ఇప్పటి వరకు ఒక్క చలానా కూడా చెల్లించకపోవడం యాజమాని బాధ్యతారాహిత్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ యేడాది ఫిబ్రవరి 18న రామచంద్రాపురం, సెప్టెంబరు 10న మియాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చలానాలు విధించారు. భారీ వాహనాలకు అనుమతి లేని ప్రదేశంలో టిప్పర్ ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ రెండుసార్లు నిబంధనలను ఉల్లంఘించగా రూ.1600 చొప్పున రూ.3200 చలానాలు పెండింగ్‌లో ఉన్నాయి. యూజర్ ఛార్జీలతో కలిపి రూ.3270 చెల్లించాల్సి ఉన్నా ఇప్పటి వరకు వాటి గురించి యజమానులు పట్టించుకోలేదు. నిత్యం చేవెళ్ల మార్గంలో నడిచే ఈ టిప్పర్‌ను రవాణా, పోలీసు యంత్రాంగాలు తనిఖీ చేయకపోవడం విడ్డూరమని అంటున్నారు. తాజాగా ఈ సంఘటనతోనైనా అధికారులు మేల్కొంటారా లేదా వేచి చూద్దాం. ఇలా ఉండగా ప్రమాదానికి టిప్పర్ డ్రైవర్ కారణమే కాకుండా ఓవర్‌లోడ్ ఉన్నట్లు భావిస్తున్నారు.

# ప్రమాదంపై సిఎం రేవంత్ దిగ్భ్రాంతి.. కీలక ఆదేశాలు

### హెల్త్ ఎమర్జెన్సీ తరహాలో గాంధీ, ఉస్మానియాలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వులు


### ప్రమాదంపై ప్రధాని మోడీ సంతాపం, రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన

### ఘటనా స్థలానికి వెళ్లిన మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు,

### ఎపి సిఎం చంద్రబాబు, పవన్, లోకేశ్,

### బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, కెటిఆర్ స్పందన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 3:** రంగారెడ్డి జిల్లాలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదవార్త తెలియగానే ఆయన తక్షణమే స్పందించి, సహాయక చర్యలను ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని ఉన్నతాధికారులను సూచించారు. క్షతగాత్రుల ప్రాణాలు కాపాడటమే ప్రథమ కర్తవ్యమని సీఎం స్పష్టం చేశారు. గాయపడిన వారిని వెంటనే హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు తరలించి, అత్యుత్తమ వైద్యం అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీలను ఆదేశించారు. అందుబాటులో ఉన్న మంత్రులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని కోరారు. బాధితుల కోసం గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, పరిస్థితి విషమంగా ఉన్న వారిని కాపాడేందుకు నిపుణులైన వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఘటనను ఒక హెల్త్ ఎమర్జెన్సీ తరహాలో పరిగణించి, అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం అత్యంత బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. ప్రమాద మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. అదేవిధంగా గాయపడిన వారికి రూ. 50 వేల పరిహారం అందిస్తామని వెల్లడించారు.



ఈ ప్రమాదంపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన వెంటనే ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. ఆర్టీసీ అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకోవాలని ఆదేశించారు. చేవెళ్లలో సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో 19 మంది మరణించడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. మరోవైపు, ఈ దుర్ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని పవన్ కల్యాణ్ కోరారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు నారా లోకేశ్ పేర్కొన్నారు.

**మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన కెసిఆర్, కెటిఆర్**

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొన్న దుర్ఘటనలో 19 మంది ప్రయాణికులు మృతి చెందడం పట్ల వారు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కేసీఆర్ స్పందిస్తూ... ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ప్రమాదంపై విచారణకు ఆదేశం: మంత్రి పొన్నం

**చేవెళ్ల నవంబరు 3, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం పై విచారణకు ఆదేశించామని మంత్రి పోన్నం ప్రభాకర్ ఆదేశించారు, ప్రమాదం తెలిసిన వెంటనే ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ప్రమాదసంఘటన స్థలం ను పరిశీలించారు, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు, మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబాలకు అప్పగించాలని ఆదేశించారు, మంత్రి ఆదేశాల మేరకు చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి హైద్రాబాద్ ఉస్మానియా, గాంధీ, నిమ్స్ ఆసుపత్రుల నుండి హుటాహుటిన వచ్చిన డాక్టర్లు, మృతదేహాలను పోస్టుమార్ట చేసారు, తాండూర్ నుండి హైద్రాబాద్‌కు వెళ్తున్నటువంటి ఆర్టీసీ బస్సును టిప్పర్ రాంగ్‌రుట్లో వచ్చి బస్సును ఢీ కోట్టడం వల్లనే ప్రమాదం జరిగిందన్నారు, టిప్పర్‌లో కంకర ప్రయాణికుల పై పడి కప్పడంతో ప్రయాణికులు ఊపిరాడక మరణించారన్నారు, వెంటనే సంఘటన స్దలం నుండి క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రులకు తరలించారని, మరణించిన 19 మంది కుటుంబాలకు ప్రభుత్వం తరుపున ఏడు లక్షల రూపాయలు సహాయం అందిస్తుందని, గాయాలైనవారికి మెరుగైన వైద్యం, రెండు లక్షలు అందిస్తామని తెలిపారు, మృతదేహాలను పరిశీలించి ఆసుపత్రిలో ఉన్న క్షతగాత్రులను రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, అడిషినల్ డిజిపి మోహన్ భగవత్. సైబరాబాద్ కమిషనర్ మహంతి. జిల్లా గ్రంధాలయ చైర్మెన్ మధుసుదన్ రెడ్డి మాజి ఎమ్మెల్యే రత్నం సబితా ఇంద్రారెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారయణ రెడ్డి పరామర్శించారు,



# మృతుల్లో 13 మంది తాండూరు ప్రాంతీయులే

### జిల్లా అంతటా విషాధం

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి/తాండూరు:** మీర్జాగూడ రోడ్డు ప్రమాదం జిల్లాను విషాధ ఛాయల్లో ముంచేసింది. బస్సులో ప్రయాణిస్తున్న 70 మంది లో 19 మంది మృత్యువాత పడ్డారు. అందులో తాండూరు పరసర ప్రాంతానికి చెందినవారే 13 మంది ఉన్నారు. ఆర్టీసీ (టీజీ 34టీఏ 6354)ను రాంగ్ రూట్‌లో వచ్చిన కంకర టిప్పర్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

**ముగ్గురు అక్కా చెల్లెళ్లు..**

తాండూరు నియోజకవర్గంలోని యాలాల మండలం పేర్కంపల్లికి చెందిన ఎల్లయ్యగౌడు తాండూరులో నివసిస్తున్నారు. ఆయనకు ఐదుగురు సంతానం. వారిలో నలు 0గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ట్రావెల్ ఏజెన్సీ నడుపుతున్న ఎల్లయ్య ఇటీవల పెద్ద కూతురు అనూష వివాహం చేశారు. రెండో కుమార్తె



తనూష ఎంబీఏ చదువుతూ ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. మూడు కూతురు సాయిప్రియ కోఠీ ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ చదువుతోంది. నాలుగవ కుమార్తె నందిని అదే కాలేజీలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ అభ్యసిస్తోంది. కుమారుడు టెన్త్ చదువుతున్నాడు. గత నెల 15న అనూష వివాహం కోసం వచ్చిన కుమార్తెలను సోమవారం తాండూరులో తండ్రి బస్సు ఎక్కించాడు. పెళ్లి సందర్భంగా ఆనందంగా గడిపిన తనూష, సాయిప్రియ, నందిని చేవెళ్ల వద్ద బస్సు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఒకేసారి ముగ్గురు అక్కాచెల్లెళ్లు ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబంలోనే కాకుండా పట్టణంలో విషాధఛాయలు అలముకున్నాయి. స్వగ్రామం పేర్కంపల్లిలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

**మెట్టినింటికి వెళ్తూ..**

తాండూరు పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన వెల్డర్ ఖాలేద్‌కు కుమార్తె సలేహా (20) వివాహం జరిపించాడు. ఆమె కాన్పు కోసం పుట్టింటికి వచ్చి మూడు నెలల క్రితం పాపకు జన్మనిచ్చింది. వారిద్దరినీ అత్తగారింటికి పంపేందుకు బస్సులో బయలుదేరారు. ప్రమాదంలో ఖాలేద్ సహా తల్లీ కూతురు ప్రాణాలు కోల్పోయారు. ఒకే కుటుంబంలో ముగ్గురు చనిపోవడంతో తాండూరులో విషాధఛాయలు అలముకున్నాయి. వారి కుటుంబీకులను ఓదార్చడం స్థానికులకు సాధ్యం కాలేకపోయింది. ఇలా ఉండగా పట్టణంలోని విశ్వంభర కాలనీకి చెందిన అబ్దుల్ మాజీద్ బేకరీలో పనిచేస్తుంటారు. తన భార్య తబస్సుమ్ (35)తో పాటు ముగ్గురు పిల్లలతో కలిసి హైదరాబాద్ బయలుదేరారు. ప్రమాదంలో కంకరలో చిక్కుకున్న తబస్సుమ్ ప్రాణాలు వదిలింది. ఆమె పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. కర్నాటక రాష్ట్రం ముదేల్లికి చెందిన నాగమణి (45) కూడా ప్రమాదంలో మృత్యువాతపడింది.

**పర్‌ఫెక్ట్ డ్రైవర్‌కు ఆఖరి డ్యూటీ..**

మంచి డ్రైవర్‌గా గుర్తింపు పొందిన బస్సు డ్రైవర్ దస్తగిరి బాబా ఈ ప్రమాదంలో చనిపోయారు. బషీరాబాద్ మండలం మంతట్టికి చెందిన దస్తగిరి (45) ఇరవై ఏండ్లుగా తాండూరులో నివాసం ఉంటున్నారు. ఇద్దరు భార్యలు, సంతానం ఉన్నారు. గతంలో టిప్పర్, లారీ డ్రైవర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. పదేండ్లుగా ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. హైర్ సర్వీసు బస్సుకు డ్రైవర్‌గా ఇటీవల విధుల్లో చేరాడు. రోజూ హైదరాబాద్‌కు తాండూరు నుంచి బయలుదేరే మొదటి బస్సుసర్వీసు ఇదే. ఈ ప్రమాదంలో ఆయన సక్రమంగా నడిపించినా ఎదురుగా కంకర టిప్పర్ కబలించింది. గతంలో అనంతగిరి ఘాట్ వద్ద బస్సు బ్రేకులు ఫేయిలైతే చాకచక్యంగా వ్యవహరించి అందరి ప్రాణాలు కాపాడిన దస్తగిరి ఇలా ప్రాణాలు కోల్పోవడం పట్ల డిపోలో విషాధఛాయలు అలుముకున్నాయి.

**దవాఖానాకు వెళ్లిన భార్యభర్త మృతి**

ఆసుపత్రి నిమిత్తం హైదరాబాద్ వెళ్లిన యాలాల మండలం హాజీపూర్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు లక్ష్మీ, బందెప్ప కూడా ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. లక్ష్మీ ఆరోగ్యం బాగాలేక హైదరాబాద్‌లో చికిత్స చేయించుకుందామని బస్సులో బయలుదేరి ఇలా మృత్యువాత పడ్డారు.

# చేవెళ్ల ప్రమాదానికి టిప్పర్ ఓవర్‌స్పీడ్, ఓవర్‌లోడ్ కారణమని నిర్ధారణ

### టిప్పర్ డ్రైవర్ మద్యం తాగినట్లు లభించని ఆధారాలు, ప్రమాదంపై కేసు నమోదు

**హైదరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త:** నగర శివార్లలోని చేవెళ్లలో సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి కంకర లోడ్‌తో వెళుతు న్న టిప్పర్ ఓవర్ స్పీడ్‌తో పాటు ఓవర్ లోడ్ కారణమని పోలీసుల విచారణలో తేలింది. టిప్పర్ డ్రైవర్ ఆకాష్ కమ్లే మద్యం తాగినట్లు ఆధారాలు లభించలేదు. ఈ దుర్ఘటనలో 19 మంది మరణించగా 25 మంది గాయపడ్డారు. చేవెళ్ల.. తాండూరు మార్గంలో ఉదయం ఏడు గంటల సమయం లో ఈ దుర్ఘటన జరిగింది. టిప్పర్ సామర్థ్యం 30 టన్నులు కాగా 60 టన్నుల వరకు కంకరను నింపుకుని చేవెళ్ల నుంచి తాండూరు వైపు వెళుతో ంది. ఇదే సమయంలో తాండూరు నుంచి 70 మందికి పైగా ప్రయాణీకులతో తాండురు డిపో బస్సు హైదరాబాద్ వస్తోంది. మిర్జాగూడ వద్ద రహ దారిపై గుంత వుండగా, ఇక్కడ రహదారి చిన్నదిగా వుంది. ఈ సమయంలో సుమారు వంద కిలోమీటర్ల వేగంతో వెళుతున్న టిప్పర్ రహదారిపై వున్న గుంతను తప్పించబోయి ఎదురుగా వస్తున్న బస్సును కుడివైపు భాగంలో ఢీకొంది. బస్సును టిప్పర్ ఢీకొన్న తరువాత ఒక్కసారిగా బస్సుపై ఒరిగి పోవడంతో అందులోని కంకర బస్సు కుడివైపు కూర్చున్న ప్రయాణీకులపై పడింది. ఇదే సమయంలో టిప్పర్ బరువుకు బస్సు కుడివైపు భాగ ం తీవ్రంగా దెబ్బతింది. ఈ ఘటనలో టిప్పర్ డ్రైవర్‌గా వున్న ఆకాష్ కమ్లే (34)తో పాటు బస్సు డ్రైవర్ దస్తగిరి బాబా సహ బస్సులోని 17 మం ది ప్రయాణీకులు మరణించారు. మరో 25 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో టిప్పర్ యజమాని లక్ష్మణ్ కూడా వున్నాడు. ఇతన్ని నిమ్స్‌కు తరలించారు. ప్రమాదంలో మరణించిన వారి భౌతిక కాయాలకు చేవెళ్ల ఆసుపత్రిలో పోస్టుమార్ట ం నిర్వహించారు. ఇందులో ఆర్టీసీ బస్సు డ్రైవర్, టిప్పర్ డ్రైవర్‌ల మృతదేహాలపై వున్న గాయాలను వైద్యులు పరిశీలించి నివేదిక రూపొందించారు. టిప్పర్ డ్రైవర్ మద్యం తాగినట్లు వార్తలు రావడం తో ఆ కోణంలోనూ వైద్యులు పరిశీలించగా దీనిపై ఎలాంటి ఆధారాలు లభించలేదు. అయినప్పటి కీ శరీరంలోని కొన్ని భాగాలను తదుపరి పరీక్షల కోసం ఫోరెన్సిక్ లాబ్‌కు పంపారు. ఇక్కడ జరిగే పరీక్షలకు సంబంధించిన ఫలితాలు రావడానికి కొంత సమయం పట్టే వీలుందని పోలీసులు తెలి పారు. కాగా ఘటన జరిగిన ప్రాంతాన్ని శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, సైబరాబా ద్ పోలీసు కమిషనర్ అవినాష్ మొహంతి సహా పలువురు అధికారులు సందర్శించి ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించారు. బస్సుపై ఒరిగిన టిప్పర్‌ను జెసిబి సహాయంతో పక్కకు తీసి న తరువాత దానిని పరిశీలించారు. ఘటనా స్థలిని ఆర్టీసీ అధికారులతో పాటు రవాణా శాఖ అ ధికారులు కూడా పరిశీలించారు. ఈ ఘటనలో ఆ ర్టీసీ బస్సు పూర్తిగా నుజ్జు నుజ్జుగా మారింది. ఈ దుర్ఘటన కారణంగా చేవెళ్ల...తాండూరు మార్గంలో కొన్ని గంటల పాటు ట్రాఫిక్ నిలిచి పోయిం ది. కాగా ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఎడమ వైపు వున్న ప్రయాణీకులు ఈ దుర్ఘటనపై పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సుతో పాటు, టిప్పర్ కూడా వేగంగానే వున్నాయని తెలిపారు. టిప్పర్ డ్రైవర్ మితిమీరిన వేగంతో వస్తున్నట్లు, రోడ్డుపై గు ంతను తప్పించబోయి ఒక్కసారిగా అదుపుతప్పి బస్సును ఢీకొన్నట్లు వారు తెలిపారు. ఈ ఘటనపై బస్సు కండక్టర్ రాధ ఇచ్చిన ఫి ర్యాదుపై టిప్పర్ డ్రైవర్ ఆకాష్ కమ్లేపై కేసు నమోదు చేశారు.

# ప్రాణాలు తీసిన గుంత

### యమపురికి పిలుపు చేవెళ్ల రోడ్డు మలుపులు

**చేవెళ్ల నవంబరు 3, ప్రభాతవార్త :** రోడ్డుమధ్యలో ఉన్న గుంతను తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆర్టీసి బస్సును టిప్పర్ ఢీకోనడంతో ప్రమాదం జరిగింది. రోడ్డుపై ఉన్న గుంతనే 19 మంది ప్రాణాలు బలిగోంది. చేవెళ్ల రోడ్డు మలుపులు యమపూరికి పిలుపులుగా మారుతున్నాయి బస్సుడ్రైవర్ వెనుకాల కూర్చున్నవారందరు మృతి చెందగా కండక్టర్ వెనుకవైపున కూర్చున్న వారందరు, ప్రాణాలతో భయటపడ్డారు. రాంగ్‌రూట్లో టిప్పర్ ఢీకోట్టడంతో మీర్జాగూడవద్ద ప్రమాదం జరిగింది. మహరాష్ట్రాకు చెందిన ఆకాష్ కామ్లే నిర్లక్ష్యం కారణంగానే రోడ్డు ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. చేవెళ్ల బీజాపూర్ రహదారిలో ఎప్పుడు ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. అప్పాజెంక్షన్ నుండి మన్నెగూడ వరకు రోడ్డు పనులు జాప్యం కావడంతో రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం జరగుతున్న ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు చేవెళ్ల మండలం మిర్జాగూడ వద్ద జరిగిన ప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోవడం ప్రతి ఒక్కరిని ఉక్కిరి బిక్కిరి చేసింది.


4-11Pg5 9_4-11Pg5.qxd 03/Nov/25 10:21 PM Page 1



# పరిశోధనలే దేశ భవిష్యత్తు

## ఎస్టిక్ 2025లో ప్రధానిమోడీ

### రూ.లక్ష కోట్ల ఆర్ అండ్ డి నిధి జాతికి అంకితం



**న్యూఢిల్లీ, నవంబరు 3:** దేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాలకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రోత్సాహం అందిస్తూ ముందడుగు వేశారు. సోమవారం ఢిల్లీలోని భారత్ మండపంలో ఎమర్జింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ కాంక్లేవ్ (ఎస్టిక్) 2025ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశ శాస్త్ర, సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేసే లక్ష్యంతో రూ. లక్ష కోట్ల పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల పథకం నిధిని కూడా ఆయన జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ దేశంలో పరిశోధన, అభివృద్ధికి కొత్త అవకాశాలు కల్పించేందుకే రూ. లక్ష కోట్ల ఆర్‌డిఐ ఫండ్‌ను ప్రారంభించామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. ఆధునిక ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించేందుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ రీసెర్చ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఇందుకోసం ఇప్పటికే ఆర్థిక నియమాలు, సేకరణ విధానాల్లో సంస్కరణలు తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, ప్రధాని మోడీ దార్శనికత వల్లే శాస్త్ర సాంకేతిక రంగాలకు ప్రోత్సాహం లభిస్తోందన్నారు. దశాబ్దాలుగా ప్రతిభ ఉన్నప్పటికీ మన శాస్త్రవేత్తలకు సరైన సౌకర్యాలు లేవని, కానీ మోడీ నాయకత్వంలో ఇప్పుడు వికసిత్ భారత్ దిశగా పయనిస్తున్నామని చెప్పారు. స్టార్టప్‌లు, గగన్‌యాన్, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో సాధించిన ప్రగతితో భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. నవంబర్ 3 నుంచి 5 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ ఎస్టిక్ 2025 సదస్సులో విద్యాసంస్థలు, పరిశోధన కేంద్రాలు, పరిశ్రమలు, ప్రభుత్వ రంగాల నుంచి 3,000 మందికి పైగా ప్రతినిధులు, నోబెల్ గ్రహీతలు, శాస్త్రవేత్తలు పాల్గొంటున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, అంతరిక్ష సాంకేతికత సహా 11 కీలక అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. యువఆవిష్కర్తలు, స్టార్టప్‌లు, పరిశోధకులను పరిశ్రమలతో అనుసంధానం చేయడానికి, వారి ఆలోచనలకు సరైన వేదికను అందించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) ఒక ప్రకటనలో పేర్కొంది.

తొలుత భారత మహిళల క్రికెట్ జట్టు సాధించిన చారిత్రక విజయం గురించి ప్రస్తావించారు. వారి అద్భుత ప్రదర్శనకు దేశం గర్విస్తోందని, యావత్ జట్టుకు తన అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. అలాగే, నిన్న ఇస్రో ప్రయోగించిన జీశాట్7ఆర్ కమ్యూనికేషన్ ఉపగ్రహం విజయవంతం కావడంపై శాస్త్రవేత్తలను అభినందించారు.



## వారణాసిలో కార్తీక పౌర్ణమికి 'దేవ్‌దీపావళి'

**వారణాసి, నవంబరు 3:** కార్తిక పౌర్ణమి సందర్భంగా పవిత్ర వారణాసి క్షేత్రంలో 'దేవ్ దీపావళి' వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 5న జరగనున్న ఈ ఉత్సవాలకోసం గంగానది తీరంలోని ఘాట్‌లను లక్షలాది దీపాలతో అలంకరించేందుకు సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ వేడుకలు భక్తులకు, పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించనున్నాయి. ఈ ఏర్పాట్ల గురించి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జైవీర్ సింగ్ ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. "దేవ్ దీపావళి కోసం రాష్ట్ర పర్యాటక శాఖ, వారణాసి మహోత్సవ్ సమితి సంయుక్తంగా దాదాపు 10 లక్షల మట్టి ప్రమిదలను సిద్ధం చేశాయి. కాశీలోని ప్రధాన ఘాట్‌లతో పాటు గంగా నది తీరంలోని మరో 20 ప్రాంతాల్లో ఈ దీపాలను వెలిగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. పనుల పర్యవేక్షణ కోసం ప్రతి సెక్టార్‌కు ఒక నోడల్ అధికారిని నియమించినట్లు చెప్పారు. కార్తిక పౌర్ణమి సాయంత్రం వారణాసి నగరం దీపాల వెలుగులతో జిగేల్ మననుందని మంత్రి వివరించారు. ఈసారి వేడుకల్లో భాగంగా పలు ప్రత్యేక ఆకర్షణలు కూడా ఉన్నాయని తెలిపారు. కాశీ కథ పేరుతో 25 నిమిషాల పాటు సాగే 3డీ ప్రొజెక్షన్ మ్యాపింగ్ షోను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీంతో పాటు, కాశీ మరియు అయోధ్యల గొప్పతనాన్ని, చారిత్రక వైభవాన్ని చాటిచెప్పేలా 500 డ్రోన్లతో ఓ ప్రత్యేక ప్రదర్శన, లేజర్ షోకూడా నిర్వహించనున్నట్లు జైవీర్ సింగ్ పేర్కొన్నారు.



## అఫ్గాన్‌లో భూకంపం

### ఏడుగురు మృతి, 150 మందికిపైగా గాయాలు

### భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.3గా నమోదు

**కాబూల్, నవంబరు 3:** అఫ్ఘానిస్థాన్‌లో భారీ భూకంపం సంభవించింది. సోమవారం తెల్లవారుజామున ఉత్తర అఫ్ఘాన్ నగరం మజార్-ఎ-షరీఫ్ సమీపంలో రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 6.3గా నమోదైంది. ఖుల్మ్ సమీపంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ విపత్తు కారణంగా ఏడుగురు ప్రాణాలు కోల్పోగా.. 150 మందికిపైగా గాయపడ్డారని స్థానిక అధికారులు పేర్కొన్నారు. అనేక మంది శిథిలాల్లో చిక్కుకున్నారన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. యుఎస్ జియోలాజికల్ సర్వే వివరాల ప్రకారం.. ఖుల్మ్ సమీపంలో భూకంప కేంద్రం ఉన్నట్లు వెల్లడైంది. 28 కిమీ లోతులో అది కేంద్రీకృతమైఉంది. దీంతో సమీప ప్రాంతాల్లో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఘోర విపత్తు కారణంగా మజార్-ఎ-షరీఫ్ సహా ఇతర ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు సమాచారం. భూకంపం కారణంగా పలు గ్రామాల్లోని ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయని ఆ దేశ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు వెల్లడించారు.

# ఎల్లుండి బీహార్ తొలిదశ పోలింగ్

### నేడు ప్రచారం సమాప్తం

### ప్రధానిమోడీ, హోంమంత్రి అమిత్‌షా, యుపిసిఎం యోగిల విస్తృత ప్రచారం

### మహాకూటమినుంచి రాహుల్, తేజస్వి, ప్రియాంక గాంధీల ఎన్నికల ర్యాలీలు



**పాట్నా, నవంబరు 3:** బీహార్‌లోమొదటి దశ ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగుస్తుండటంతో ప్రధాన రాజకీయ పార్టీల అధినేతలందరూ బీహార్‌లోనే తిష్టవేసారు. ప్రధానిమోడీ ఓవైపు,యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్, హోంమంత్రి అమిత్‌షాలు బీహార్‌లో విస్తృతంగా ప్రచారంచేస్తూ గూండారాజ్యానికి తెరదించాలని, ఇండియా కూటమికి ఓటువేస్తే బీహార్‌లో మళ్లీ గూండారాజ్ తప్పదంటూ తమతమ ప్రచారాల్లో ఆర్జెడి, కాంగ్రెస్‌లే లక్ష్యంగా ప్రచారంచేసారు. ఎన్డీయే వికసిత్ లక్ష్యంతో వెళుతుంటే ఆర్జెడి కాంగ్రెస్ పార్టీలు వినాశ్ సిద్ధాంతమే లక్ష్యంగా వెళుతున్నాయన్నారు. ఎన్డీయే పాండవుల మాదిరిగా ఐక్యంగా ఉంటే కౌరవుల తరహాలో మహాకూటమి ముక్కలు చెక్కలయిందని అన్నారు. అలాగేయూపి సిఎం కూడా తన ప్రచారాన్ని హోరెత్తించారు. ఆర్జెడి, కాంగ్రెస్‌ల మాఫియా సామ్రాజ్యాలను తాము బుల్‌డోజర్‌తో అణిచివేసామని బీహార్‌లో కూడా అదే పునరావృతం అవుతుందని జోస్యం చెప్పారు. ఈనెల 14వ తేదీతో బీహార్‌లో రాహుల్, లాలూ శకం ముగుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ పార్టీలకు ఓటువేస్తే జంగిల్ రాజ్ తథ్యమని ఓటర్లు అప్రమతంగా ఉండాలంటూ మోడీ హితవు పలికారు. ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ భాగల్పూర్‌లో ఎన్నికల ర్యాలీలో మాట్లాడారు. ఇక విపక్ష పార్టీలపరంగా ఎఐసిసి నాయకుడు, రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీ, ఆర్జెడి చీఫ్ లాలూప్రసాద్ యాదవ్, ఆయన తనయుడు తేజస్వియాదవ్‌లు తమతమ ప్రచారంతో ఎన్డీయే కూటమిపై విమర్శలహోరుతో దూసుకుపోతున్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ ఎంపి ప్రియాంకగాంధీ కూడా రాష్ట్రంలోని సోన్‌బర్సా, రోసేరా, లఖిసరాయ్ నియోజకవర్గాల్లో ర్యాలీలు నిర్వహించారు. ప్రధానిమోడీ అయితే ప్రతి నియోజకవర్గాన్ని చుట్టివచ్చే ర్యాలీలు చేస్తున్నారు. అయితే సోమవారం నిర్వహించిన ర్యాలీల్లో ఆయన వెంట సిఎం నితీష్‌కుమార్ పాల్గొనలేదు. ఆయన వేరొక ప్రాంతంలోప్రచారంలో నిమగ్నం అయ్యారు. మోడీవెంట కేంద్ర మంత్రి రాజీవ్‌రంజన్ కొనసాగారు.

**తొలివిడత 121 నియోజకవర్గాల్లో...**

అయితే తొలివిడతగా 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో పోలింగ్ జరుగుతోంది. మిగిలిన 122 సీట్లకు రెండోదశలో జరుగుతుంది. మొత్తం 243 నియోజకవర్గాల్లో 203 జనరల్‌సీట్లు, 38ఎస్సీలకు, ఎస్టీలకు రెండు రిజర్వుచేసారు. మొదటి విడత ఎన్నికల్లోనే డిప్యూటి సిఎంలు సామ్రాట్ చౌదరి, విజయ్‌కుమార్ సిన్హా, ఆర్జెడి నేత తేజస్వియాదవ్‌లు ఉన్నారు. మొత్తం 1314 మంది అభ్యర్థులు మొదటి విడత పోలింగ్‌లో పోటీలో ఉన్నారు. తేజస్వితోపాటు ఆయన సోదరుడు తేజ్‌ప్రతాప్ యాదవ్, జెడియు చీఫ్ ఉమేష్ కుష్వాహా, ఆర్జెడి నేత భోలా యాదవ్‌లు కూడా తొలివిడతలోనే ఉన్నారు. ముజఫరాపూర్; కుర్హని, మహ్‌నార్, బహాదుర్‌జిల్లాల్లోనే అత్యధికసంఖ్యలో అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కుర్హని, ముజఫర్‌పూర్‌లలో 20 మంది చొప్పున నిలుచుంటే అలౌలి, పర్బట్టా జిల్లాలో తక్కువ మంది అంటే కేవలం ఐదుగురుచొప్పున పోటీలో ఉన్నారు. పాట్నాలో 149 మంది అభ్యర్థుల ఎన్నికల బరిలో నిలుచున్నారు. అయితే తొలివిడతలోనే కొన్ని హైప్రొఫైల్ నియోజకవర్గాలున్నాయి. తారాపూర్ అంటే ముంగేర్ జెడియుకు పట్టున్నప్రాంతం. రాఘోపూర్‌లో తేజస్వి మళ్లీ ఎన్నికవుతామన్న ధీమాతో ఉన్నారు. మహువాలో తేజ్‌ప్రతాప్‌యాదవ్ జనశక్తి జనతాదళ్‌నుంచి పోటీలోఉన్నారు. ఆలినగర్‌లో బిజెపి మైథిలి ఠాకూర్, ఆర్జెడి వినోద్‌మిశ్రాల మధ్య పోటీ ముఖాముఖి జరుగుతోంది. హసన్‌పూర్‌లో జెడియు రాజ్ కుమార్‌రే ఆర్జెడి మాలా పుష్పమ్‌తో పోటీలో ఉన్నారు.

## డిజిటల్ అరెస్టులపై సుప్రీం సీరియస్

### సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపాలి

### నిందితులకు కఠిన శిక్షలు విధించాలి

### త్రిసభ్య ధర్మాసనం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, నవంబరు 3:** డిజిటల్ అరెస్టు కేసుల్లో కఠిన శిక్షలు విధించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. చాలా విస్తృత స్థాయిలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అత్యున్నత న్యాయస్థానం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. డిజిటల్ అరెస్టు కేసుల్లో బాధితులు సుమారు 3,000 కోట్లు కోల్పోవడం పల్ల కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సైబర్ నేరాలకు పాల్పడుతున్న మోసగాళ్లు తమకు తాము భద్రతా సిబ్బందిగా, కోర్టు అధికారులుగా, ప్రభుత్వాధికారులుగా పరిచయం చేసుకుని బెదరింపులకు పాల్పడుతున్నారు. ఆడియో, విడియో కాల్స్‌తో బాధితులను పీడిస్తున్నారు. బాధితులను కాల్స్‌తో బందీలుగా చేసి.. డబ్బులు చెల్లించేలా వత్తిడి తెస్తున్నారు. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, ఉజ్వల్‌భుయాన్, జోయ్‌మాలా బాగ్చిలతో కూడిన ధర్మాసనం డిజిటల్ అరెస్టు కేసులపై విచారణ చేపట్టింది. ఈ విషయంలో కోర్టుకు సూచనలు చేసేందుకు అమికస్ క్యూరీని నియమించారు. కేంద్ర హోం శాఖ, సిబిఐ సమర్పించిన రెండు నివేదికలను కోర్టు పరిశీలించింది. డిజిటల్ అరెస్టుతో బాధితుల నుంచి సైబర్ నేరగాళ్లు సుమారు మూడు వేల కోట్ల వసూల్ చేయడం షాకింగ్‌గా ఉందని, బాధితుల్లో సీనియర్ సిటిజన్లు ఉన్నారని, ఒకవేళ ఇలాంటి కేసుల్లో కఠినమైన ఆదేశాలు ఇవ్వకుంటే, ఈ సమస్య మరింత జఠిలంగా తయారు అవుతుందని ధర్మాసనం పేర్కొన్నది. జుడిషియల్ ఆదేశాలతో భద్రతా ఏజెన్సీలను బలోపేతం చేయాలని, ఇలాంటి కేసులపై ఉక్కుపాదం మోపాలని కోర్టు పేర్కొన్నది. డిజిటల్ అరెస్టుల కేసులపై ఈ నెల 10న మళ్లీ విచారణ చేపట్టనున్నారు. అమికస్ క్యూరీ ఇచ్చే సూచనల ఆధారంగా కొన్ని ఆదేశాలు ఇవ్వనున్నట్లు కోరింది. సిండికేట్ నేరగాళ్ల ఆఫ్‌షోర్ లోకేషన్ల నుంచి ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నారని సిబిఐ తన రిపోర్టులో చెప్పినట్లు జస్టిస్ కాంత్ పేర్కొన్నారు. కేంద్రం, సిబిఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. కేంద్ర హోంశాఖకు చెందిన సైబర్ డివిజన్ ఇలాంటి కేసుల్ని డీల్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



## వైరల్ అవుతున్న విడియోలపై ఎరికా కిర్క్ ఉద్వేగం

**వాషింగ్టన్, నవంబరు 3:** తన భర్త, ప్రముఖ కన్జర్వేటివ్ కార్యకర్త చార్లీ కిర్క్ హత్యకు గురైన తర్వాత తీవ్రమైన మీడియా నిఘాలో ఉన్న ఆయన భార్య ఎరికా కిర్క్ తొలిసారి బహిరంగంగా స్పందించారు. అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్‌ను ఆలింగనం చేసుకున్న వీడియో వైరల్ అయిన నేపథ్యంలో, ఆమె తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. నా ప్రతి కదలికను, ప్రతి చిరునవ్వును, ప్రతి కన్నీటి చుక్కను కెమెరాలు విశ్లేషిస్తున్నాయి అంటూ తన ఆవేదనను వ్యక్తం చేశారు. యూఎస్ఏ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఇంటర్వ్యూలో ఎరికా మాట్లాడుతూ తన భర్త హత్య కేసు విచారణను కూడా కెమెరాల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. నా భర్తను హత్య చేసినప్పుడు అక్కడ కెమెరాలు ఉన్నాయి. మేము దుఃఖంలో ఉన్నప్పుడు నా కుటుంబం, స్నేహితులపై కెమెరాలు ఉన్నాయి. ఇప్పుడు నాపై కెమెరాలు ఉన్నాయి. అలాంటప్పుడు కోర్టులో ఎందుకు ఉండకూడదు దాచడానికి ఏమీ లేదు. నిజమైన చెడు అంటే ఏమిటో అందరూ చూడాలని ఆమె అన్నారు. మిసిసిపీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్‌ను వేదికపైకి ఆహ్వానిస్తూ, చార్లీ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు, కానీ వాన్స్‌లో నా భర్త పోలికలు కొన్ని చూస్తున్నానని వ్యాఖ్యానించారు. అనంతరం వేదికపైకి వచ్చిన వాన్స్‌ను ఆమె ఆలింగనం చేసుకున్నారు. ఈ సమయంలో ఆమె వాన్స్ జుట్టులోకి వేళ్లు పోనివ్వగా, అతను ఆమె నడుముపై చేతులు వేయడం వివాదానికి దారితీసింది.

# పాకిస్థాన్ అణ్వాయుధాలను పరీక్షిస్తోంది!

### • అదే బాటలో రష్యా, చైనా, ఉత్తర కొరియాలు • బాంబు పేల్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్, నవంబరు 3:** మూడు దశాబ్దాల విరామం తర్వాత అణ్వాయుధ పరీక్షలను తిరిగి ప్రారంభించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచానికి కొత్త సవాల్ విసిరారు. ఈ నిర్ణయాన్ని సమర్థించుకున్న అగ్ర రాజ్యాధినేత తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయన్నారు. ఈ జాబితాలో పాకిస్థాన్ కూడా ఉందని పేర్కొన్నారు. సిబిఎస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలను నిర్వహిస్తున్నాయి. కానీ, వీటి గురించి ఆయా దేశాలు మాట్లాడట్లేదు. మేం అలాకాదు. ఏదైనా బహిరంగంగానే చేస్తాం. దాని గురించి మాట్లాడతాం. ఇన్నాళ్లూ ఎన్ని దేశాలు అణు పరీక్షలు చేపట్టినా మేం వాటి జోలికి వెళ్లలేదు. ఇకపై అలా మిగిలిపోవాలనుకోవట్లేదు. ఇతర దేశాల మాదిరిగానే మేమూ ఈ పరీక్షలు నిర్వహిస్తాం' అని ట్రంప్ వెల్లడించారు. 'రష్యా, చైనా వద్ద చాలా అణ్వాయుధాలు ఉండి ఉంటాయి. మా దగ్గర అంతకంటే ఎక్కువే ఉన్నాయి. మా వద్ద ఉన్న అణ్వాయుధాలతో ఈ ప్రపంచం మొత్తాన్ని 150 సార్లు పేల్చేయొచ్చు. కానీ,అణ్వస్త్రాల నిరాయుధీకరణ గురించి రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో చర్చించా' అని ట్రంప్ తెలిపారు. అమెరికా అణ్వాయుధ పరీక్షలకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమైనట్లు ఆయన పేర్కొన్నారు.

**చైనా, రష్యాలతో ముప్పే**

చైనాతో వాణిజ్య సంధికి పిలుపునిచ్చిన కొన్ని రోజులకే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చైనాకు అమెరికా కూడా ఒక ముప్పేనని ఆయన అంగీకరించారు. ఇరు దేశాల మధ్య తీవ్రమైన పోటీ ఉందని, ఒకరినొకరు నిరంతరం గమనించుకుంటూ ఉంటారని తెలిపారు. అమెరికా పవర్‌గ్రిడ్, నీటి సరఫరా వ్యవస్థల్లోకి చైనా చొరబడిందని, మేధో సంపత్తిని దొంగిలిస్తోందని అమెరికన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ఆరోపిస్తున్న నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మీడియా ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "మేము కూడా వాళ్లకు ముప్పుగా మారాం. మేం వాళ్లనుఎప్పుడూ గమనిస్తుంటాం,వాళ్లు మమ్మల్ని ఎప్పుడూ గమనిస్తుంటారు అనిఅన్నారు. అయితే, చైనాతో ఘర్షణ పడటం కంటే కలిసి పనిచేస్తేనే ఇరుదేశాలు మరింత బలంగా ఎదుగుతాయని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. చైనా అణ్వాయుధ సామర్థ్యంగురించి ట్రంప్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చైనా తన అణ్వాయుధాలను చాలా వేగంగా తయారు చేస్తోందని, రాబోయే ఐదేళ్లలో ఈ విషయంలో రష్యా, అమెరికాలతో సమానంగా నిలుస్తుందని అంచనా ఆర్థికంగా చైనాపై తాము పైచేయి సాధిస్తున్నామని చెబుతూనే, రేర్‌ఎర్త్ మినరల్స్ (అరుదైన భూమిఖనిజాలు) విషయంలో చైనాకు తమపై ఆధిపత్యం ఉందని ట్రంప్ అంగీకరించారు. ఆరేళ్లతర్వాత గతనెల 30న దక్షిణ కొరి యాలో జరిగిన 32వ అపెక్ ఆర్థిక మంత్రుల సమావేశంలో ఇరు దేశాల నేతలు ముఖాముఖిగా భేటీ అయిన విషయం తెలిసిందే.

**తైవాన్ జోలికెళ్లొద్దు: చైనాకు ట్రంప్ వార్నింగ్**

అమెరికా-చైనా ఇటీవల తమ ట్రేడ్ వార్‌కు కాస్త బ్రేక్ ఇచ్చాయి. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొద్దిమేర సద్దుమణిగాయని అనుకుంటున్నలోపే.. అగ్రదేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాకు వార్నింగ్ ఇచ్చారు. తైవాన్‌పై దాడిచేస్తే ఎలాంటి పరిణామాలు ఉంటాయో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తోపాటు ఆ దేశ ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు. ఇటీవల దక్షిణ కొరియా వేదికగా డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్ మధ్య జరిగిన భేటీ యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిన సంగతి తెలిసిందే. జిన్‌పింగ్‌తో భేటీ తర్వాత ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనాపై టారిఫ్‌లను 10శాతం మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. అరుదైన ఖనిజాలకు సంబంధించిన సమస్యకూడా పరిష్కారమైందని చెప్పారు. చైనానుంచి అమెరికా అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు. త్వరలోనే వాణిజ్య ఒప్పందం కూడా కుదరనున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఇలా సానుకూల ప్రకటనలు చేసిన ఆయన ఇప్పుడు వార్నింగ్‌లు ఇవ్వడం గమనార్హం.

**నైజీరియాపై అమెరికా సైనిక చర్య: అధ్యక్షుడు ట్రంప్ సంకేతాలు**

నైజీరియాలో క్రైస్తవులపై జరుగుతున్న దాడుల విషయంలో అమెరికా తీవ్రంగా స్పందించింది. ఆ దేశంలో ఉగ్రవాదులను ఏరివేసేందుకు అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. వైమానిక దాడులులేదా నేరుగా అమెరికా బలగాలను పంపే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన కీలక సంకేతాలు ఇచ్చారు. ఫ్లోరిడా నుంచి వాషింగ్టన్‌కు ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో తిరిగి వస్తూ ఆయన విలేకరులతో మాట్లాడారు. నైజీరియాలో రికార్డు స్థాయిలో క్రైస్తవులను చంపుతున్నారని, దీనిని తాము ఎంతమాత్రం అనుమతించబోమని అన్నారు. నా మదిలో చాలా ప్రణాళికలుఉన్నాయి. వారు నైజీరియాలో క్రైస్తవులను రికార్డు సంఖ్యలో హత్య చేస్తున్నారు. అలా జరగడానికి మేము అంగీకరించమని ట్రంప్ స్పష్టం చేశారు. ఇటీవల అమెరికా విదేశాంగ శాఖ విడుదల చేసిన ప్రత్యేక ఆందోళన కలిగించే దేశాల జాబితాలో నైజీరియాను చేర్చినట్లు ట్రంప్ గుర్తుచేశారు. నైజీరియా ప్రభుత్వం క్రైస్తవులను రక్షించడంలో విఫలమైతే కఠిన చర్యలు తప్పవని గతంలోనే ఆయన హెచ్చరించారు. అమెరికా హెచ్చరికలపై నైజీరియాకూడా స్పందించింది. ఇస్లామిక్ ఉగ్రవాదులతో పోరాడటానికి అమెరికా సహాయాన్ని స్వాగతిస్తామని, అయితే తమ దేశ ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కోరింది. నైజీరియాలో క్రైస్తవులు, ముస్లింల మధ్య ఘర్షణలు 1950ల నుంచి కొనసాగుతున్నాయి. ముఖ్యంగా 2009 తర్వాత బోకో హరామ్, ఫులానీ పశువుల కాపరులు వంటి రాడికల్ ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థలు క్రైస్తవ గ్రామాలను, చర్చిలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నాయి. నివేదికల ప్రకారం, ఈ హింసలో ఇప్పటివరకు 45వేల మందికి పైగా క్రైస్తవులు ప్రాణాలు కోల్పోగా, వేలాది చర్చిలు ధ్వంసమయ్యాయి.

## సంక్షిప్తంగా..

### భూ అయస్కాంత తయారీలో చైనాకు చెక్‌పెడుతున్న భారత్!

**న్యూఢిల్లీ,నవంబరు 3:** అరుదైన భూఅయస్కాంతాల (రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్) తయారీ రంగంలో చైనా ఆధిపత్యానికి గండికొట్టేందుకు భారత్ ఓ భారీ వ్యూహంతో ముందుకొస్తోంది. ఈ కీలక రంగంలో తయారీని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన పథకం విలువను మూడు రెట్లు పెంచి రూ. 7వేల కోట్లకు అంటే సుమారు 788 మిలియన్ డాలర్లు పైగా చేయాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన వనరులు, రక్షణ పరికరాల తయారీలో రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ అత్యంత కీలకం. ప్రపంచవ్యాప్తంగా 90 శాతం రేర్ ఎర్త్ ఖనిజాలను చైనాయే ప్రాసెస్ చేస్తోంది. ఇటీవల ఏప్రిల్‌లో ఈ ఖనిజాల ఎగుమతులపై చైనా ఆంక్షలు కఠినతరం చేయడంతో ప్రపంచ దేశాలు ఉలిక్కిపడ్డాయి. ఈ అంశంపై తుది కేటాయింపులు మారే అవకాశం ఉన్నప్పటికీ, తాజా ప్రతిపాదన ప్రస్తుతం కేబినెట్ ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. అయితే, చైనా ఆధిపత్యాన్ని సవాలు చేయడం భారత్‌కు అంత సులభం కాదు. నిధుల కొరత, సాంకేతిక నైపుణ్యం లేకపోవడం, రేడియోధార్మిక వ్యర్థాల కారణంగా తవ్వకాలలో పర్యావరణ సమస్యలు వంటి సవాళ్లు ఎదురుకానున్నాయి. ఇదే సమయంలో, మ్యాగ్నెట్ రహిత ప్రత్యామ్నాయాలపై కూడా భారత్ దృష్టి సారిస్తోంది. రేర్ ఎర్త్ ఖనిజాలపై ఆధారపడటాన్ని తగ్గించే సింక్రోనస్ రిలక్టెన్స్ మోటార్ల సాంకేతికతపై పరిశోధనలకు ప్రభుత్వం నిధులు సమకూరుస్తోంది. దేశీయంగా తవ్వకాలు లాభసాటిగా లేకపోవడంతో, విదేశాల్లో మైనింగ్ భాగస్వామ్యాల కోసం ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయత్నిస్తున్నాయి.

### రష్యా అణుసంపత్తి శరవేగంగా పెంపు

**మాస్కో, నవంబరు 3:** ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తూ రష్యా తన అణ్వాయుధ సంపత్తిని నిరంతరం పెంచుకుంటోంది. తాజాగా ఖబరోవ్స్క్ అనే మరో శక్తిమంతమైన అణు జలాంతర్గామిని జలప్రవేశం చేయించింది. దీనికి అత్యంత ప్రమాదకరమైన పోసిడాన్ అణు డ్రోన్‌ను అమర్చడం గమనార్హం. యావత్ తీరప్రాంత దేశాలను నాశనం చేయగల సామర్థ్యం దీనికి ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. అందుకే దీనిని 'డూమ్స్‌డే క్షిపణి' అని పిలుస్తున్నారు. ఈ జలాంతర్గామిని రష్యా రక్షణ మంత్రి ఆండ్రీ బెలౌసోవ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నేవీ చీఫ్ అడ్మిరల్ అలెగ్జాండర్ మొయిసేవ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెలౌసోవ్ మాట్లాడుతూ, రష్యాకు ఇది చాలా ముఖ్యమైన రోజని, ఈ కొత్త జలాంతర్గామి దేశ సముద్ర సరిహద్దుల భద్రతను మరింత పటిష్ఠం చేస్తుందని తెలిపారు. రష్యా ఇటీవల నీటి అడుగున పోసిడాన్ డ్రోన్‌ను విజయవంతంగా పరీక్షించింది. ఇది సాధారణ జలాంతర్గాములు, టార్పెడోల కంటే చాలా వేగంగా ప్రయాణించగలదు. ఖబరోవ్స్క్‌తరగతి జలాంతర్గాములపై మోహరించడానికే రష్యా ఈ డ్రోన్లను ప్రత్యేకంగా అభివృద్ధి చేసింది. ఈ జలాంతర్గామిని రూబిన్ సెంట్రల్ డిజైన్ బ్యూరో ఆఫ్ మెరైన్ ఇంజినీరింగ్ రూపొందించింది. భారత నౌకాదళానికి చెందిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్యను పునరుద్ధరించిన సెవ్‌మాష్ షిప్‌యార్డ్ లోనే దీనిని నిర్మించారు. గత 12 రోజుల్లో రష్యా మూడు ప్రధాన ఆయుధ పరీక్షలు నిర్వహించడం గ్లోబల్ భద్రతా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### కరూర్ తొక్కిసలాటపై దర్యాప్తు ముమ్మరంచేసిన సిబిఐ

**కరూరు, నవంబరు 3:** తమిళనాడును కుదిపేసిన కరూర్ తొక్కిసలాట ఘటనపై సిబిఐ దర్యాప్తును వేగవంతంచేసింది. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టివికె) పార్టీ నిర్వహించిన సభలో జరిగిన ఈ దుర్ఘటనకు సంబంధించి 306 మందికి విచారణకు హాజరుకావాలంటూ సమన్లు జారీ చేసింది. సెప్టెంబర్ 27న వేలుచామీపురంలో జరిగిన ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోగా, 60 మందికి పైగా తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి, ఏడీజీపీలు సోనాల్ మిశ్రా, సుమిత్ శరణ్ పర్యవేక్షణలో సీబీఐ అధికారి ప్రవీణ్ కుమార్ నేతృత్వంలోని బృందం కరూర్‌లో తాత్కాలిక క్యాంపు ఏర్పాటు చేసుకుని విచారణ జరుపుతోంది. ఇప్పటికే ఘటనా స్థలాన్ని పలుమార్లు పరిశీలించిన అధికారులు, ప్రత్యక్ష సాక్షులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

సభ జరిగిన ప్రదేశం సామర్థ్యాన్ని కొలిచి, నిర్వాహకులు భద్రతా నిబంధనలు పాటించారా లేదా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా దుకాణాలు నడిపే వ్యాపారులను కూడా విచారించి వారి వాంగ్మూలాలను నమోదు చేసుకున్నారు. ఈ ఘటనలో నిర్వాహకుల వైఫల్యం, జన నియంత్రణలో లోపాలు, సభకు అనుమతులు ఇచ్చిన అధికారుల పాత్రపై సీబీఐ ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా సభకు అనుమతి ఇచ్చిన కరూర్ సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మణివన్నన్‌ను అధికారులు రెండు గంటలకు పైగా ప్రశ్నించారు. భద్రతా ఏర్పాట్లు, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడం, నిర్వాహకులతో సమన్వయం వంటి అంశాలపై ఆయన్ను విచారించారు. తాజాగా సిబిఐ 306 మందికి సమన్లు జారీ చేసింది.

# చిన్న తిరుపతి దుర్ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

## మాజీ మంత్రులు బొత్స, కృష్ణదాస్, సీతారాం, సీదిరి డిమాండ్

**శ్రీకాకుళం, నవంబరు 3 ప్రభాతవార్త:** చిన్న తిరుపతి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జరిగిన ఘోరాన్ని సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల వంతున ఆర్థిక సహాయం అందించాలని వైసీపీ నాయకులు, శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, ధర్మాన కృష్ణదాస్, తమ్మినేని సీతారాం, సీదిరి అప్పలరాజు, కుంభా రవిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇవి కేవలం ప్రభుత్వ హత్యలేనని, ఏకాదశి సందర్భంగా భక్తుల సౌకర్యార్థమై ప్రభుత్వం నుంచి కనీస భద్రతా ఏర్పాట్లు చేయలేని చేత కాని ప్రభుత్వమని విమర్శించారు. మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎంత ఆర్థిక సహాయం చేసినా అది తక్కువేనని, ప్రభుత్వం తన బాధ్యతగా కనీసం ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షల వంతున అందజేయకుంటే మృతుల కుటుంబాల తరఫున పోరాడతామన్నారు. అసలు పోలీస్ వ్యవస్థ ఉందా?లేదా? ఉంటే ఏకాదశి పర్వ దినాన ప్రముఖ దేవాలయాల్లో ముందస్తు బాధ్యతగా ప్రజల ప్రాణాలు కాపాడే భద్రత ఏర్పాటు చేయాల్సిన బాధ్యత వారికి లేదా అని ప్రశ్నించారు. అనంతరం కాశీబుగ్గలోని శ్రీ వెంకటేశ్వర దేవాలయాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పి.విక్రాంత్, నర్తు రామారావు, వైసీపీ నాయకులు గొర్లె కిరణ్ కుమార్, మామిడి శ్రీకాంత్, పేరాడ తిలక్, అంధవరపు సూరి బాబు, చింతాడ రవికుమార్, కొర్ల భారతి, దువ్వాడ వాణి, పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



చిన్న తిరుపతి ఘటనలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న మాజీ మంత్రులు

**మృతుల కుటుంబాలకు వైసీపీ తరపున రూ.2 లక్షల చొప్పున సాయం:** మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఒక్కో కుటుంబానికి రూ.2లక్షల చొప్పున సాయం అందజేస్తామని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వెల్లడించారు. శ్రీకాకుళంలోని జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆదివారం ఆయన పరామర్శించారు. చికిత్స అందించిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి: మాజీ మంత్రి అనే హోదాను పక్కన పెట్టి, స్వయంగా అంబులెన్స్ ఎక్కి వైద్యుడిగా మానవతామూర్తిగా ప్రజాసేవకుడిగా ఆయన స్పందించిన తీరు అందరినీ కదిలించింది. ఆ సమయంలో ఉన్న ప్రజలు, పోలీసులు, వైద్య సిబ్బంది ఆయన చొరవను ప్రశంసించారు. ఇలాంటి సేవాభావం ప్రజాప్రతినిధుల్లో స్ఫూర్తి దాయకం ఎంతో అవసరమని స్థానికులు పేర్కొన్నారు.

**కొవ్వొత్తుల ర్యాలీ:** కాశీబుగ్గ వెంకటేశ్వరుని ఆయలంలో తొమ్మిదిమంది మృతి చెందడంపట్ల వారి ఆత్మకుశాంతి కలగాని వైసీపీనేతలు ఆదివారం శ్రీకాకుళం నగరంలోని ఏడురోడ్ల జంక్షన్ వరకు ఈ ర్యాలీ సాగింది.



## తిరుపతి మంగళంలో చిరుతదాడి

**తిరుపతి,నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతికి సమీపంలోని మంగళం అటవీప్రాంతానికి దగ్గరగా ఉంటున్న ఓ ఇంటిలోని కుక్కపై చిరుతపులి దాడిచేసి చంపింది. సోమవారం తెల్లవారుజామున అడవిలోంచి చిరుతపులి రావడంతో ఆ ఇంటిలోని సిసికెమెరాల్లో నమోదైంది. మంగళం భూపాల్‌హౌసింగ్ కాలనీలో ఉంటున్న ఓ ఇంటివద్దకు వచ్చి కుక్కను వేటాడి చంపింది. ఈ దృశ్యాలు గమనించిన ఇంటి సభ్యులు అటవీఅధికారులకు సమాచారం అందించారు. అటవీఅధికారులు అటవీప్రాంతంలో చిరుత సంచారంపై పాదముద్రలు గమనించారు. ఈ ప్రాంతంలో ప్రజలు ఉదయం వరకు అడవిలోకి వెళ్లరాదని, ఒంటరిగా బహిర్భూమికి అడవికి వెళ్ళొద్దని అటవీ అధికారులు హెచ్చరించారు. చిరుత పట్టివేయడానికి బోన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.



## తప్పుడు కేసు కొట్టివేత

**తిరుపతి,నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు 2021లో జరిగిన ఎన్నికల్లో 2వ డివిజన్‌లో అక్రమాలు, దొంగ ఓట్లుపై నిరసన తెలిపి, అక్రమ ఓట్లపై పోలీసులకు పట్టిస్తే ఫిర్యాదిదారులపై వైసిపి నేతలు నమోదుచేయించిన కేసులు తిరుపతి కోర్టులో సోమవారం కొట్టివేశారు. బ్యాలెట్ స్లిప్పులు ఓటర్లయిన వైసిపి కార్యకర్తల చేతికి అందించిన అప్పటి అధికార పార్టీ నేతలు ఏకంగా అప్పటి కార్పొరేటర్ అభ్యర్థి జి.శాంతిపై, టిడిపి రాష్ట్ర నేత నరసింహయాదవ్‌పై, రామయాదవ్‌పై పోలీసులతో కేసు నమోదు చేయించారు. అంతేగాక అబద్ధపు ఆరోపణలతో కేసు నమోదు చేయించిన పోలీసులకు, వైసిపి నేతలకు ఈకేసులో నాలుగేళ్ళుగా విచారణ జరిగి సోమవారం తిరుపతి న్యాయస్థానంలో న్యాయం గెలిచి కేసు కొట్టివేయడం వైసిపి నేతలు భూమన కరుణాకర్‌రెడ్డి, అభినయ్‌రెడ్డికి చెంపపెట్టులాంటిదని నరసింహ యాదవ్ తెలిపారు.

# రాష్ట్ర స్థాయి లాన్‌టెన్నిస్ జట్టు ఎంపిక

**శ్రీకాళహస్తి,నవంబరు3 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలోని విక్రమ్ టెన్నిస్ అకాడమి మైదానంలో మూడు రోజుల పాటు 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ పోటీలను నిర్వహించారు. సోమవారం సాయంత్రం మూడు విభాగాల్లో రాష్ట్ర జట్టులను ఎంపిక చేసారు. వీరు వచ్చేనెల న్యూడిల్లిలో జరిగే జాతీయ స్థాయి లాన్ టెన్నిస్ పోటీల్లో పాల్గొంటారు. శ్రీకాళహస్తిలో మూడు రోజుల పోటీల నిర్వహణకు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సహాకరించారు. గెలుపొందిన విజేతలకు రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ అభినందిస్తూ అవార్డులను అందించారు. మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన పోటీల్లో రాష్ట్రంలోని 13జిల్లాల నుంచి390 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇక్కడ బాలురు, బాలికలకు విడి విడిగా అండర్ 14,17,19 లను నిర్వహించారు. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కిషోర్ పర్యవేక్షణలో నిర్వహించారు.

వివిధ జిల్లాల నుంచి ఎంపికైన విజేతలు వీరే: శ్రీకాళహస్తిలో మూడు రో జుల పాటు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు సంబంధించిన వివరాలను ప్రకటించారు.



జాతీయ జట్టుకుఎంపికైన క్రీడాకారులతో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్

అండర్ 19 బాయ్స్ విభాగంలో విన్సెంట్ (గుంటూరు) తనీష్‌రెడ్డి(చిత్తూరుజిల్లా) మహమ్మద్ ఫసల్( తూర్పు గోదావరి జిల్లా). జీవన్, సాయిరెడ్డి (చిత్తూరు)లు ఎంపిక అయ్యారు.

కాగా బాలికల విభాగంలో జోషిత(గుంటూరు) మనస్వి(చిత్తూరు), శేష సాయి (తూర్పు గోదావరి)తన్వి (చిత్తూరు)లను ఎంపికైనట్లు ప్రకటించారు. 17సంవత్సరాల లోపు బాలుర విభాగంలో సాయి శంకర్ (చిత్తూరు)యశ్వంత్,(వైజాగ్) ఇషాంత్(కృష్ణా)లు దిశాంత్ (గుంటూరు)ఎంపికయ్యారు. బాలికల విభాగానికి సంబందించి సాయి సంజానారెడ్డి, సుహేరా అన్సారి (చిత్తూరు)సులోచన (తూర్పు గోదావరి)జోషి ప్రియారెడి (అనంత)ఆరూష (వైజాగ్)లను ఎంపికయ్యారు.

14 సంవత్సరాల లోపు విభాగంలో శంకర్ ప్రదీప్(తూర్పు గోదావరి) సాయి శౌర్యకృష్ణ; రేవంత్‌రిషి (వైజాగ్) హర్షవర్ధన్ (గుంటూరు) సాయి (తూర్పు గోదావరి), బాలికల విభాగంలో తేజస్వీ(తూర్పు గోదావరి)లాస్యప్రియ (గుంటూరు), యాంజలీన(తూర్పు గోదావరి)సూక్తి శ్రీ, సత్యశ్రీ(గుంటూరు)లు విజేతలుగా నిలిచారని కార్యదర్శి కిషోర్ ప్రకటించారు.



## పదవీ విరమణ రైల్వే సిబ్బందికి రూ.5.34 కోట్ల బకాయిల చెల్లింపు

**గుంతకల్లు రైల్వే, నవంబరు 3 ప్రభాతవార్త:** రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ లో అక్టోబర్ నెలలో ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి డి ఆర్ ఎం చంద్రశేఖర్ గుప్తా రూ.5.34 కోట్ల రూపాయల బకాయిలను చెల్లించారు. స్థానిక డి ఆర్ ఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గుంతకల్లు రైల్వే డివిజన్ అభివృద్ధిలో కార్మికులు అందించిన సేవలను ఆయన ప్రశంసించారు. అక్టోబర్ నెలలో 13మంది సాధారణ ఉద్యోగ విరమణ గావించగా, మరో ఆరుగురు అధర్ నాన్ నార్మల్ రిటైర్మెంట్ (ఓఎన్ఆర్) చేశారన్నారు. మొత్తంగా ఉద్యోగవిరమణ చేసిన 19 మందికి రూ.5 కోట్ల,34 లక్షల, తొమ్మిది వేల,678 రూపాయల బకాయిలను లబ్దిదారులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ డిఎఫ్ఎం వై.సందీప్, డిపిఓహెచ్ ఎల్ఎన్ ప్రసాద్, ఏపిఓ కల్పన, ఏడిఎఫ్ఎం శివ ప్రసాద్, పర్సనల్, అకౌంట్స్ విభాగాలసిబ్బంది, లబ్దిదారులు, వారికుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## రీసెట్ ప్రవేశాలకు పరీక్షలు ప్రారంభం

**తిరుపతి,నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉన్నతవిద్యామండలి ఆధ్వర్యంలో తిరుపతి పద్మావతిమహిళ విశ్వవిద్యాలయం తెలుగురాష్ట్రాల్లో అన్ని విశ్వవిద్యాలయాల పరిధిలో పిహెచ్‌డి కోర్సుల్లో ప్రవేశాలకు రీసెట్ 2024-25 పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు సోమవారం ఉదయం నుండి 7వతేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లో 13 కేంద్రాల్లో, తెలంగాణాలో ఒక కేంద్రంలో పరీక్షలు జరుగుతాయని పద్మావతిమహిళ వర్సిటీ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ తెలిపారు. రాష్ట్రఉన్నతవిద్యామండలి ఛైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి ఆదేశాలతో చేపడుతున్న రీసెట్ ప్రవేశపరీక్షలకు 5,752మంది అభ్యర్థులు దరఖాస్తుచేసుకున్నారన్నారు. సోమవారం నుండి 7వతేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం రెండువేళల్లో ఈ పరీక్షలు జరుగుతాయని, మొత్తం 65కోర్సులకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. తిరుపతి నుండి ఆన్‌లైన్‌లో పద్మావతి మహిళ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య రజనీరెడ్డి, రీసెట్ కన్వీనర్ ఆచార్య ఉష, కోకన్వీనర్ ఆచార్య జాన్‌సుష్మ పర్యవేక్షించారు. తొలిరోజు 90శాతం హాజరయ్యారని చెప్పారు.

## శ్రీకాకుళం-బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, నవంబరు 3, ప్రభాతవార్త:** సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని యాత్రికుల సౌకర్యార్థం రైల్వేశాఖ శ్రీకాకుళం బెంగళూరు కంటోన్మెంట్‌శ్రీకాకుళం మధ్య ప్రత్యేక రైలుసర్వీసులను నడుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. శ్రీకాకుళం నుంచి బెంగళూరు కంటోన్మెంట్ వెళ్ళే నంబర్ 08553 ప్రత్యేక రైలు ఈనెల 21న శుక్రవారం మధ్యాహ్నం 03:30 గంటలకు శ్రీకాకుళం నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 02:45 గంటలకు బెంగళూరు కంటోన్మెంట్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బెంగళూరు కంటోన్మెంట్ నుంచి శ్రీకాకుళం వెళ్ళే నంబర్ 08554 ప్రత్యేక రైలు ఈనెల 24న సోమవారం మధ్యాహ్నం 02:00 గంటలకు బెంగళూరు కంటోన్మెంట్ నుంచి బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 05:00 గంటలకు శ్రీకాకుళం చేరుకుంటుంది. మార్గమధ్యంలో ఈరైళ్ళు చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, విశాఖపట్నం, దువ్వాడ, అనకాపల్లి, తుని, రాజమండ్రి, విజయవాడ, నంద్యాల,గుత్తి, ధర్మవరం, సత్యసాయి ప్రశాంతి నిలయం (పుట్టపర్తి) స్టేషన్‌లలో నిలుస్తాయి.



అవార్డులు అందజేస్తున్న డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా


## రైల్వేసిబ్బందికి మ్యాన్‌ఆఫ్‌ది మంత్ అవార్డులు

**గుంతకల్లు రైల్వే,నవంబరు 3, ప్రభాతవార్త:** వృత్తిపట్ల చిత్తశుద్ధి, నిబద్ధతలతో కష్టపడి పనిచేయాలని డి ఆర్ ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. స్థానిక డి ఆర్ ఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అక్టోబర్ నెలలో రైలు ప్రమాదాలను, దుర్ఘటనలను నివారించేందుకు కృషి చేసిన నలుగురు సిబ్బందికి మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో అదనపు డి ఆర్ ఎం సుధాకర్, రైల్వే ఉన్నతాధికారులు శ్రావణ్ కుమార్, జీ బి ఎస్ శ్రీనివాస్, ఆయా విభాగాల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీలో 7 వేల మందికి పదోన్నతులు

## రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**చిత్తూరు, నవంబరు 3 ప్రభాతవార్త:** ఎపి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో 7 వేల మందికి పదోన్నతులు కల్పించనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. చిత్తూరులో రూ. 54.51లక్షలతో నిర్మించిన ఎపిఆర్టీసీ ఉద్యోగుల వైద్యశాలను సోమవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎపిఎస్‌సి ఆర్టీసీకి ప్రయాణీకులు, కార్మికులు రెండు కళ్ళు లాంటివారని పేర్కొన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తుంటారని, స్త్రీశక్తి అమలులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆర్టీసీ ప్రక్షాళనకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. చిత్తూరు జిల్లా పరిధిలో 8 ఆర్టీసీ డిపోలకు సంబంధించి వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు వున్నారని, వారి ఆరోగ్యంను దృష్టిలో వుంచుకుని ప్రత్యేక వైద్యశాలను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా వుండాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగులు, వారి కుటుంబసభ్యుల ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వారికి మెరుగైన వైద్య సౌకర్యం కల్పించడానికి ప్రస్తుతం చిత్తూరు బస్టాండ్ నుండి 2 కిమీ దూరంలో వున్న ఆసుపత్రిని చేరుకోవడానికి వ్యయా ప్రయాసలు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోనే నూతన వైద్యశాల ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల నుండి త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు నడపడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పడి 16 నెలల కాలం అయ్యిందని ఈ కాలంలో సుమారు 1,450 కొత్త బస్సులను కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమలరావు, ఎపిఎస్‌ఆర్టీసీ ఛైర్మన్ కె.నారాయణరావు, ఎపిఎస్‌ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఆర్టీసీ జోనల్ మేనేజర్-4 పూల నాగరాజు, జిల్లా ప్రజా రవాణా అదికారి రాము, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, తదితరులు పాల్గొన్నారు.





## శ్రీకాళహస్తీశ్వరాయంలో కార్తీక సందడి

### వైష్ణవ కోనేరులో దీపోత్సవం

**శ్రీకాళహస్తి,నవంబరు 3 ప్రభాతవార్త:** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం వేకువ జాము నుంచి భక్తులతో కిట కిటలాడింది. కార్తీక మాసం రెండవ సోమవారం వేకువ జాము నుంచి రాహుకేతుదోష నివారణ పూజలు చేయించుకోవటానికి భక్తులు కిట కిటలాడారు. సోమవారం ఒక్కరోజే సుమారు ముఫై వేల మంది భక్తులు దర్శనం చేసుకొని ఉండవచ్చునని అంచనా. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఓలు, సూపరింటెండెంట్ పర్యవేక్షించారు. ఇఓ స్వయంగా తన ఛాంబర్లో కూర్చొని సిసి కెమెరాల్లో సమీక్షించారు.



సినీనటుడు నారారోహిత్‌కు మెమొంటో అందిస్తున్న ఛైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్

## శివయ్యసేవలో సినీ నటుడు నారారోహిత్

**శ్రీకాళహస్తి,నవంబరు 3 ప్రభాతవార్త:** కార్తీక మాసం శ్రీకాళహస్తీశ్వరాలయంలో అతిథుల తాకిడితో కిట కిట లాడుతుంది. సోమవారం కార్తీక మాసం రెండవ సోమవారం కావటంతో భక్తులతో పాటు విఐపిల తాకిడి పెరిగింది. వర్ధమాన సినీ నటుడు నారారామమూర్తినాయుడు కుమారుడు నారారోహిత్ కొత్తగా వివాహం కాగా శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చారు. వారికి ఆలయాధికారులు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ ఎంజిఎం ఛైర్మెన్ గుడ్లూరుమల్లికార్జున్‌నాయుడు, తెలుగుదేశం పార్టీకి చెందిన కాసరం రమేష్‌బాబు, బాలుడిల్లిబాబు ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కొట్టె సాయిప్రసాద్ ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, ఎఇఓ మోహన్, విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామి ఏర్పాట్లు చేసారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనంతో ప్రత్యేక పూజలు జరిపారు.

# రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్త నిల్వ

## ఒక్క చిత్తూరులోనే 1.5 లక్షల టన్నులు పేరుకుపోయిన వ్యర్థాలు

## రూ.13 కోట్లు ఖర్చుతో వ్యర్థాలు తొలగింపుకు చర్యలు

## ఎపి స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్

**చిత్తూరు, నవంబరు 3 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా గత వైకాపా ప్రభుత్వం సుమారు 85 లక్షల టన్నుల చెత్తను తొలగించక పోవడంతో రాష్ట్రం మొత్తం చెత్త నిల్వలు పేరుకుపోయాయని ఎపి స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ అన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఎపి స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దిశా నిర్దేశంతో రాష్ట్రంలో గత 11 నెలలు నుండి స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర ద్వారా చెత్త సేకరణ, నిర్వహణ, పారిశుధ్యంపై పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రతి 3వ శనివారం నిర్వహించే ఈ కార్యక్రమానికి సిఎం నారా చంద్రబాబునాయుడు స్వయంగా రాష్ట్ర నలుమూలల పర్యటించి ఈ కార్యక్రమంను పర్యవేక్షిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి రోజు చెత్త సేకరణ కార్యక్రమం పక్కాగా నిర్వహిస్తున్నామని, ఏ రోజు చెత్త ఆ రోజు సేకరించి ప్రాసెస్ చేసి తొలగించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. రాష్ట్రంను చెత్తకుండీ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యం అని అందుకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో చెత్త సేకరణ కార్యక్రమంను పక్కాగా చేపట్టి నగరాలు, పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా వుంచడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒక్క చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే గత వైకాపా ప్రభుత్వం 15 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 1.5 లక్షల టన్నుల చెత్తను వదలిపెట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేరుకుపోయిన చెత్తను తొలగించడానికి ప్రభుత్వం 13 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సిగ్మా సంస్థ ద్వారా ఈ కార్యక్రమంను మొదలుపెట్టడం జరిగిందని, బయో మైనింగ్ చేస్తున్నారని, అనంతరం ప్రాసెస్ చేసి డిసెంబర్ నెలాఖరులోపు రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రస్తుతం 15 ఎకరాల విస్తీర్ణంలో చెత్త నిల్వ వున్న స్థలంలో ఎపి గ్రీనరీ, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్‌ను సమన్వయం చేసుకుని రానున్న వేసవికాలంలోపు అందమైన పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎపి స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మున్సిపల్ కమీషనర్ నరసింహ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




సోమవారం మీడియాతో మాట్లాడుతున్న ఎపి స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్

## జిఓ 590ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

### కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధికారప్రతినిధి తులసి రెడ్డి

**తిరుపతి,నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పది ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రైవేట్ పరం చేస్తూ కార్పొరేట్‌లకు అప్పగించడాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని, జిఓ 590ని ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్‌పార్టీ ముఖ్యఅధికారప్రతినిధి ఎన్.తులసీరెడ్డి అన్నారు. వైద్యకళాశాలల్లో ప్రైవేట్ యాజమాన్యాలు మెడికల్ సీట్లను డబ్బుకు అమ్ముకుంటారని, దీనివల్ల పేదవిద్యార్థులు వైద్యవిద్యకు దూరమవుతారని అన్నారు. సంబంధిత ఆస్పత్రుల్లో పేదరోగులకు ఉచిత వైద్యానికి నోచుకోరని తెలిపారు. ఈ జిఓ వల్ల ప్రతిభకు పాడెకట్టడమేనని ఆయన విమర్శించారు. తిరుపతిలో మీడియాతో ఆయన మాట్లాడుతూ 590 జిఓ ఎన్టీఆర్ ఆశయాలకు పూర్తిగా విరుద్ధమని తులసీరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం వద్దనిధులు లేవని, ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రైవేట్ పరం చేస్తున్నామని చెప్పడం సాకుగా ఆయన అభివర్ణించారు. కళాశాల భవనాలన్నీ పునాది దశలోనే ఉన్నాయని చెప్పడం అబద్ధమన్నారు. జిఓను ఉపస:మరించుకోకుంటే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఈ మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రాంభూపాల్‌రెడ్డి, బాలగురవంబాబు, దామోదర్‌రెడ్డి, లోకేశ్‌రెడ్డి, .జ్యోతీశ్వర్‌నాయక్ ,గోవర్ధన్‌రెడ్డి ,అమర్నాధ్‌రెడ్డి, ఉత్తన్న రమణ పాల్గొన్నారు.

## ఎస్పీ అద్నాన్ నయీం అస్మికి జాతీయస్థాయి అవార్డు ప్రత్యేకంగా అభినందించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం, నవంబరు 3 ప్రభాతవార్త:** సోమవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాలకోడేరు మండలం గొల్లలకోడేరులోని జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి నేర పరిశోధన దర్యాప్తు రంగంలో పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మికి జాతీయస్థాయి అవార్డు వచ్చినందుకు పూల మొక్కను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ప్రత్యేక ఆపరేషన్, దర్యాప్తు మరియు ఫోరెన్సిక్ సైన్స్ రంగంలో 2025 సంవత్సరానికి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జరుపుకునే రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ ఐక్యతా దినోత్సవం) సందర్భంగా "కేంద్రీయ గృహమంత్రి దక్షత పదక్" అవార్డులను కేంద్ర ప్రభుత్వం ఈ గౌరవాన్ని ప్రకటించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక్క పశ్చిమగోదావరి జిల్లాకు మాత్రమే దర్యాప్తు రంగంలో అవార్డులను గెలుచుకోవడం జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా దర్యాప్తు రంగంలో అవార్డులకు ఎంపికైన వారిలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, అదనపు ఎస్పి వి.భీమారావు, డి.ఎస్.పి ఆర్.జి జయ సూర్య, ఎస్ఐ ఎండి నసిరుల్లా ఉన్నారు.

## అడవి జంతువుల ఉచ్చులో పడి ఇద్దరు మృతి

**బంగారుపాళ్యం, నవంబర్ 3 ప్రభాతవార్త:** అడవి జంతువుల కోసం ఏర్పాటు చేసిన ఉచ్చులో పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ సంఘటన చిత్తూరు జిల్లా బంగారుపాళెం మండలంలోని బండ్లదొడ్డి గ్రామ సమీప మామిడి తోటలో సోమవారం తెల్లవారుజాము చోటు చేసుకుంది. గ్రామానికి సమీపంలోని మామిడితోటకు అతి దగ్గరలో అటవీ ప్రాంతం వున్నది. ఈ అటవీ ప్రాంతంలో అడవి పందులు, దుప్పులు, ఇతర జంతువులు సంచరిస్తుంటాయి. అడవి పందుల మాంసం కోసం రైతులు విద్యుత్ తీగలను మామిడి తోటలో ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన అయ్యప్ప, కుట్టిలు ఈ విద్యుత్ తీగలను గుర్తించక మామిడి తోపు గుండా అడవి వైపుకు పయనించారు. ఈ విద్యుత్ తీగలను వారు గుర్తించలేక పోవడంతో విద్యుత్‌షాక్‌కు లోనై మామిడి తోటలోనే మృతి చెందారు. వీరితో పాటు ఓ అడవి పంది సైతం విద్యుత్‌షాక్‌కు గురై వారికి సమీపంలోనే మృత్యువాత పడింది. సోమవారం పశువుల కాపర్లు మృతి చెందిన అయ్యప్ప, కుట్టిల మృతదేహాలను గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. అటవీశాఖ అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇన్స్‌పెక్టర్ కత్తిశ్రీనివాసులు, ఎస్ఐ మల్లప్ప ఇతర సిబ్బంది, అటవీశాఖ అధికారులు గ్రామానికి చేరుకున్నారు. విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన అయ్యప్ప, కుట్టిలను పరిశీలించి అనంతరం శవపరీక్ష నిమిత్తం మృతదేహాలను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కార్తీక మాసం రద్దీకి తగిన విధంగా ఏర్పాట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**విజయవాడ,అక్టోబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్ర కార్తీక మాసం సందర్భంగా ప్రముఖ ఆలయాలకు భక్తుల రద్దీ పెరిగిన నేపథ్యంలో కాకినాడ జిల్లా పరిధిలోని ప్రముఖ క్షేత్రాల్లో భక్తుల భద్రత, సౌకర్యాల కల్పనపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అధికారులతో ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. క్యూ లైన్ల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ, భద్రతాపరమైన అంశాలపై తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా భక్తులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. కాకినాడ జిల్లా పరిధిలో ప్రముఖ శైవ క్షేత్రాలయిన సామర్లకోట కుమార భీమేశ్వరస్వామి ఆలయం, పిఠాపురం శ్రీ పాద గయ, అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయాలతోపాటు పలు ప్రధాన ఆలయాల్లో కార్తీక మాసంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని స్పష్టం చేశారు. సోమవారం మధ్యాహ్నం కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీతోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులకు పుణ్య క్షేత్రాలు, దేవాలయాలలో ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ నెల 5వ తేదీన కార్తీక పౌర్ణమి ఉన్నందున ఆ రోజు, ఆతరవాతి రోజు ఉండే రద్దీని అంచనా వేసుకోవాలి.

## పులికాట్ సరస్సుకు శీతాకాలం అతిథుల రాక: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

**విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** పులికాట్ సరస్సుకు శీతాకాలం అతిథుల రాక మొదలైందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. సైబీరియన్ పక్షుల రాకపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పవన్ స్పందించారు. పులికాట్ సరస్సుకు సైబీరియన్ పక్షులు వస్తున్నాయని.. వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి వస్తున్న సైబీరియన్ పక్షులు ఫ్లెమింగోలు (రాజహంసలు) అందరికీ కనువిందు చేయడానికి సిద్ధమయ్యాయన్నారు. ఆహారం, విశ్రాంతి నిమిత్తం ఆరు నెలలపాటు మన పులికాట్ పరిసరాల్లో ఉంటాయని తెలిపారు. ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా ఫ్లెమింగోలు ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా అటవీ శాఖ ఆధ్వర్యంలో అనుకూల పరిస్థితులు కల్పిస్తున్నామని వెల్లడించారు. ఫ్లెమింగోల ఆహారం, విశ్రాంతి, భద్రతకు ఇబ్బందులు కలగకుండా గత కొంత కాలంగా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. ఈసారి మూడు రోజుల పండుగతో సరిపెట్టకుండా ఎకో టూరిజాన్ని విస్తరించే ప్రక్రియలో భాగంగా ఫోటోగ్రఫీ, బర్డ్ సీయింగ్, ఎకో క్లబ్ పేరిట వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. మొంథా తుపానుకు ముందు నుంచే ఫ్లెమింగోల రాక మొదలయ్యిందని పవన్ అన్నారు.

## గ్రూప్1 వివాదం.. ఏపీపీఎస్సీకి హైకోర్టు కీలక ఆదేశాలు

**విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రూప్1 వివాదంపై ఏపీ హైకోర్టులో సోమవారం మరోసారి విచారణ జరిగింది. గ్రూప్1 జవాబు పత్రాలను హాయ్‌ల్యాండ్‌కు తరలించాలనే నిర్ణయంఎవరిదని ప్రశ్నించింది న్యాయస్థానం. జవాబు పత్రాలను హాయ్‌ల్యాండ్ నుంచి.. తిరిగి ఏపీపీఎస్సీకి ఎప్పుడు తరలించారని హైకోర్టు నిలదీసింది. బిల్లుల చెల్లింపు విషయంలో సంబంధిత వివరాలు తమముందు ఉంచాలనిన్యాయస్థానం ఆదేశించింది. జవాబు పత్రాలను సీల్డ్ కవర్‌లో అందజేయాలని ఏపీపీఎస్సీకి ఆజ్ఞాపించింది. తదుపరి విచారణని ఈనెల(నవంబరు)11వ తేదీకి ఏపీ హైకోర్టు వాయిదా వేసింది.

## ట్రైల్ కోర్టులో విధించిన శిక్షను సమర్థించిన హైకోర్టు

**విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో సంచలనం సృష్టించిన చిన్నారి పలగాని వైష్ణవి కిడ్నాప్, హత్య కేసులో ట్రైల్ కోర్టులో తమకు విధించిన శిక్షను ఏపీ హైకోర్టు సమర్థించింది. ట్రైల్ కోర్టు తీర్పును రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు లో నేరస్తులు పిటిషన్లు వేశారు అయితే, ఈ కేసులో మోర్ల శ్రీనివాసరావు, యంపరాల జగదీష్ అప్పీళ్లను హైకోర్టు.కొట్టివేసింది నిందితులకి జీవిత ఖైదు విధింపును హైకోర్టు సమర్థించింది. మరో నిందితుడు పంది వెంకట్రావును నిర్దోషిగా ధర్మాసనం ప్రకటించింది ట్రైల్ కోర్టు వెంకట్రావుకు విధించిన జీవితఖైదును హైకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు ఇవాళ (సోమవారం) జస్టిస్ కె సురేష్ రెడ్డి, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డిలతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. 2010 జనవరి 30వ తేదీన వ్యాపారవేత్త పలగాని ప్రభాకర్ రావు కుమార్తె వైష్ణవిని ఆయన పెద భార్య ప్రోత్సాహంతో విజయవాడలో నిందితులు. కిడ్నాప్ చేసి హత్య చేశారు గుంటూరు ఆటోనగర్‌లో శారద ఇండ్రస్ట్రీలో విద్యుత్ కొలిమిలో మృతదేహాన్ని వేసి బూడిద చేశారు నిందితులు. కుమార్తె హత్య గురించి తెలిసి గుండెపోటుతో మరణించారు పలగాని ప్రభాకర్. విచారణ అనంతరం 2018 జూన్ 14వ తేదీన ఈ కేసులో ముగ్గురికి జీవిత ఖైదు విధించింది విజయవాడ సెషన్స్ కోర్టు. ఈ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో నిందితులు వేర్వేరుగా అప్పీళ్లు వేశారు,

# విశాఖ సమ్మిట్‌లో 'టెక్స్‌టైల్స్'ఎంఒయులు:మంత్రి సవిత



సచివాలయంలో ఉన్నతాధికారులతో చర్చిస్తున్న జౌళి బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

**సచివాలయం,నవంబరు 3,ప్రభాతవార్త :** ఈనెల 14,15తేదీల్లో విశాఖలో జరగనున్న పార్టనర్ షిప్ సమ్మిట్‌లో టెక్స్‌టైల్స్ రంగంలో ఎంఒయులు చేసుకోబోతున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు.విశాఖ సమ్మిట్‌లో రెండుస్టాళ్ళు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో రాష్ట్ర చేనేత,జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి ఆర్పీ సిసోడియా,కమీషనర్ రేఖారాణి,ఇండస్ట్రీస్ కార్యదర్శి యువరాజ్‌తో మంత్రి సవిత సోమవారం సమావేశమయ్యారు.పార్టనర్ షిప్ సమ్మిట్‌లో భాగంగా టెక్స్‌టైల్స్ రంగంలో ఎంఒయులకు ప్రత్యేక సమయం కేటాయిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.ఇప్పటికే ఏపిలో టెక్స్‌టైల్స్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిన పెట్టుబడి దారులను విశాఖ సమ్మిట్‌కు తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాష్ట్రంలో ఏయే ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారు. ఎంతమేర పెట్టుబడులు పెడుతున్నారో? మంత్రి అడిగి తెలుసుకున్నారు.

**విశాఖ సమ్మిట్‌లో 2స్టాళ్ళు ఏర్పాటు**

విశాఖ సమ్మిట్‌లో భాగంగా ఏపి పెవిలియన్ ఏరా ్పటు చేస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు.ఈ పెవిలియన్ రెండు స్టాళ్ళు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. అందులో ఒక దానిలో ఓడి ఓపి అవార్డులు పొందిన వస్త్రాలను,కళా రూపాలను ఏర్పాటు చేయనున్నామన్నారు.మరో దాంట్లో అన్ని రకాల చేనేతదుస్తులు విక్రయించేలా నిర్ణయిం చామన్నారు.

కార్యక్రమంలో చేనేత,జౌళి శాఖాధికారులు, తదితరలు పాల్గొన్నారు.

## సీడ్ యాక్సెస్ రహదారికి అనుసంధానంగా రూ.70కోట్లతో స్టీల్ రోడ్డు

**విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అమరావతి వెళ్లే సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా ఈ -3(ఎలివేటేడ్‌వేమూడవ దశ) రోడ్డును పాత జాతీయ రహదారికి అనుసంధానం చేసేందుకు స్టీల్ వంతెన నిర్మిస్తున్నారు. కేఎల్‌రావు కాలనీ వద్ద కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాలువపై స్టీల్ వంతెన నిర్మించేందుకు అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్) రూ.70 కోట్లతో పనులు ప్రారంభించింది. 128 మీటర్ల పొడవున నాలుగు లైన్లుగా డెల్టా కాలువపై నిర్మించే స్టీల్ వంతెన ప్రకాశం బ్యారేజీ నుంచి ఉండవల్లి సెంటర్‌కు వెళ్లే మార్గంలో కేఎల్‌రావు కాలనీ వద్ద రోడ్డుకు అనుసంధానం చేస్తారు. దీని పనులు మూడు నెలల్లో పూర్తి చేయాలని సంకల్పించినట్లు ఏడీసీఎల్ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. రాజధాని అమరావతికి వెళ్లే వాహనాలు కృష్ణా కరకట్ట మీద కాకుండా నేరుగా స్టీల్ వంతెన మీదుగా సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి వెళ్లిపోయే విధంగా వంతెన నిర్మాణం ప్రారంభించారు. ఇందుకుగాను పీడబ్ల్యూడీ వర్క్‌షాప్ వద్ద వంతెనకు సంబంధించి పిల్లర్ నిర్మాణ పనులు చేపట్టారు. పెనుమాక, ఉండవల్లి రైతులు రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూములు ఇవ్వడంతో పనుల్లో వేగం పుంజుకున్నాయి. ఉండవల్లిలో ఇటీవల 12.40 ఎకరాలు రోడ్డు నిర్మాణానికి రైతులు తమ భూములు ఇచ్చేందుకు అంగీకార పత్రాలను అందజేశారు. మరో 5.6 ఎకరాలు రైతులనుంచి భూ సమీకరణ కింద తీసుకోవాల్సి ఉంది. వారితో కూడా అధికారులు చర్చిస్తున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రకాశం బ్యారేజీ వద్ద నుంచి అమరావతి రాజధానికి వెళ్లేవారు డెల్టా కాలువపై నిర్మించే స్టీల్ వంతెన మీదుగా నేరుగా చేరుకునే వెసు లుబాటు కలుగుతుంది.ఉండవల్లి సెంటర్‌లోని కేఎల్‌రావు కాలనీ వద్ద నుంచి 16వ నంబర్ జాతీయ రహదారిని అనుసంధానం చేస్తూ మరో పైవంతెన నిర్మించేందుకు సంకల్పించారు. కేఎల్‌రావు కాలనీనుంచి జాతీయ రహదారిని కలవాలంటే రోడ్డు మార్గంలో చెన్నై కలకత్తా రైలు మార్గంతోపాటు డెల్టా కాలువ ఉంది. వీటిపై నుంచి మరోవంతెన నిర్మాణానికి ప్రతిపా దించారు. త్వరలోనే దీని నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించనున్నట్లు అధికారులు తెలిపారు.

# డ్రోన్ సర్వేకు శ్రీకారం చుట్టిన సర్వే బృందం



**డి.హిరెహాళ్ నవంబరు 3 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా డి.హిరెహాళ్ మండలం మలపనగుడి సర్వే నంబర్ వన్ ఓఎంసీ గాలి జనార్దన్ రెడ్డి కి చెందిన అంతరగంగమ్మ లీజు 68.5 హెక్టార్లలోని మైనింగ్ లీజులో సర్వే బృందం సభ్యులు సోమవారం డ్రోన్ సర్వేకు శ్రీకారం చుట్టారు. సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్ శాఖ, గనులు భూగర్భశాఖ, అటవీశాఖ ల సర్వే బృందం సంయుక్తంగా చేపట్టిన డ్రోన్ సర్వే ను ఏజీకే మైనింగ్ లీజు లో విజయవంతంగా పూర్తి చేసినట్లు స్థానిక మండల సర్వేయర్ రవితేజ తెలిపారు. ఏజీకే మైనింగ్ లో మంగళవారం ఈ సర్వే నిర్వహణకు సుప్రీంకోర్టు నియమించిన 6 మంది సభ్యుల బృందంతో కూడిన లీడర్ సర్వే చేపట్టడం జరుగుతుందని మండల సర్వేయర్ తెలిపారు. అదే సమయంలో మూడు శాఖలతో కూడిన సర్వే బృందం మరో ఐదు లీజులు ఓబులాపురం సర్వే నంబర్ వన్ లోని గాలి జనార్ధన రెడ్డి కి చెందిన మైనింగ్ లీజులు ఓఎంసీ1లో 25.98 హెక్టార్లు, ఓఎంసీ 2లో 39.5 హెక్టార్లు, ఏఎంసి లో 6.5 హెక్టార్లు లీజులతోపాటు వైఎం 20.24 హెక్టార్లు, హెచ్.సిద్దాపురం సర్వే నంబర్ వన్ లోని ఎస్.కె. మోడీకి చెందిన బిఐపి లో 27.12 హెక్టార్లు లో డ్రోన్ సర్వే చేపట్టనున్నారు. వివాదాస్పదమైన ఈ ప్రాంతంలోని ఐదు మైనింగ్ లీజుల్లో డ్రోన్ సర్వే పూర్తయిన వెంటనే లీడర్ టీం సభ్యులు పరిశీలించి లీజుల వారీగా వివాదాస్పదమైన సరిహద్దు రాళ్ల నిర్ధారించి ఏర్పాటుచేయనున్నారు. మండల పరిధిలోని ఓబులాపురం, హెచ్.సిద్దాపురం, మల్లపడగుడి గ్రామాల పరిధిలోని ఏజీకే, ఓఎంసీ1, ఓఎంసీ 2, ఏఎంసి, వై ఎం, బి ఐ ఓ పి ఆరు మైనింగ్ లీజుల్లో 187. 84 హెక్టార్లలో వివాదాస్పదమైన మైనింగ్ లీజుల బౌండరీలను డ్రోన్ సహకారంతో సర్వేలు నిర్వహించి సరిహద్దులు సరిదిద్ది వివాదానికి తెరదించనున్నట్లు ఆయా శాఖల అధికారులు చర్చించుకుంటున్నారు. డ్రోన్ సర్వే, లీడర్ సర్వేల అనంతరం సర్వే నిర్వహణకు సుప్రీంకోర్టు నియమించిన ఆరు మంది సభ్యుల కమిటీ చైర్మన్ రిటైర్డ్ జడ్జ్ సుధాంసుదులియ వివాదాస్పద 6 మైనింగ్ లీజులను సందర్శించి సరిహద్దులను పరిశీలించి టీమ్ సభ్యుల తో చర్చించి నివేదికలు తయారుచేసి సుప్రీంకోర్టుకు నివేదించనున్నట్లు అధికారులద్వారా తెలిసింది. ఈ కార్యక్రమంలో సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్ డి డి. వై. జయరాజ్, డిప్యూటీ డైరెక్టర్ సూర్యరావు, డ్రోన్ టీమ్ సర్వేయర్లు, గనులుభూగర్భశాఖ, అటవీ శాఖ అధికారులు ఫారెస్ట్ అధికారులు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీల విజేత కృష్ణా జిల్లా

### విన్నర్స్‌గా నిలిచిన అండర్-19 బాల బాలికల జట్లు

### రన్నర్స్‌గా నిలిచిన అనంతపురం జిల్లా బాల బాలికల జట్లు



విన్నర్స్‌గా నిలిచిన కృష్ణా జిల్లా బాలుర జట్టు


**ఉరవకొండ, నవంబర్ 3 ప్రభాతవార్త:** సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీల్లో కృష్ణా జిల్లా బాల బాలికల జట్లు అండర్-19 విభాగంలో విజేతలుగా నిలిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించాయి. అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణంలోని జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ 69వ సెపక్ తక్రా రాష్ట్రస్థాయి పోటీలు అనంతపురం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆది, సోమ వారాల్లో రెండు రోజులపాటు కొనసాగాయి. చివరి రోజు పోటీలు రసవత్తరంగా ఉత్కంఠ భరితంగా కొనసాగాయి. అండర్-19 బాల బాలికల విభాగాల్లో కృష్ణా, అనంతపురం జిల్లా జట్లు ఫైనల్ మ్యాచ్‌ల్లో తలబడగా కృష్ణా జిల్లా జట్లు విన్నర్స్‌గా నిలువగా అనంతపురం జిల్లా జట్లు రన్నర్స్‌గా నిలిచాయి. అండర్-14 బాలుర విభాగం ఫైనల్స్‌లో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లా జట్లు పోటీ పడగా తూర్పు గోదావరి జిల్లా జట్లు విన్నర్స్‌గా నిలిచింది. బాలికల విభాగంలో నెల్లూరు, పశ్చిమ గోదావరి జిల్లా జట్లు పోటీపడగా నెల్లూరు జిల్లా జట్టు విన్నర్స్‌గా నిలిచింది. పోటీల అనంతరం బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.రాజేశ్వరి అధ్యక్షతన అట్టహాసంగా జరుగగా ఎంఈవోలు హెచ్.ఈశ్వరప్ప, పి.రమాదేవి, ఎస్.కె.ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ సెపక్ తక్రా ఫెడరేషన్ కార్యదర్శి శ్రీనివాసులు, పరిశీలకులు రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై రన్నర్స్, విన్నర్స్ జట్లకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పోటీల కార్యనిర్వాహక కార్యదరి ్శ చందా మారుతీప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు పుల్లా రాఘవేంద్ర, కె.నాగరాజు, టి.ప్రభాకర్, బి.సంజీవకుమార్, నాగేంద్ర, కృష్ణ, జనార్ధననాయుడు, హాలీమా, ఇస్మాయిల్, సురేష్, ఓబులేసు, మౌనిక, సునీల్, బండారు శ్రీనివాసులు పాల్గొన్నారు.

# సేవ చేయడమే మా లక్ష్యం

### ఉదయగిరి అభివృద్ధికి కృషి చేస్తాం

### ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

### వీపీఆర్ నేత్ర వైద్య శిబిరం ప్రారంభం





**వరికుంటపాడు (నెల్లూరు), నవంబర్ 3, ప్రభాతవార్త :** తాము పెత్తనం చేయడానికి రాజకీయాల్లోకి రాలేదని సేవ చేయడమే తమ లక్ష్యం అని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు అన్నారు. సోమవారం మండలంలోని రామాపురం గ్రామంలో వీపీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో వీపీఆర్ నేత్ర వైద్య శిబిరం వాహనాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించి, రిబ్బన్ కట్ చేసి అట్టహాసంగా ప్రారంభించారు. అత్యంత ఆధునిక పరికరాలతో అనుభవజ్ఞులైన డాక్టర్లతో ఉచితంగా కంటి పరీక్షలు చేసి, విలువైనకంటి అద్దాలు ఇవ్వడం జరుగుతుందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. అనంతరం టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు అధ్యక్షతన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీపీఆర్ ఫౌండేషన్ అధినేత నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఏ కార్యక్రమం మొదలు పెట్టిన ఉదయగిరి నుండే ప్రారంభిస్తానని అందులో భాగంగానే వీపీఆర్ నేత్ర మొబైల్ వాహనాన్ని రామాపురంలో ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడంలో ముఖ్య పాత్ర పోషించిన టీడీపీ మండల చంద్ర మధుసూదన్‌రావు, జడ్పీటీసీ సభ్యులు రావెళ్ల నాగేంద్రలను ఆయన అభినందించారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ చంచల బాబు యాదవ్, నాయకులు మన్నేటి వెంకటరెడ్డి, వరికుంటపాడు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్ యాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జే లక్ష్మీ నారాయణ, రామాపురం సర్పంచ్ ఆరికొండ పెంచలమ్మ, సొసైటీ అధ్యక్షులు గుర్రం గోపి, నాయకులు పోకా మహేష్, నాదెండ్ల రాజేంద్ర, పొద మాధవ్, అంద్ర గురువారెడ్డి, తెల్లగొర్ల వెంకటయ్య, వేమూరి మధు, సందిరెడ్డి నాగేశ్వరరావు, గొడుగులూరు మాలకొండరా యుడు, కాకొల్లు వెంకటరత్నం, వడ్లమూడి నాగేంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టే వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ రసూల్, పఠాన్, సొసైటీ డైరెక్టర్లు మానం కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎంఇ పార్కుల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి : మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**సచివాలయం,నవంబరు 3,ప్రభాతవార్త :** రాష్ట్రంలోని 175నియోజకవర్గాల్లో అభివృద్ధి చేస్తున్న ఎంఎస్ఎంఈ పార్కుల్లో మౌలిక వసతుల కల్పన త్వరితగతిన చేపట్టాలని,వీలైనంత త్వరగా నీరు,రోడ్డు,విద్యుత్ తదితర మౌలికవసతుల కల ్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని,రాష్ట్ర సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమలు,గ్రామీణ పేదరిక నిర్మూలన,ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని 5వ బ్లాక్‌లో ఉన్న సమావేశ మందిరంలో ఎంఎస్ఎంఈ, ఏపిఐఐసి అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట ్రంలో అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక విధానాల ద్వారా ఎంఎస్ఎం ఈల అభివృద్ధిని వేగవంతం చేయాలని,ఇందుకు తగిన కార్యాచరణ,స్పష్టమైన భవిష్యత్తు ప్రణాళికలతో ముందుకు వెళ్ళాలని సూచించారు.నూతన పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే విధంగా అధికారులు పనితీరు ఉండాలని,ప్రభుత్వం అందిస్తున్న పారిశ్రామిక ప్రోత్సాహకాలను సమర్థవంతంగా నూతన పారిశ్రామిక వేత ్తలు వినియోగించుకునే విధంగా ఎప్పటికప్పుడు పనిచేయాలని,వారికి అవసరమైన చట్టపరమైనర అనుమతులను జారీ చేసే విషయంలో జాప్యం చేయరాదని మంత్రి సూచించారు.నూతన పారిశ్రామిక వాడల్లో నిర్మించ తలపెట్టిన భవనాలు,ఇతర మౌలిక వసతులపై ఈ సమీక్షా సమావేశంలో మంత్రి దిశా నిర్దేశం చేశారు.ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలు,దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు అందిస్తున్న ప్రోత్సాహకాలకు అనుగుణంగా మన పారిశ్రామిక విదానం ఉండాలని,ఇందుకోసం అవసరమై మార్పులు చేర్పులతో వ్యాపార అనుకూల వాతావరణాన్ని సృష్టించాలని మంత్రి కొండపల్లి అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్,ఎంఎస్ఎంఈ అభివృద్ధి సంస్థ సీఈఓ విశ్వమనోహర్,ఏపిఐఐసి అధికారులు పాల్గొన్నారు.

## వైయస్సార్సీపి శ్యామల విచారణ 65 ప్రశ్నలు సంధించిన పోలీసు అధికారులు కేసులకు భయపడం ప్రజా తరపున పోరాడుతాం: శ్యామల

**కర్నూలు, నవంబర్ 3, ప్రభాతవార్త :** వైయస్సార్సీపి అధికార ప్రతినిధి యాంకర్ శ్యామలను కర్నూలు పోలీసులు విచారించారు బస్సు దగ్ధం సంఘటనపై సోషల్ మీడియాలో ఆమె పెట్టిన పోస్ట్ లపై కర్నూలు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు ఆ మేరకు ఆమెకు నోటీసులు అందించారు నోటీసులు తీసుకున్న ఆమె సోమవారం మధ్యాహ్నం కర్నూల్ డిఎస్పి కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. కర్నూలు డీఎస్పీ ఆఫీసులో రెండు గంటల పాటు శ్యామలను డీఎస్పీ బాబు ప్రసాద్ విచారించారు. దాదాపు 65 ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. బస్సు ప్రమాదం ఘటనకు సంబంధించి చేసిన వ్యాఖ్యలపై ఆధారాలు చూపాలని డీఎస్పీ కోరినట్లు సమాచారం. విచారణ అనంతరం శ్యామల మీడియాతో మాట్లాడుతూ విచారణలో పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పానని అన్నారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపలేదా?.. బైకర్ మద్యం తాగలేదా ? అంటూ ఆమె మీడియా ముందు ప్రశ్నించారు ఇలాంటి కేసులకు తమ పార్టీ భయపడదని తమ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పోరాడుతామని ఆమె అన్నారు.

## టీడీపీక్రమశిక్షణ కమిటీ ముందుకు తిరువూరు ఎంఎల్ఏ, విజయవాడ ఎంపీల పంచాయతీ..

**విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావుల నడుమ నెలకొన్న వివాదం పరిష్కారం దిశలో టీడీపీ అధిష్టానం చర్యలు చేపట్టింది.ఈ అంశంలో ఉభయులకు పార్టీ నేరుగా ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది.స్వయంగా ఈ వ్యహారంపై తీవ్ర అసహనం ప్రకటించారు.పద్దతులు మార్చుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెల్చిచెప్పారు.విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో తిరువూరు పంచాయతీ మంగళవారం క్రమ శిక్షణ ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఏమి జరుగుతుందోనని సర్వత్ర ఆసక్తి నెలకొంది. మంగళవారం ఉదయం 11.00 గంటలకు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు.. సాయంత్రం 4.00 గంటలకు విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని క్రమశిక్షణ కమిటి ముందు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా వీరిద్దరి మధ్య చోటు చేసుకున్న పరిణామాలకు సంబంధించిన వివరాలను వేర్వేరుగా క్రమశిక్షణ కమిటీ అడిగి తెలుసుకోనుంది.

## కోల్డ్‌స్టోరేజ్ అగ్ని ప్రమాద బాధిత రైతులకు రూ.10.5 కోట్ల పరిహారం అందజేత

**జగ్గయ్యపేట, నవంబర్ 3, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ ్యపేట పట్టణ శివారులోని సాయి తిరుమల కోల్డ్‌స్టోరేజ్‌లో ఈ సంవత్సరం మార్చి 24వ తేదీన జరిగిన అగ్నిప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన మిర్చి రైతులకు ఎట్టకేలకు సోమవారం స్థానిక ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ చేతుల మీదుగా పరిహారం అందజేశారు. విద్యుత్ ఘాతం కారణంగా ఏడు నెలల క్రితం జరిగిన ఈప్రమాదంలో నిల్వచేసివున్న మిరప, అపరాలు పూర్తిస్థాయిలో కాలిపోయాయి. ఈప్రమాదం వలన మొత్తం 207 మంది రైతులు భారీ నష్టాన్ని చవిచూశారు. కోల్డ్‌స్టోరేజ్ భవనం కూడా పూర్తిగా కాలి బూడిదయ్యింది. అయితే కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యం బీమా క్రమబద్ధీకరణ చేయకపోవటంతో రైతుల నష్టపోవటం, తీవ్ర ఆందోళనకు గురికావటం జరిగింది. ఎంఎల్ఏ రాజగోపాల్ కృషిచేసి ఎంతోకొంత నష్టపరిహారం చెల్లింపజేసినట్లు బాధిత రైతులు కృతజ్ఞతలు తెలిపారు. 207 మంది రైతులకు దాదాపు 75 శాతం పరిహారం చెల్లించినట్లు, కొందరికి నగదుగా, మరి కొందరికి చెక్కులుగా అందజేసినట్లు మీడియాకు విడుదలచేసిన ప్రకటనలో తెలిపారు. కాగా కోల్డ్‌స్టోరేజ్ అగ్నిప్రమాదాల్లో పంట నష్టపోయిన రైతులకు ఇదే పరిహారం అందించిన తొలి ఘటనగా పేర్కొంటున్నప్పటికీ ఈప్రమాదానికి సంబంధించి ఇంకా వెలుగులోకి రాని పలు అంశాల గురించి సందేహాలు వ్యక్తమవుతుండటం గమనార్హం.

## జల రవాణా కోసం పుష్కలంగా వనరులు లండన్‌లో పారిశ్రామిక వేత్తల రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం చంద్రబాబు

**అమరావతి, నవంబరు 3 ప్రభాతవార్త:** అంతర్గత జలరవాణా మార్గాల ద్వారా అతి తక్కువ వ్యయంతో సరుకు రవాణా చేసేందుకు ఆస్కారం ఉందని ఏపీలో ఈ జల రవాణాకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. లాజిస్టిక్ కారిడార్ ద్వారా ఏపీని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రచిస్తున్నట్టు సీఎం లండన్‌లోని పారిశ్రామిక వేత్తలకు వివరించారు. లండన్ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు సోమవారం వివిధ పారిశ్రామిక వేత్తలతో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని అలాగే ఈ నెల జరగనున్న భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థలతో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్రంలో రోడ్డు, రైలు, వాయు మార్గాలతో పాటు అంతర్గతంగా ఉన్న జలవనరుల్లో జల రవాణా ద్వారా సరకు రవాణాపై పని చేసేందుకు ముందుకు రావాలని లండన్ లోని అరుప్ సంస్థను సీఎం కోరారు. లండన్ లోని ప్రముఖ నిర్మాణ రంగ సంస్థ ఆరుప్ గ్లోబల్ అఫైర్స్ డైరెక్టర్ జేమ్స్ కెన్నీ, డిజిటల్ రిస్క్ మేనేజ్మెంట్ కంపెనీ అల్లైరిన్ టెక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫ్రెడీ వూలాండ్, పీజీ పేపర్ కంపెనీ సీఈఓ పూనమ్ గుప్తా, జూలీబి యూనివర్సిటీ నుంచి గౌరవ్ మార్వాహా, మాంఛెస్టర్ యూనివర్సిటీ నుంచి నానోసైన్స్ ప్రొఫెసర్ రాధాబోయా, ఏఐ పాలసీ ల్యాబ్స్ ఫౌండర్ డైరెక్టర్ ఉదయ్ నాగరాజు, ఫ్లుయెంట్ గ్రిడ్ ప్రెసిడెంట్ రత్న గారపాటి, బ్రిటిష్ హెల్త్ ఇండస్ట్రీ అసోసియేషన్ ప్రతినిధి పాల్ బెంటన్ తదితరులు హాజరయ్యారు.ఏపీలోని టెక్నాలజీ రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోందని సీఎం వివరించారు. అమరావతిలోనూ వచ్చే జనవరి నాటికి ఏఐ క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ప్రారంభం కానుందని తెలిపారు.




# మహిళల వరల్డ్ కప్‌లో.. రన్నింగ్ హీరోయిన్స్

## అగ్రస్థానంలో న్యూజిలాండ్ హోక్లీ

## రెండో ప్లేస్‌లో భారత్ మిథాని

**న్యూఢిల్లీ:** ఐసిసి మహిళల ప్రపంచ కప్ అంటేనే అద్యాంతరం ఉత్కంఠ. పరుగులు, ఫోర్లు, సిక్స్‌లు. ఈ వరల్డ్ కప్ టోర్నీలో అద్భుతమైన బ్యాటింగ్, బౌలింగ్ ప్రదర్శనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మహిళల వరల్డ్ కప్‌లో అత్యధిక పరుగులు చేసిన టాప్ 10లో భారత్ నుండి ఇద్దరికే అవకాశం లభించింది. వీరిలో మిథాలీ రాజ్ రెండో ప్లేస్‌లో ఉండగా, హర్మన్ ప్రీత్ కౌర్ 9వ స్థానంలో ఉంది. ప్రపంచ కప్ చరిత్రలో న్యూజిలాండ్‌కు చెందిన డిఎ హోక్లీ అత్యధిక పరుగులు సాధించి అగ్రస్థానంలో ఉంది. మహిళల క్రికెట్ చరిత్రలో అత్యంత గౌరవనీయమైన పేర్లలో డెబ్బీ హోక్లీ ఒకరు. హోక్లీ 45 ప్రపంచ కప్ మ్యాచ్‌ల్లో పాల్గొని, 42.88 సగటు మరియు 57.16 స్ట్రైక్ రేట్‌తో 1501 పరుగులు చేసింది. ఆమె రెండు సెంచరీలు చేయగా, అత్యధిక స్కోరు అజేయంగా 100. ఆమె 1500 కంటే ఎక్కువ పరుగులు చేసిన మరియు 40 కంటే ఎక్కువ ప్రపంచ కప్ మ్యాచ్‌లలో కనిపించిన మొదటి మహిళగా నిలిచింది. రెండో స్థానంలో ఉన్న మిథాలీ రాజ్ వన్డే ప్రపంచ కప్‌లలో 38 మ్యాచ్‌ల్లో 47.17 సగటుతో 1321 పరుగులు చేసి, 67.67 స్ట్రైక్ రేట్ కలిగి ఉంది. 109 పరుగుల అత్యధిక స్కోరు మరియు బహుళ మ్యాచ్ విన్నింగ్ హాఫ్ సెంచరీలతో సహా రెండు సెంచరీలతో, ఆమె కీలక టోర్నమెంట్లలో భారత బ్యాటింగ్‌కు గుండెకాయగా నిలిచింది.

ముఖ్యంగా, 2005, 2017 లో భారతదేశాన్ని రెండు ఒఐడి ప్రపంచ కప్ ఫైనల్స్‌కు నడిపించిన ఏకైక భారత కెప్టెన్ (పురుష లేదా మహిళా) మిథాలీ. 2017 ప్రపంచ కప్‌లో, ఆమె 409 పరుగులు చేసి, భారతదేశపు టాప్ స్కోరర్‌గా, టోర్నమెంట్‌లో మొత్తం మీద రెండవ అత్యధిక పరుగులు సాధించిన క్రీడాకారిణిగా నిలిచింది. ఇక 9వ స్థానంలో ఉన్న హర్మన్‌ప్రీత్ కౌర్ వన్డే ప్రపంచ కప్‌లలో భారత్ తరపున అతిపెద్ద మ్యాచ్ విన్నర్లలో ఒకరు. ఆమె 26 మ్యాచ్‌లు ఆడి 22 ఇన్నింగ్స్‌లలో 51.52 సగటుతో 876 పరుగులు చేసింది. ఆమె స్ట్రైక్ రేట్ 94.39 ఆమె ఎంత త్వరగా స్కోర్ చేస్తుందో చూపిస్తుంది. ఆమె మూడు సెంచరీలు మహిళల క్రికెట్‌లో అత్యంత ప్రసిద్ధ నాక్‌లలో ఒకటి.

# ఫుట్‌బాల్ పిఎల్.. మాంచెస్టర్ సిటీపై హాలండ్ డబుల్ పవర్



**న్యూఢిల్లీ:** ప్రీమియర్ లీగ్ 2025-26లో బోర్న్‌మోత్‌ను ఓడించి మాంచెస్టర్ సిటీపై హాలండ్ డబుల్ పవర్‌ను సాధించింది. ఈ మ్యాచ్‌లో ఎర్లింగ్ హాలండ్ రెండు గోల్స్‌తో కఠినమైన ముగింపులో మరో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. మాంచెస్టర్ సిటీ 3-1 తేడాతో బోర్న్‌మోత్‌ను ఓడించి ప్రీమియర్ లీగ్‌లో రెండవ స్థానానికి చేరుకుంది. ఎతిహాద్ స్టేడియంలో జరిగిన మొదటి అర్ధభాగంలో విరామ సమయానికి ఈ నార్వేజియన్ రెండుసార్లు గోల్ చేసి, పెప్ గార్డియోలా జట్టుపై 19 పాయింట్లతో ఆధిక్యంలో నిలిచింది. దీంతో ప్రీమియర్ లీగ్ స్కోరింగ్ చార్టులో 10 ఆటల్లో 13 గోల్స్‌తో అగ్రస్థానంలో ఉన్న హాలండ్, 17వ నిమిషంలో ప్రతిష్టంభనను ఛేదించింది. హాఫ్‌వే లైన్ దాటి బంతిని ముందుకు తీసుకెళ్లి, ఆపై గోల్‌పై బారెల్ చేసి జోర్జ్ పెట్రోవిక్‌ను దాటుకుని గోల్ చేశాడు. 25వ నిమిషంలో బోర్న్‌మోత్ టైలర్ ఆడమ్స్ ద్వారా తిరిగి కొట్టాడు. సిటీ గోల్ కీపర్ జియాన్‌లుయిగి డొన్నరుమ్మ బంతిపై క్లీన్ పంచ్ కొట్టలేకపోవడంతో అది ఆడమ్స్ చేతిలో గోల్‌గా నిలిచింది. ఎనిమిది నిమిషాల తర్వాత హాలండ్ సిటీ గోల్‌తో ఆధిక్యంలోకి వచ్చింది. 60వ నిమిషంలో ఫిల్ ఫోడెన్ ఇచ్చిన పాస్‌ను అందుకున్న నికో ఓఖిరైల్లీ, బాక్స్ లోపలి నుంచి గోల్ కొట్టి సిటీ తరపున మూడో గోల్ చేశాడు.

# ఫిడే ప్రపంచ కప్.. తొలి రౌండ్‌లో దివ్య ఓటమి



**న్యూఢిల్లీ:** ఫిడే ప్రపంచ కప్ 2025లో భారత్ గ్రాండ్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ మొదటి రౌండ్‌లోనే ఓటమిపాలయింది. వైల్డ్‌కార్డ్ ఎంట్రీ పొందిన దివ్య గోవాలో జరిగిన ప్రపంచ కప్ నుండి మొదటి రౌండ్‌లో వరుసగా రెండో ఓటమితో నిష్క్రమించింది. తొలి గేమ్‌లో తెల్లటి పావులతో ఓడిపోయిన 19 ఏళ్ల దివ్య మహిళల ప్రపంచ కప్ ఛాంపియన్‌కు దాదాపు దూరమైనట్లే. ప్రపంచ కప్ ఛాంపియన్‌లో సజీవంగా ఉండాలంటే గ్రీకు గ్రాండ్ మాస్టర్ స్టామాటిస్ కౌర్కోలోస్ ఆర్డిటిస్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో విజయం తప్పనిసరి. దేశ్‌ముఖ్ స్టామాటిస్‌ను అధిగమించడానికి తన శాయశక్తులా ప్రయత్నించినా కానీ చివరికి 73మూవ్‌ల మారథాన్ గేమ్‌లో ఓటమిని అంగీకరించాల్సి వచ్చింది, ఎండ్‌గేమ్‌లో ఆమె ప్రత్యర్థి అదనపు బంటు తేడాను తెచ్చిపెట్టింది.

మరోపక్క అనుభవజ్ఞులైన సూర్య శేఖర్ గంగూలీ, గ్రాండ్ మాస్టర్ రౌనక్ సాధ్వానీ, గ్రాండ్ మాస్టర్ కార్తీక్ వెంకట్రామన్ సునాయాస విజయాలు సాధించగా, ఎం ప్రాణేష్ డ్రాగా ఆడి రెండవ రౌండ్‌కు చేరుకున్నాడు. అలాగే ఐఎం అరోన్యక్ ఘోష్ పోలాండ్‌కు చెందిన గ్రాండ్ మాస్టర్ మాటియుజ్ బార్టెల్‌ను ఓడించి మొదటి రౌండ్‌లో టైబ్రేకర్‌ను సాధించాడు. 42 ఏళ్ల గంగూలీ తిరిగి ఆడుతున్నప్పుడు, తొలి ఆటలో ఓడిపోయిన తర్వాత అహ్మద్‌జాదా స్కోరును సమం చేయడానికి రిస్క్‌లు తీసుకోవాల్సి వచ్చింది. కేవలం 28 కదలికల తర్వాత ప్రత్యర్థిని ఓడించి రెండవ రౌండ్‌కు చేరిన మొదటి భారతీయుడు అయ్యాడు.

# చెన్నై ఓపెన్ విజేత జానిస్



**న్యూఢిల్లీ:** చెన్నై ఓపెన్ 2025 విజేతగా జానిస్ ట్జెన్ తొలి డబ్ల్యూటిఎ టైటిల్ గెలుచుకుంది. ఓపెన్ చెన్నైలో జానిస్ తన తొలి డబ్ల్యూటిఎ టూర్ సింగిల్స్ ట్రోఫీతో తన బ్రేక్ అవుట్ సీజన్‌ను ముగించింది. 2002లో పట్టాయా సిటీలో ఏంజెలిక్ విడ్జాజా విజయం తర్వాత ఈ స్థాయిలో మొదటి ఇండోనేషియా ఛాంపియన్‌గా నిలవడం ఇదే మొదటిసారి. సరిగ్గా రెండు గంటల్లో నాల్గవ సీడ్ జెన్ 6-4, 6-3 తేడాతో ఏడో సీడ్ ఆస్ట్రేలియన్ కింబర్లీ బిర్రెల్‌పై గెలిచింది. 3 గంటల 24 నిమిషాల పాటు సెమీఫైనల్‌లో బిర్రెల్ చైనీస్ తైపీకి చెందిన జోవన్నా గార్లాండ్‌ను అధిగమించి, నాలుగు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుంది. థాయిలాండ్‌కు చెందిన లాన్లానా తరారుడీని రెండు గంటల 24 నిమిషాల్లో ఓడించిన జెన్, తన డబుల్స్ డ్యూటీని తన స్వదేశానికి చెందిన అల్డిలా సుట్జియాడితో కలిసి తెల్లవారుజామున 1 గంటలకు పూర్తి చేసింది. ఫైనల్ మొదటి సెట్‌లో, బిర్రెల్ యొక్క దారుణమైన బ్రేక్ పాయింట్ మార్పిడి -12 లో 1 మాత్రమే కావడం విశేషం. ఆమె వెంటనే సర్వ్‌ను వదులుకున్నా కానీ ట్జెన్ ప్రారంభ సర్వీస్ గేమ్‌లో ఆమెకు రెండు బ్రేక్ పాయింట్లు ఉండటంతో వెంటనే సమం చేసే అవకాశం లభించింది. అత్యంత కీలకమైన దశలో ఆమె ట్జెన్‌ను 0-40 నుండి 18 నిమిషాల పాటు సాగిన డ్యూస్‌లోకి లాగింది. ట్జెన్ నుండి డ్రాప్ షాట్‌ను బిర్రెల్ ఏకైక బ్రేక్ పాయింట్‌ను గోల్‌గా మార్చి 3-3తో సమం చేసింది. అయితే 65 నిమిషాల తొలి సెట్‌ను ముగించిన తర్వాత, ట్జెన్ రెండవ సెట్‌లో 4-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మ్యాచ్‌లో నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసిన ట్జెన్ ఎనిమిదో గేమ్‌లో రెండు కీలకమైన మొదటి సర్వ్‌లను కనుగొని బ్రేక్ పాయింట్‌ను కాపాడుకుని 5-3తో విజయం సాధించింది.

# అఫ్ఘానిస్థాన్ విజయం.. జింబాబ్వేపై 3-0తో సిరీస్ కైవసం

**న్యూఢిల్లీ:** ఆఫ్ఘనిస్తాన్ జట్టు జింబాబ్వేను వారి సొంత గడ్డపై ఊడ్చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. జింబాబ్వేలో జరిగిన నామమాత్రపు మూడో మ్యాచ్‌లో 9 పరుగుల తేడాతో ఆఫ్గన్ జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు నష్టానికి 210 పరుగులు చేసింది. ఓపెనర్లు రహ్మానుల్లా గుర్బాజ్ (92), ఇబ్రహీం జద్రాన్ (60) చెలరేగారు. ఆఖర్లో సెదిఖుల్లా అటల్ (35, నాటౌట్) సైతం మ ఎరుపు ఇన్నింగ్స్ ఆడాడు. జింబాబ్వే బౌలర్లలో ఈవాన్స్ 2, నగరవ ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే సైతం అద్భుతంగా పోరాడింది. నిర్ణీత ఓవర్లు బ్యాటింగ్ చేసి 201 పరుగులకు ఆలౌట్ అయింది. సికందర్ రజా (51), బ్రియాన్ బెన్నెట్ (47), ర్యాన్ బర్ల్ (37), ముసేకివా (28) పోరాడారు. ఆఫ్ఘనిస్తాన్ బలర్లలో అహ్మద్ జాయ్ 3, ఫజల్ హక్ ఫరూఖీ, ఫరీద్ అహ్మద్ మాలిక్ తలో 2 వికెట్లు, ముజీబ్, నబీ చెరో వికెట్ తీశారు. కాగా ఈ సిరీస్‌కు ముందుకు ఇరు జట్లు మధ్య జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో జింబాబ్వే ఇన్నింగ్స్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.





# తులం బంగారం రూ.1.23 లక్షలు!



## అదేదారిలో వెండి ధరలూ తగ్గుముఖం

**ముంబయి, నవంబరు 3:** బంగారం ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. డాలర్ విలువ బలపడటం, అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు తగ్గడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపుపై సానుకూల సంకేతాలు వంటి అంశాలు పసిడి ధరల పతనానికి కారణమయ్యాయి. తులం (10 గ్రాములు) 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1.25 లక్షలు దాటి రికార్డు సృష్టించగా, ప్రస్తుతం అది రూ.1.23 లక్షల వద్ద స్థిరపడింది. అక్టోబర్ నెలలో ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరిన తర్వాత ఈ తగ్గుదల నమోదైంది.

రష్యా-ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గడం, ట్రంప్-జిన్‌పింగ్ చర్చలు సానుకూలంగా సాగడం, దేశంలో పండుగల సీజన్ ముగియడం వంటి పరిణామాలు స్వల్పకాలంలో బంగారంపై ప్రతికూల ప్రభావం చూపాయని పీఎల్ క్యాపిటల్ డైరెక్టర్ సందీప్ రైచురా విశ్లేషించారు. గ్లోబల్ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర గరిష్ట స్థాయి నుంచి 4,000 డాలర్ల స్థాయికి పడిపోయిందని వెల్త్ ట్రస్ట్ క్యాపిటల్ సర్వీసెస్ సీఈఓ స్నేహ జైన్ తెలిపారు. డిసెంబర్ నాటికి ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. బంగారంతో పాటు వెండి ధరలు కూడా భారీగా తగ్గాయి. రెండు వారాల పాటు ఒడిదుడుకులకు లోనైన వెండి, ఇప్పుడు స్థిరత్వం దిశగా పయనిస్తోంది. అక్టోబర్‌లో కేజీ వెండి ధర రూ.2 లక్షలు దాటగా, ప్రస్తుతం రూ. 1.66 లక్షలకు తగ్గింది. ఈ ధర మరింత తగ్గే అవకాశం ఉందని స్నేహ జైన్ అభిప్రాయపడ్డారు. అయితే, భవిష్యత్తులో ధరల తగ్గుదల అనేది స్థూల ఆర్థిక డేటాపై ఆధారపడి ఉంటుందని ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ చేసిన వ్యాఖ్యలు లోహాల మార్కెట్‌ను ప్రభావితం చేశాయని వెంచురా కమోడిటీస్ హెడ్ ఎన్ఎస్ రామస్వామి పేర్కొన్నారు. అందువల్ల, పసిడి ధరలలో ఊహించని మార్పులు జరిగే ఆస్కారం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కూడా కీలక నిర్ణయం తీసుకుంది. బంగారం, వెండి బేస్ దిగుమతి ధరలను తగ్గించింది. బంగారం దిగుమతి ధరను 10 గ్రాములకు 42 డాలర్లు, వెండి దిగుమతి ధరను కేజీకి 107 డాలర్ల చొప్పున తగ్గించింది. అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా దేశీయ మార్కెట్లో ధరలను స్థిరంగా ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# ఐటి రిటర్నులు జాప్యం అయితే జరిమానాతో చాన్స్





**న్యూఢిల్లీ, నవంబరు 3:** ఆదాయపన్ను రిటర్నుల (ఐటీఆర్) దాఖలు గడువు ముగిసింది. సాంకేతిక కారణాల వల్ల ప్రభుత్వం గడువును సెప్టెంబర్ 16 వరకు పొడిగించినప్పటికీ, చాలామంది ఆ సమయానికి రిటర్నులు సమర్పించలేకపోయారు. అయితే, అలాంటి వారికి ఆదాయపన్ను శాఖ మరో అవకాశం కల్పిస్తోంది. జరిమానాతో కూడిన బిలేటెడ్ రిటర్న్ దాఖలు చేయడానికి ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు గడువు ఉంది. ఆలస్యంగా రిటర్నులు దాఖలు చేసేవారు తప్పనిసరిగా జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 234ఎఫ్ ప్రకారం, పన్ను చెల్లింపుదారుడి వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉంటే రూ.1,000, అంతకు మించితే రూ.5,000 జరిమానా విధిస్తారు. కేవలం జరిమానా మాత్రమే కాకుండా, చెల్లించాల్సిన పన్ను బకాయిలపై సెక్షన్ 234ఏ కింద నెలవారీగా 1 శాతం చొప్పున వడ్డీ కూడా కట్టాల్సి ఉంటుంది. గడువు ముగిసిన నాటి నుంచి రిటర్నులు దాఖలు చేసే తేదీ వరకు ఈ వడ్డీని లెక్కిస్తారని పన్ను నిపుణులు చెబుతున్నారు. జరిమానా, వడ్డీలే కాకుండా ఆలస్యంగా రిటర్నులు దాఖలు చేయడం వల్ల మరికొన్ని నష్టాలు కూడా ఉన్నాయి. గడువులోగా ఫైల్ చేస్తే పన్ను చెల్లింపుదారులు తమకు అనుకూలమైన పాత లేదా కొత్త పన్ను విధానాన్ని ఎంచుకోవచ్చు. కానీ గడువు దాటితే తప్పనిసరిగా కొత్త పన్ను విధానంలోనే రిటర్నులు సమర్పించాల్సి ఉంటుంది. వ్యాపార, మూలధన నష్టాలను తర్వాతి ఆర్థిక సంవత్సరాలకు బదిలీ (క్యారీ ఫార్వర్డ్) చేసుకునే అవకాశాన్ని కూడా కోల్పోతారు. ఇప్పటికే రిటర్నులు దాఖలు చేసి, అందులో ఏవైనా తప్పులు దొర్లినా లేదా కొన్ని ఆదాయ వివరాలను పొరపాటున పేర్కొనకపోయినా వాటిని సరిదిద్దుకునేందుకు రివైజ్డ్ రిటర్న్ దాఖలు చేయవచ్చు. వీటికి కూడా డిసెంబర్ 31 వరకే గడువు ఉంది. ఈ సవరణ రిటర్నులను ఎన్నిసార్లయినా దాఖలు చేసుకోవచ్చు మరియు దీనికి ఎలాంటి జరిమానా ఉండదు. ఈఫైలింగ్ పోర్టల్‌లో లాగిన్ అయి ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. ఒకవేళ డిసెంబర్ 31 గడువును కూడా అందుకోలేకపోతే అప్‌డేటెడ్ రిటర్న్ (ఐటీఆర్‌యూ) ఒక్కటే మార్గం. అసెస్‌మెంట్ సంవత్సరం ముగిసిన 48 నెలల వరకు దీన్ని దాఖలు చేయవచ్చు. అయితే, దీనికి చెల్లించాల్సిన అదనపు పన్ను, జరిమానాలు చాలా ఎక్కువగా ఉంటాయి. ఏదేమైనా, ఆలస్యమైనప్పటికీ రిటర్నులు దాఖలు చేయడం తప్పనిసరి. ఎందుకంటే రుణాలు, వీసా ప్రాసెసింగ్ వంటి వాటికి ఐటీఆర్ పత్రాలు కీలకమైన రుజువుగా పనిచేస్తాయి. రిటర్నులు దాఖలు చేయని వారికి ఆదాయపన్ను శాఖ నుంచి నోటీసులు వచ్చే అవకాశం కూడా ఉంటుంది.

# మిల్లీనియల్స్‌లో కృత్రిమ మేధ భయాలు!

**న్యూఢిల్లీ, నవంబరు 3:** దేశవ్యాప్తంగా కార్యాలయాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వాడకం పెరుగుతున్న నేపథ్యంలో, ఉద్యోగుల్లో కొత్త ఆందోళన మొదలైంది. రానున్న మూడు నుంచి ఐదేళ్లలో ఏఐ కారణంగా తమ ఉద్యోగాలు కోల్పోతామని దేశంలోని దాదాపు 50 శాతం మంది మిల్లీనియల్స్ భయపడుతున్నట్లు గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా సోమవారం ఒక నివేదిక విడుదలచేసింది. పని ప్రదేశాల్లో ఏఐ ప్రభావం, దానికి భారత ఉద్యోగులు ఎలా అలవాటు పడుతున్నారనే అంశంపై ఈనివేదిక సమగ్రంగా విశ్లేషించింది. ఆందోళనలు ఉన్నప్పటికీ, ఉత్పాదకతను, ఆవిష్కరణలను పెంచే సాధనంగా ఏఐను ఉపయోగించుకోవడానికి ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని, వారిలో సానుకూల దృక్పథం పెరుగుతోందని కూడా ఈ నివేదిక పేర్కొంది. ప్రస్తుతం దేశంలోని 54 శాతం ఉద్యోగులు పనిచేస్తున్న సంస్థలు ఏఐను పైలట్ లేదా మధ్యంతర దశలో అమలు చేస్తున్నాయని నివేదిక తెలిపింది. ఇది సాంకేతికత ఆధారిత సమర్థవంతమైన పని వాతావరణం వైపు సాగుతున్న ప్రగతిని సూచిస్తోంది. అయితే, ప్రతి పది మంది ఉద్యోగులలో నలుగురు (40శాతం) తమ ఉద్యోగాలను ఏఐ భర్తీ చేయగలదని భావిస్తున్నారు. ఈ భయం కేవలం యువతకే పరిమితం కాలేదని, అనుభవంతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ఉద్యోగులలోనూ కనిపిస్తోందని నివేదిక స్పష్టం చేసింది. మరో ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఏఐ వల్ల ఉద్యోగం పోతుందని భయపడుతున్న వారిలో 40 శాతం మంది తమ ప్రస్తుత కంపెనీని విడిచి వెళ్లాలని ఆలోచిస్తున్నట్లు తేలింది. ఇది హెచ్‌ఆర్ విభాగాలకు, కంపెనీల ఉన్నత యాజమాన్యాలకు ఒక తీవ్రమైన సమస్యగా మారుతోంది. ఈ నివేదికపై గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా సీఈఓ బల్బీర్ సింగ్ మాట్లాడుతూ, "సంస్థలు ఏఐ అమలులో ముందుకు సాగుతున్నప్పుడు, మానవ సామర్థ్యాలను దెబ్బతీయకుండా, వాటిని మరింత మెరుగుపరిచే వ్యూహాలను నాయకులు రచించాలి. సంస్థాగత ప్రతిఘటన, ఉద్యోగుల సంసిద్ధత ప్రస్తుతం ఎదురవుతున్న ప్రధాన అడ్డంకులని వివరించారు.



ఆసక్తికరంగా ఏఐను ఇంకా ఏమాత్రం అవలంబించని కంపెనీలలో పనిచేస్తున్న 57 శాతం మంది ఉద్యోగులు అభద్రతాభావంతో ఉన్నట్లు నివేదిక గుర్తించింది. అదే సమయంలో ఏఐ వినియోగంలో ఆధునిక దశలో ఉన్న కంపెనీలలో కేవలం 8 శాతం మంది మాత్రమే అభద్రతతో ఉన్నట్లు తేలింది. "సంస్థలు తమ కార్యకలాపాల్లో ఏఐ కోసం వాస్తవ వినియోగాలను గుర్తించి, ఆ కార్యక్రమాలలో ఉద్యోగులను భాగస్వాములను చేయాలి. వారి నైపుణ్యాలను పెంచే కార్యక్రమాలపై పెట్టుబడి పెట్టాలి. అప్పుడే ఈ మార్పును తట్టుకుని నిలబడగలరుని బల్బీర్ సింగ్ సూచించారు.




# టాటాట్రస్ట్ సభ్యునిగా మెహ్లీమిస్త్రీకి ఉద్వాసన

## న్యాయపోరాటానికి దిగిన మిస్త్రీ

**ముంబయి, నవంబరు 3:** టాటా గ్రూప్ దాతృత్వ సంస్థ టాటా ట్రస్ట్స్‌లో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. దివంగత పారిశ్రామిక వేత్త రతన్ టాటా అత్యంత సన్నిహితుల్లో ఒకరైన మెహ్లీ మిస్త్రీకి టాటా ట్రస్ట్స్ నుంచి తొలగించిన విషయం తెలిసిందే. టాటా గ్రూప్‌నకు చెందిన మూడు కీలక దాతృత్వ ట్రస్ట్‌లకు జీవితకాల ట్రస్టీగా మెహ్లీ మిస్త్రీని పునర్నియమించేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం లభించలేదు. టాటా ట్రస్ట్స్ చైర్మన్ నియోల్ టాటా, మరో ఇద్దరు ట్రస్టీలు మిస్త్రీ పునర్నియామకాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో మిస్త్రీ న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. ముంబై ఛారిటీ కమిషనర్ వద్ద కేవియట్ దాఖలు చేసినట్లు తెలిసింది. రతన్ టాటా అత్యంత సన్నిహితుల్లో ఒకరైన మెహ్లీ మిస్త్రీ 2022లో టాటా ట్రస్ట్స్‌కు ట్రస్టీగా నియమితులయ్యారు. అయితే, ఆయన మూడేండ్ల పదవీకాలం గతనెల 28తో ముగిసింది. దీంతో ట్రస్టీగా మెహ్లీ మిస్త్రీ మూడేండ్ల పదవీకాలం ముగుస్తుండటంతో ఆయన పునర్నియామకం చేపట్టారు. ఇందుకోసం అనుమతిని కోరుతూ ఇతర ట్రస్టీలకు టాటా ట్రస్ట్స్ సీఈఓ ఇటీవలే ఒక సర్క్యులర్ పంపారు. అయితే, ఈ ప్రతిపాదనను ట్రస్టీలు నోయల్ టాటా, టీవీఎస్ మోటర్ కంపెనీ చైర్మన్ ఎమిరేట్స్ వేణు శ్రీనివాసన్, రక్షణ శాఖ మాజీ కార్యదర్శి విజయ్ సింగ్‌లు వ్యతిరేకించారు. ఇదేసమయంలో సిటిబ్యాంక్ ఇండియా మాజీ సీఈవో ప్రమిత్‌ఝువేరి, ముంబైకి చెందిన న్యాయవాది డారియస్ ఖంబాటా, పుణెకు చెందిన ఫిలంత్రోఫిస్ట్ జహంగీర్ హెచ్‌సీ జహంగీర్‌లు మిస్త్రీకి మద్దతు పలికారు. అయినప్పటికీ మిస్త్రీపునర్నియామకానికి ఆమోదం లభించలేదు.

# వరుస నష్టాలకు బ్రేక్

## బ్యాంకులు, రియాల్టీల మద్దతుతో సెన్సెక్స్, నిఫ్టీ ర్యాలీ

**ముంబయి, నవంబరు 3:** దేశీయ స్టాక్ మార్కెట్లు రెండ్రోజుల వరుస నష్టాలకు సోమవారం బ్రేకులు వేశాయి. తీవ్ర ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో చివరికి స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియాల్టీ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టాలనుంచి సూచీలు కోలుకున్నాయి. సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈసెన్సెక్స్ 39.78 పాయింట్లు లాభపడి 83,978.49 వద్ద స్థిరపడింది. మరోవైపు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 41.25 పాయింట్ల లాభంతో 25,763.35 వద్ద ముగిసింది. ట్రేడింగ్ ప్రారంభంలో నష్టాల్లోకి జారుకున్న సెన్సెక్స్, ఆ తర్వాత కోలుకుని ఒక దశలో 84,127 గరిష్ఠ స్థాయిని కూడా తాకింది. నిఫ్టీ రోజంతా 25,700 నుంచి 25,800 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. 25,66025,700 స్థాయి వద్ద బలమైన మద్దతు లభించడంతో నష్టాల నుంచి బయట పడింది. కీలక అంతర్జాతీయ గణాంకాలు వెలువడనున్న నేపథ్యంలో మార్కెట్ సానుకూలంగానే ఉందని వారు విశ్లేషించారు. సెన్సెక్స్ స్టాక్స్‌లో మారుతీ సుజుకీ 3 శాతానికి పైగా నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. టైటాన్ కంపెనీ, బీఈఎల్, టీసీఎస్, ఐటీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా స్టీల్ వంటి షేర్లు కూడా నష్టపోయాయి. మరోవైపు, మహీంద్రా అండ్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టాటా మోటార్స్, హెచ్‌సీఎల్ టెక్ ప్రధాన లాభాల్లో కొనసాగాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.77 %, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.72 చొప్పున లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 1.92 % పెరిగి ర్యాలీకి నాయకత్వం వహించింది. బ్యాంక్ ఆఫ్ బరోడా 5 % మేర లాభపడగా, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా లాభాల్లో ముగిశాయి. మెటల్, రియాల్టీ సూచీలు కూడా 2% వరకు పెరిగాయి. దేశీయంగా కొత్త సానుకూల అంశాలు ఏవీ లేకపోవడంతో అధిక స్థాయిల వద్ద ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారని, అయినప్పటికీ కొన్ని రంగాలలో కొనుగోళ్ల మద్దతుతో మార్కెట్లు గ్రీన్‌లో ముగిశాయని నిపుణులు అభిప్రాయపడ్డారు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14